www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



భూభారతి అమలు ఎప్పుడో?

అసెంబ్లీ ఆమోదం పొంది నెల రోజులు 12

నిబంధనల తయారీపై మొదలుకాని కసరత్తు

స్పష్టత వస్తేనే పోర్టల్ అందుబాటులోకి!

ధరణి సాఫ్ట్‌వేర్ చిక్కులతో మరింత జాప్యం

శుక్రవారం | 24-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 296 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 7.25 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అనూరాధ పూర్తి; వర్జ్యం: ఉ. 9.28-11.12; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.50, మ. 12.49-1.34; అమృతఘడియలు: రా. 7.52-9.36; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.02 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దావోస్ ధమాకా!

దుమ్మురేపిన తెలంగాణ బృందం.. 1.78 లక్షల కోట్ల ఒప్పందాలు

- తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇవే భారీ పెట్టుబడులు
- చివరి రోజు దిగ్గజ అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు
- వీటితో రాష్ట్రంలో కొత్తగా 49,500 మందికి కొలువులు
- డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన బ్లాక్‌స్టోన్, టిల్మాన్ గ్లోబల్స్, ఉర్సా క్లస్టర్స్ సంస్థలు
- ఈ మూడు కంపెనీల పెట్టుబడి రూ.24,500 కోట్లు
- విస్తరణకు విప్రో, ఇన్ఫోసిస్ ఓకే.. 22 వేల ఉద్యోగాలు
- సంగారెడ్డిలో సుహానా ప్రపంచ స్థాయి ఎక్స్‌లెన్స్ సెంటర్
- హైదరాబాద్‌లో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ విస్తరణ
- నాలుగు రోజుల్లో 20 సంస్థలతో సర్కారు ఒప్పందాలు
- నిరుటితో పోలిస్తే నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడులు
- ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన దిశగా ఎంతో సంతృప్తి
- బ్రాండ్ తెలంగాణ సాధించిన అద్భుత విజయమిది
- ఒప్పందాల కార్యరూపానికి ప్రత్యేక దృష్టి: సీఎం రేవంత్
- మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులకు అభినందనలు
- ముగిసిన దావోస్ పర్యటన.. నేడు రాష్ట్రానికి తిరిగి రాక

ముగింపు ఇలా..

- అమెజాన్ — రూ.60,000 కోట్లు
- టిల్మాన్ గ్లోబల్స్ డేటా సెంటర్ — రూ.15,000 కోట్లు
- మైత్రా ఎనర్జీ సోలార్ యూనిట్ — రూ.7,000 కోట్లు
- ఉర్సా క్లస్టర్స్ ఏఐ డేటా సెంటర్ — రూ.5,000 కోట్లు
- బ్లాక్‌స్టోన్ డేటా సెంటర్ — రూ.4,500 కోట్లు



ఒప్పందం పత్రంతో రేవంత్, అమెజాన్ ప్రతినిధి మైఖేల్. చిత్రంలో శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దావోస్‌లో తెలంగాణ దుమ్మురేపింది! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం సరికొత్త రికార్డులు సృష్టించింది! రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈసారి ఏకంగా రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటితో కొత్తగా 49,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి! స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు 'తెలంగాణ రైజింగ్' పేరుతో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇతర ఉన్నతాధికారుల బృందం ఊహించిన దానికంటే ఎక్కువ పెట్టుబడులు సాధించింది. గత ఏడాది తొలిసారిగా దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అప్పటితో పోలిస్తే ఈసారి నాలుగు రెట్లకు మించి పెట్టుబడులకు ఒప్పందాలు జరగడం విశేషం. "దావోస్ పర్యటనలో రూ.1.78 లక్షల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వీటితో 49,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇది 'బ్రాండ్ తెలంగాణ' సాధించిన

మిగతా 13వ పేజీలో...



కిడ్నీ మార్పిడి జరిగిందెక్కడ?

రష్యా, ఉక్రెయిన్ వైద్యులకు దందాతో లింకులు!

- కిడ్నీ రాకెట్ మూలాలపై దృష్టి
- వైద్యుల కోసం 10 బృందాల గాలింపు
- కిడ్నీ మార్పిడికి రూ.50 లక్షల ఒప్పందం
- వెల్లడించిన కమిటీ చీఫ్ డాక్టర్ నాగేందర్
- పోలీసుల అదుపులో ఎనిమిది మంది..!

ఏమీ చెప్పలేకపోతున్న దాతలు!

- నోరు మెదపని మూత్రపిండాల స్వీకర్తలు
- కర్ణాటకలోని ఓ బేకరీ అడ్డాగా ఒప్పందం
- తెరపైకి మహిళా ఏజెంట్ వ్యవహారం!!
- కిడ్నీ ఇచ్చిన వారికి అందని డబ్బులు
- మరింత లోతుగా కమిటీ విచారణ
- దాతల సహాయకుల వాంగ్మూలాల సేకరణ
- నిందితుల ఫోన్ల విశ్లేషణకు సన్నాహాలు

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో మూత్రపిండాల మార్పిడికి శస్త్రచికిత్సలు జరిగిందెక్కడ? దాతల నుంచి కిడ్నీలు తీసుకున్న చోటే.. స్వీకర్తలకు వాటిని అమర్చారా? మరో ఆస్పత్రిలో సర్జరీలు చేసి, రోగుల తదనంతర చికిత్సలకు అలకనంద ఆస్పత్రికి తరలించారా? ఈ ప్రశ్నల చిక్కుముళ్లను

మిగతా 3వ పేజీలో...

నేనే చంపా..

- మీ వద్ద సాక్ష్యాలున్నాయా?
- కేసు పెట్టి రిమాండ్ చేయండి
- కోర్టులోనే చూసుకుంటా
- భార్య హత్య కేసులో పోలీసులతో గురుమూర్తి 3

అందరి లెక్కా తేలుస్తాం



సంగారెడ్డి జిల్లా కర్దనూరులో రైతుబంధు అందిన పెట్రోల్ బంక్

ఆ భూమిలో పెట్రోల్ బంకు ఉంది. అయినా దానికి రైతుబంధు ఇచ్చారు! ఫంక్షన్ హాల్ ఉన్న భూమికీ రైతుబంధు అందింది!! కొండలు.. గుట్టలు.. చెరువులు.. లేఅవుట్లు.. ఇలా సాగుతో సంబంధంలేని భూములెన్నింటికో గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతు బంధు అందిన తీరు అధికారుల సర్వేలో బయటపడుతోంది!! ఈ నెల 17 దాకా జరిగిన సర్వేలో అలాంటి భూములు రెండు లక్షల ఎకరాల దాకా ఉన్నట్టు తేలింది. గ్రామ సభలు ముగిసిన తర్వాత మళ్లీ సర్వే మొదలుపెట్టే భూములన్నిటి లెక్కా, పక్కాగా వెలికితీస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- రైతు భరోసాకు అర్హం కాని భూములు..
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2లక్షల ఎకరాలు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే 76 వేల ఎకరాలు
- ఉమ్మడి నల్లగొండలో 20,277 ఎకరాలు..
- సంగారెడ్డి జిల్లాలో 15,314 ఎకరాలు
- మేడ్చల్‌లో 14,300 ఎకరాలకు కట్..
- గ్రామసభల నేపథ్యంలో సర్వే వాయిదా
- పూర్తయితే.. పెరగనున్న అర్హంకాని భూములు!

హైదరాబాద్, రంగారెడ్డి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యమైన భూమి కానప్పటికీ.. రైతుబంధు అందుకున్న భూముల లెక్కలను అధికారులు పక్కాగా సేకరిస్తున్నారు. సర్వే నంబర్లవారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి, గతంలో రైతు బంధు పథకం కింద అర్హత పొందిన భూమి నిజంగా వ్యవసాయ యోగ్యమా కాదా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకూ 33 జిల్లాల పరిధిలో సాగుకు యోగ్యం కాని భూములను దాదాపు రెండు లక్షల ఎకరాల దాకా గుర్తించిన అధికారులు.. వాటికి సంబంధించిన

మిగతా 12వ పేజీలో...

కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు 12

బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి కోమటిరెడ్డి



రూ.10 లక్షల వరకు ఐటీ లేదు?

- బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట!
- కొత్తగా 25% పన్ను శ్లాబ్ యోచన
- పరిశీలనలో ఉన్నట్టు సమాచారం

న్యూఢిల్లీ, జనవరి 23: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న 2025-26 బడ్జెట్‌లో వేతన జీవులకు భారీగా ఊరట కలిగించే అవకాశం ఉన్నట్టు ఓ కథనం వెలువడింది. వార్షిక ఆదాయం రూ.10 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు ఒక ఆంగ్ల మేగజీన్‌లో ప్రచురితమైన ఆ కథనం తెలిపింది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు ఉన్నందున రూ.7.75 లక్షల

మిగతా 2వ పేజీలో...

వెయ్యి కోట్ల టోకరా!

ఓ రాజకీయ నాయకుడికి బినామీ ఝలక్



- తెలుగు రాష్ట్రాల నుంచి దుబాయ్ తరలించిన డబ్బుతో పరార్
- కొద్ది రోజులుగా దూరం దూరం.. ఇటీవల యూరప్ దేశానికి
- ప్రత్యర్థి శిబిరం వైపునకు ఫిరాయించారంటూ కథనం
- మారిన పరిస్థితుల్లో ఆయనే పంపారని మరో ప్రచారం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ రాజకీయ నాయకుడి బినామీ ఆయనకే టోకరా ఇచ్చాడా!? తెలుగు రాష్ట్రాల నుంచి దుబాయ్‌కు తరలించిన వెయ్యి కోట్లతో ఉడాయించాడా!? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా సాగుతున్న చర్చ ఇది! తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు కొంత కాలంగా అక్కడ సంపాదించిన తమ సంపదను దుబాయ్‌కి తరలిస్తున్నారు. కొందరు ఇక్కడ పెట్టుబడులు పెడితే.. మరికొందరు స్థిరాస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇలాగే.. ఎక్కడి నుంచి ఎలా తరలించారనే విషయాన్ని పక్కనపెడితే.. సదరు రాజకీయ నాయకుడు తనకు అత్యంత విశ్వసనీయుడైన ఓ వ్యక్తి ద్వారా స్వదేశం నుంచి దుబాయ్‌కి వెయ్యి కోట్లను తరలించారు. కొంత కాలంగా ఇటువంటి అనేక లావాదేవీలను ఆయన నిర్వహించారని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే, డబ్బును తరలించిన కొద్ది కాలానికే సదరు విశ్వసనీయుడు ఝలక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తొలుత, వివిధ సాకులు చెబుతూ సదరు రాజకీయ నాయకుడికి దూరం పాటించినట్లు సమాచారం. ఆ తర్వాత ఏకంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విడిచి యూరప్‌లోని ఓ దేశానికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. సదరు రాజకీయ నాయకుడిని మోసగించి.. ప్రత్యర్థి శిబిరం వైపునకు ఫిరాయించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. గత ఏడాది కాలంలో సదరు రాజకీయ నాయకుడికి ఇది రెండో ఝలక్ అని కూడా ప్రచారం జరుగుతోంది! అయితే, ఇదే అంశానికి సంబంధించి మరో కథనం కూడా వినిపిస్తోంది. సదరు విశ్వసనీయ మిత్రుడు (బినామీ) ఎటువంటి విశ్వాస ఘాతుకానికి పాల్పడలేదని, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవడం ఇష్టం లేక ఆయనే అజ్ఞాతంలోకి పంపారనే వాదన కూడా వినిపిస్తోంది.



మళ్లీ కార్చిచ్చు

- లాస్‌ఏంజెలెస్‌లో వేగంగా వ్యాప్తి
- వేలాది ఎకరాల్లోని చెట్లు, నివాస సముదాయాలు దగ్ధం 2
- సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని 50 వేల మందికి ఆదేశాలు



మౌనిక, ఆమె కూతుళ్లు మెహక్, మెనురూల్ (ఫైల్)

భర్త దొంగ అని తెలిసి షాక్..

బిడ్డల్ని చంపి.. తల్లి ఉరి

- ఆమెది ఉన్నత కుటుంబం.. కోచింగ్ సెంటర్లో పరిచయం, ప్రేమ
- కన్నవారు అభ్యంతరపెట్టినా నచ్చినోడితో మతాంతర వివాహం
- తల్లిదండ్రులు ప్రభుత్వ లెక్చరర్లు.. ఆరేళ్లుగా సంబంధాలు కట్
- పెళ్లయ్యాక ఆమె ఆశలు ఛిద్రం.. పనిలేక బలాదూర్‌గా భర్త
- చోరీ కేసుల్లో అతడిని పోలీసులు తీసుకెళ్లడంతో మనస్తాపం

మధిర రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మాటకాదని.. వారు నచ్చజెప్పినా వినకుండా.. తాను మేజర్‌నని వాదిస్తూ మనసిచ్చినవాడిని మతాంతర వివాహం చేసుకున్న ఆ అమ్మాయి, తన ఆశలన్నీ ఛిద్రమయ్యాయని ఆవేదన చెందింది. భర్త ఓ దొంగ అని తెలిసి.. పలుచోరీ కేసులకు సంబంధించి పోలీసులు ఇంటికొచ్చి మరీ భర్తను అదుపులోకి తీసుకోవడాన్ని చూసి తీవ్ర అవమానంగా భావించింది. దీనిపై ఇరుగుపొరుగు, బంధువర్గాల్లో ప్రచారం జరగడంతో ఇక తాను తలెత్తుకోలేనని.. అటు పుట్టింటికీ వెళ్లే

మిగతా 3వ పేజీలో...

అందరూ మాట్లాడుకొని

అఫిడవిట్లు ఇచ్చారా?

కట్ అండ్ పేస్ట్ చేసినట్టు ఒకేలా ఉన్నాయేంటి?

- 'నవయుగ' ప్రతినిధులకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్న 9
- సుందిళ్ల వద్ద ప్రవాహ వేగం అంచనాలో వైఫల్యం
- 2022 నుంచి సీసీ బ్లాకుల రిపేర్.. బుంగలకు గ్రౌటింగ్
- బ్యారేజీ దెబ్బతినడంతో బిల్లులు ఆపేశారని సంస్థ వెల్లడి

పారితోషికమంతా వైట్‌లోనే!



- నేను తీసుకునేదే తక్కువ.. అది కూడా ఆఫీసులోనే 13
- మిగతా వారి సంగతి తెలియదు: నటుడు వెంకటేశ్
- 'సంక్రాంతికి వస్తున్నాం' అన్నట్లుగా.. ఐటీ అధికారులు
- సోదాలు సాధారణమే: దర్శకుడు అనిల్ రావిపూడి
- సినీ ప్రముఖుల ఇళ్లలో కొనసాగిన ఐటీ తనిఖీలు
- ఫైనాన్షియర్ల వివరాలు, బినామీ ఖాతాల గుర్తింపు
- దిల్ రాజు తల్లికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

కేసీఆర్ ఫొటో ఉంటే తప్పా?

రేవంత్ చిత్రం పెట్టడం.. పెట్టకపోవడం నా ఇష్టం

- ఇంట్లో ఇతర నేతలతో ఫొటోలు ఉండొద్దా?
- కాట శ్రీనివాస్‌గౌడ్ కార్యకర్తలను ఉసిగొల్పాడు
- పటాన్‌చెరు శాసన సభ్యుడు మహిపాల్ రెడ్డి
- ఎమ్మెల్యే మాకొద్దని కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన
- క్యాంపు కార్యాలయం ముట్టడి.. హైవేపై ధర్నా
- కేసీఆర్ ఫొటో తొలగించి.. రేవంత్ ఫొటో
- గులాబీ రంగు కుర్చీలు ధ్వంసం

పటాన్‌చెరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తన క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ ఫొటో ఉంటే తప్పేంటని బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఫొటో పెట్టడం, పెట్టకపోవడం

మిగతా 13వ పేజీలో...

మావోయిస్టుల కుట్ర భగ్నం.. 50 కిలోల ఐఈడీ నిర్వీర్యం

» కల్వర్ట్ కింద అమర్చిన నక్సల్స్
» గుర్తించిన సీఆర్పీఎఫ్.. మరో బాంబుతో పేల్చివేత
» సుకుమాలో భారీ డంప్ స్వాధీనం


ఐఈడీని పేల్చేసిన దృశ్యం

చర్ల/చింతూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్‌లోని ఓ రాష్ట్ర రహదారిపై భద్రతాబలగాలే టార్గెట్‌గా మావోయిస్టులు అమర్చిన భారీ ఐఈడీని సీఆర్పీఎఫ్ బాంబ్ స్క్వాడ్ నిర్వీర్యం చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. మావోయిస్టులు ఆవపల్లి-బసగూడ రాష్ట్ర రహదారిలో తిమ్మాపూర్ దుర్గ ఆలయం సమీపంలో ఓ కల్వర్టు కింద రిమోట్ కంట్రోల్‌తో పేల్చేలా 50 కిలోల ఐఈడీని అమర్చారు. సీఆర్పీఎఫ్ 168వ బెటాలియన్‌కు చెందిన బాంబ్‌స్క్వాడ్ బృందం గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించింది. కల్వర్ట్ కింద కాంక్రీట్‌ను తొలగించి, ఓ బొరియగా మార్చి, అందులోనే ఐఈడీని అమర్చడంతో తొలగింపు సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు. దాంతో.. మరో బాంబును పెట్టి.. ఆ ఐఈడీని పేల్చేసినట్లు తెలిపారు. దీని వల్ల కల్వర్ట్ దెబ్బతిన్నదని, మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. సుకుమా జిల్లా మెట్టగూడ-దూలేడ్ గుట్టల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్ ను బలగాలు గుర్తించాయి. గ్యాస్ సిలిండర్లు, బీజీఎల్స్ తయారీ పరికరాలు, మందుపాతరలు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు కోబ్రా, సీఆర్పీఎఫ్ బలగాలు వెల్లడించాయి.


సుకుమాలో సీజ్ చేసిన నక్సల్స్ డంప్

లోకం తీరు



ఆర్‌ఆర్‌బీ దరఖాస్తుల ప్రక్రియ షురూ

» 32,438 పోస్టుల భర్తీ.. చివరి తేదీ ఫిబ్రవరి 22

న్యూఢిల్లీ, జనవరి 23: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్‌ఆర్‌బీ) ప్రకటించిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ గురువారం మొదలయింది. సెంట్రల్ పే కమిషన్‌లో పేర్కొన్న లెవల్ 1 నుంచి లెవల్ 7 వరకు మొత్తం 32,438 పోస్టులు భర్తీ చేయనుంది. ఆర్‌ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఫిబ్రవరి 22. దరఖాస్తులో ఏవైనా సవరణలు చేయాలనుకుంటే అందుకు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6 వరకు అవకాశం కల్పించింది. ఫీజును ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ పురుష అభ్యర్థులు రూ.500 ఫీజుగా చెల్లించాలి. బ్యాంకు రుసుములు మినహాయించిన తరువాత అందులో రూ.400 వరకు ఆర్‌ఆర్‌బీ వాపసు చేస్తుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, మాజీ సైనికులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల వారు రూ.250 ఫీజు చెల్లించాలి. బ్యాంకు చార్జీలు మినహాయించుకున్న అనంతరం దాన్ని కూడా వాపసు చేస్తుంది. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉన్నవారే ఈ ఉద్యోగాలకు అర్హులు.

5 లక్షల స్టడీ పర్మిట్ దరఖాస్తులకు ఆమోదం

» 2025కు పరిమితిని ప్రకటించిన కెనడా ప్రభుత్వం

ఒట్టావా, జనవరి 23: విదేశీ విద్యార్థులకు జారీచేసే స్టడీ పర్మిట్లపై కెనడా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2025 సంవత్సరానికి గాను 5,05,162 దరఖాస్తులను ప్రాసెసింగ్ కోసం ఆమోదించాలని నిర్ణయించింది. పరిమితికి మించి కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ)కు వచ్చే దరఖాస్తులను ఆమోదించబోమని, సదరు విద్యార్థులకు ఫీజు రీఫండ్ చేస్తామని తెలిపింది. ఈ మేరకు కెనడా-గెజిట్‌లో ఇటీవల నోటిఫికేషన్ ప్రచురించింది. ఈ పరిమితి అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ప్రాసెసింగ్ కోసం స్వీకరించే దరఖాస్తుల సంఖ్యను మాత్రమే సూచిస్తుందని, ప్రస్తుత సంవత్సరం లో జారీచేసే స్టడీ పర్మిట్ల సంఖ్యను అది ప్రతిబింబించదని స్పష్టం చేసింది. దేశంలో తాత్కాలిక నివాసితుల సంఖ్యను నియంత్రించడంలో భాగంగా కెనడా ప్రభుత్వం 2024 జనవరిలో స్టడీ పర్మిట్లపై పరిమితులు విధించింది.

రామ్‌గోపాల్‌వర్మకు 3 నెలల జైలు శిక్ష

» చెక్కు బౌన్స్ కేసులో అంధేరి కోర్టు తీర్పు

ముంబై, జనవరి 23: ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు మూడు నెలల జైలు శిక్ష పడింది. ఏడేళ్ల క్రితం నాటి చెక్కు బౌన్స్ కేసులో సుదీర్ఘ విచారణల అనంతరం మహారాష్ట్రలోని అంధేరి మెజిస్ట్రేట్ కోర్టు.. వర్మను దోషిగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. ఆయన విచారణలకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఫిర్యాదుదారుకు పరిహారంగా రూ.3.72 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. లేనిపక్షంలో మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2018లో మహేశ్‌చంద్ర మిశ్రా తరఫున శ్రీ అనే కంపెనీ వర్మ కంపెనీపై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేసింది. 2022లో వర్మ ఈ కేసులో బెయిల్ తెచ్చుకున్నారు. తాజాగా కోర్టు తీర్పు నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా వర్మ స్పందించారు. 'ఇది ఏడేళ్ల క్రితం నాటి విషయం. నా మాజీ ఉద్యోగికి సంబంధించిన రూ.2.38 లక్షల చెక్కు బౌన్స్ కేసు.. దీనిపై నా న్యాయవాదులు కోర్టుకు హాజరవుతున్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉన్నందున ఇంతకుమించి ఏమీ చెప్పలేను' అని పేర్కొన్నారు.

ఓలా, ఉబెర్‌లకు కేంద్రం నోటీసులు

» ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్ల ద్వారా వేర్వేరుగా రైడ్ చార్జీల వసూలు చేస్తున్నందునే..

న్యూఢిల్లీ, జనవరి 23: ఓలా, ఉబెర్ క్యాబ్ బుక్ చేస్తున్నారా? ఐఫోన్ ద్వారా రైడ్ బుక్ చేస్తే మీరు అధిక చార్జీలు చెల్లించుకోవాల్సి రావొచ్చు. అదే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారానైతే ఈ బెడద తప్పుద్ది!! ఇలా ఒకే రూట్‌లో.. ఒకే సమయంలో రైడ్ బుక్ చేస్తే.. ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్ల వేర్వేరు చార్జీలు వసూలు చేయడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ఈ అంశమ్మీద ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కేంద్రం స్పందించింది. విభిన్న ఫోన్ల ద్వారా రైడ్ బుక్ చేస్తే వేర్వేరు చార్జీలు వసూలు చేయడంపై సమాధానం చెప్పాలంటూ ఓలా, ఉబెర్‌కు కేంద్ర వినియోగదారుల భద్రత సమాఖ్య (సీసీపీఏ) ద్వారా వినియోగదారుల వ్యవహారాల సమాఖ్య గురువారం నోటీసులు పంపింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. మరోవైపు.. ప్రముఖ టెక్ కంపెనీ యాపిల్ ఇంక్‌కు కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) నోటీసు జారీ చేసింది. ఐఫోన్‌లలో ఐఓఎస్ 18+ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ తర్వాత పనితీరుకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నోటీసు జారీ అయింది. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదులను సీసీపీఏ సమీక్షించిందని, అనంతరం యాపిల్‌కు నోటీసు జారీ చేసినట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

బీజేపీ సైద్ధాంతిక హామీలన్నీ నెరవేర్చాం

» ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం: అమిత్ షా

అహ్మదాబాద్, జనవరి23: బీజేపీ సైద్ధాంతిక హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం నెరవేర్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు, రామ మందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉమ్మడి పౌరస్మృతి సహా హామీలన్నింటినీ నెరవేర్చామని ఆయన చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 70 ఏళ్లుగా ప్రభుత్వాలు ముట్టుకునేందుకు కూడా జంకిన హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం పదేళ్లలో పూర్తి చేయగలిగిందన్నారు. మూడో దఫాలోనూ మోదీ ప్రభుత్వం అదే దిశలో వెళ్తుందని చెప్పారు. మోదీ ప్రభుత్వ హయాంలోనే 170కి పైగా దేశాలు యోగాను అంగీకరించాయన్నారు. గతంలో చోరీకి గురైన 350కి పైగా దేవతా విగ్రహాలను ప్రపంచం నలుమూలల నుంచి భారత్‌కు తీసుకురాగలిగామన్నారు. హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలు అనేక సేవా కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి విద్య, వైద్య సదుపాయాలు అందిస్తున్నాయని, అయితే ప్రచారం మాత్రం చేసుకోలేదని చెప్పారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న హిందూ ధార్మిక సంస్థలను ఒక చోటకు తీసుకురాగలిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అహింసావాదాన్ని కాపాడేందుకు కొన్నిసార్లు హింస అవసరమే: భయ్యాజీ జోషి

అహింసావాదాన్ని కాపాడేందుకు కొన్నిసార్లు హింస అవసరమేనని ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత భయ్యాజీ జోషి అన్నారు. హిందువులు తమ ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు ఇతరులు 'అధర్మం' అని ముద్ర వేసే పనులు కూడా చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. అధర్మాన్ని నిర్మూలించేందుకు పాండవులు కురుక్షేత్రంలో యుద్ధ నియమాలను పక్కనపెట్టారని పేర్కొన్నారు. 'హిందూ ఆధ్యాత్మిక సేవా మేళా'లో భయ్యాజీ జోషి మాట్లాడారు. ఒక మతం ఇతర విశ్వాసాలను అనుమతించకపోతే శాంతి అనేది ఉండదన్నారు. శాంతిని స్థాపించగల వారికే అందర్నీ కలుపుకొని తీసుకువెళ్లే సామర్థ్యం ఉంటుందని, ఈ విషయంలో మిగతా దేశాలకు సారథ్యం వహించగల దేశం భారత్ మాత్రమేనని పేర్కొన్నారు.

ఆపరేషన్ చేయించుకుని అయినా సరే.. ఆలోగా కనేద్దాం!

» ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్న జన్మతః పౌరసత్వ హక్కు రద్దు ఉత్తర్వు
» ఆలోపే పిల్లల్ని కనేందుకు ఆస్పత్రులకు క్యూ కడుతున్న భారతీయ దంపతులు
» సిజేరియన్ చేయించుకోవడానికి సిద్ధం



హైదరాబాద్, జనవరి 23: జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు నేపథ్యంలో.. ఆ దేశంలోని పలువురు భారతీయ గర్భిణులు మెటర్నిటీ క్లినిక్‌ల ముందు క్యూ కడుతున్నారు! డాక్టర్లు ఇచ్చిన డేట్ ప్రకారం మార్చిలో వారికి ప్రసవం జరగాల్సి ఉండగా.. ట్రంప్ ఉత్తర్వు ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి వస్తుండడంతో, ఆలోగానే శస్త్రచికిత్స (సిజేరియన్) ద్వారా పిల్లలను కనడానికి సిద్ధమవుతున్నారు!! అలా చాలా మంది దంపతులు సి-సెక్షన్ కోసం తమను సంప్రదించారంటూ అమెరికాలోని భారతీయ గైనకాలజిస్టులను ఉటంకిస్తూ ఒక ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. జనవరి 20న ట్రంప్ అధికారం చేపట్టగానే సంతకాలు చేసిన తొలి ఎనిమిది ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో ముఖ్యమైనది అమెరికా గడ్డపై పుట్టిన వారికి ఆటోమేటిగ్గా ఆ దేశ పౌరసత్వాన్ని కల్పించే హక్కును రద్దు చేస్తూ జారీ చేసి ఉత్తర్వు. అయితే, ఆ ఉత్తర్వును జారీ చేసిన 30 రోజుల తర్వాత పుట్టే వారికి మాత్రమే జన్మతః పౌరసత్వ హక్కు ఉండదని అందులో పేర్కొన్నారు. దీంతో ఫిబ్రవరి 19 దాకా అమెరికాలో పుట్టే ప్రతి ఒక్కరికీ బర్త్ రైట్ సిటిజన్‌షిప్ లభిస్తుందన్నమాట. దీంతో.. ఆ తర్వాత బిడ్డను కనే అవకాశం ఉన్న భారతీయ దంపతులు చాలా మంది అక్కడున్న ఇండియన్-అమెరికన్ వైద్యులను సిజేరియన్ కోసం సంప్రదిస్తున్నట్టు ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. వారిలో చాలా మంది హెచ్-1బీ, ఎల్1 వీసాలపై అమెరికాకు వచ్చినవారు, గ్రీన్‌కార్డుల కోసం ఎన్నో ఏళ్ల క్రితమే దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారని.. ఆయా దంపతుల్లో ఏ ఒక్కరికీ అమెరికన్ పౌరసత్వం లేకపోవడంతో ఫిబ్రవరి 19 తర్వాత ప్రసవం అయితే, ఆ పుట్టే పిల్లలకు సైతం అమెరికన్ పౌరసత్వం రాదనే ఆందోళనతో వారు వైద్యులను సంప్రదిస్తున్నట్టు వివరించింది. తమ పిల్లలకు పౌరసత్వం వస్తే.. వారికి 21 ఏళ్లు వచ్చాక, అమెరికాలో వారితో కలిసి ఉండడానికి తమకు అవకాశం లభిస్తుందనే ఉద్దేశంతోనే వారు ఇలా చేస్తున్నట్టు వెల్లడించింది. ఆ కథనం ప్రకారం.. గడిచిన 2-3 రోజులుగా సి-సెక్షన్ ఆపరేషన్ల కోసం పెద్దసంఖ్యలో భారతీయ దంపతులు తనను సంప్రదిస్తున్నారంటూ న్యూజెర్సీకి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ ఎస్‌డీ రమ తెలిపారు. ఏడో నెల గర్భంతో ఉన్న ఒక మహిళ తన భర్తతో సహా వచ్చి.. నెలలు నిండకముందే ఆపరేషన్ ద్వారా బిడ్డను కనడానికి సిద్ధమైందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇలా పౌరసత్వం కోసం నెలలు నిండకముందే సిజేరియన్ చేస్తే.. పుట్టే పిల్లలకు ఆరోగ్యపరంగా చాలా సమస్యలు ఎదురవుతాయని, వారి ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందవని, తక్కువ బరువు, నాడీ సంబంధిత సమస్యల వంటివి తలెత్తుతాయని టెక్సాస్‌కు చెందిన మరో భారత సంతతి వైద్యురాలు హెచ్చరించారు. ఇప్పటిదాకా తనను అలా 20 జంటలు సంప్రదించాయని.. వారందరికీ ఈ సమస్యల గురించి చెప్పానని ఆమె తెలిపారు. కాగా, అక్రమ వలసదారుల నిర్బంధానికి సంబంధించిన కీలక బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. బుధవారం 263-156 ఓట్లతో ఈ బిల్లును ఆమోదించారు.

అక్రమ వలసదారులపై ఒప్పందం?

» గల్ఫ్ దేశాల తరహాలోనే అమెరికాతోనూ అవగాహన!
» తిరిగి వచ్చేవారిని స్వీకరించడానికి సుముఖమన్న జై శంకర్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వీసా గడువు.. అక్రమ నివాసం.. ఇప్పటివరకు గల్ఫ్ దేశాలలో మాత్రమే వినిపించిన ఈ మాటలు ఇకపై అమెరికా నుంచి కూడా ప్రతిధ్వనించనున్నాయి. ఇమ్మిగ్రేషన్ న్యాయ సహాయక కేంద్రాలు, వలసదారుల శిబిరాల కార్యకలాపాలను స్తంభింపజేయడంతో పాటు విదేశీ అక్రమ వలసదారులను నియంత్రించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులతో ఈ పరిస్థితి తలెత్తనుంది. ఇటీవలి కాలం వరకు విదేశాలు తిప్పి పంపే భారతీయులను స్వీకరించడానికి గల్ఫ్ దేశాలతోనే ఒప్పందాలున్నాయి. పెద్ద దుమారం, రచ్చ తర్వాత 2021లో బ్రిటన్-భారత్ మధ్య కూడా అవగాహన కుదిరింది. ఇకపై అమెరికాతోనూ ఇదే బాటలో నడవడానికి భారత్ నిర్ణయించుకున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనతో స్పష్టమవుతోంది. దేశ ప్రతిష్ఠ, నిపుణులకు మెరుగైన ఉపాధి, విద్య అవకాశాల కోసం ఎక్కువగా వలస వెళ్లే దేశాల చట్టాలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. గల్ఫ్ దేశాలతో ఈ రకమైన అవగాహన ఉంది. ప్రత్యేకించి సౌదీ అరేబియా చట్టాలను ఉల్లంఘించినందుకు తిప్పి పంపించే ప్రతి భారతీయుడి విమాన టికెట్ వ్యయాన్ని భరిస్తుంది. మరి అమెరికా ఇలాంటి ఖర్చును భరించడానికి ఎంతవరకు సిద్ధం అనేది తేలిన తర్వాతనే స్పష్టత వస్తుందనేది నిపుణుల అభిప్రాయం. మరోవైపు ట్రంప్ ఇమ్మిగ్రేషన్ నిర్ణయాలను అమలు చేస్తే.. నిబంధనలు ఉల్లంఘించి అమెరికాలో ఉంటున్న సుమారు 7.50 లక్షల మంది భారతీయులను దశలవారీగా తిప్పి పంపడం ఖాయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ వలసలను భారతదేశం ప్రోత్సహించదని, చట్టవిరుద్ధంగా నివసిస్తూ అమెరికా నుంచి తిరిగొచ్చే భారతీయులను స్వీకరించడానికి సిద్ధమని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అమెరికాలోనే ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

రష్యా నుంచి చమురు ఇక కష్టమే!

» అమెరికా ఆంక్షల ఫలితంగా మార్చిలో 20 శాతానికి తగ్గనున్న సరఫరా
» పశ్చిమాసియా మార్కెట్ల ద్వారా లోటు భర్తీ
» ప్రభుత్వరంగ సంస్థ బీపీసీఎల్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 23: రష్యా చమురు రంగంపై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావం మన చమురు దిగుమతులపై తీవ్రంగా పడుతోంది. మార్చి నెలకు అవసరమైనంత చమురు దిగుమతులు రష్యా నుంచి వచ్చే అవకాశాలు లేవని ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్) రామకృష్ణగుప్తా తెలిపారు. గత ఏడాది అక్టోబరు-డిసెంబరుతో కూడిన త్రైమాసికంలో తమ సంస్థ శుద్ధి చేసిన ముడి చమురులో 31 శాతం రష్యా నుంచి వచ్చినదేనని, ఈ ఏడాది మార్చికి ఇది 20 శాతానికి పడిపోనుందని వెల్లడించారు. దీనిని భర్తీ చేయటానికి పశ్చిమాసియా తదితర ప్రత్యామ్నాయ మార్కెట్లను సంప్రదిస్తామని, ఆయా మార్కెట్లలో ముడి చమురు కావాల్సినంత ఉందని ఆయన తెలిపారు.

యుద్ధం నేపథ్యంలో చవకగా రష్యా చమురు

చమురు అవసరాల కోసం భారత్ ఎక్కువగా గల్ఫ్ దేశాలపైనే ఆధారపడి ఉండేది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత.. రష్యా ఆర్థిక వనరులను దెబ్బతీసే ఉద్దేశంతో అమెరికా, పశ్చిమదేశాలు రష్యా చమురు సంస్థలపై ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా తక్కువ ధరకే ముడి చమురును విక్రయించటం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంది. భారత్ చమురు కొనుగోళ్లలో రష్యా వాటా దాదాపు 40 శాతానికి చేరుకుంది (2022కి ముందు ఇది 0.4%). అయితే, ఈ ఏడాది జనవరి 10న రష్యా చమురు సంస్థలపై ఆంక్షలను అమెరికా మరింత కఠినతరం చేసింది. దీంతో ఆ దేశం నుంచి చమురు సరఫరాలు గతంలో ఉన్నట్లుగా అందుబాటులో లేవు.

రూ.10 లక్షల వరకు ఐటీ లేదు?

(మొదటి పేజీ తరువాయి)

వార్షిక ఆదాయం వరకు పన్ను మినహాయింపు లభిస్తోంది. దీన్ని రూ.10 లక్షల ఆదాయం వరకూ పెంచనున్నట్టు ఆ కథనం పేర్కొంది. అలాగే, రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల ఆదాయం వరకు కొత్తగా 25% పన్ను శ్లాబ్‌ను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఆ కథనం తెలిపింది. ప్రస్తుతం 15 లక్షల పైబడిన ఆదాయానికి 30% పన్ను విధిస్తున్నారు. దీన్ని 25 శాతానికి తగ్గించడం వల్ల 15 లక్షల పైబడిన వార్షిక ఆదాయం ఉన్నవారికి ఊరట కలుగనుంది. ఈ మేరకు ఆదాయపన్ను శ్లాబుల్లో మార్పులు చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాల నుంచి సంకేతాలు వచ్చాయని ఆ కథనం తెలిపింది. 'ఈ రెండు ప్రతిపాదనలపై మేం లెక్కలు వేస్తున్నాం. బడ్జెట్ అనుమతిస్తే ఈ రెండూ ప్రవేశపెట్టే అవకాశం ఉంది' అని ప్రభుత్వంలోని ఒకరు చెప్పినట్టు పేర్కొంది. జీడీపీ వృద్ధి మందగించిన ప్రస్తుత తరుణంలో తాజా ప్రతిపాదనలు పట్టణాల్లోని పన్ను చెల్లింపుదారులకు చేతినిండా డబ్బు ఉండేలా, తద్వారా వారు టీవీలు, రిఫ్రిజిరేటర్లు తదితరాల కొనుగోలుకు మరింత వ్యయం చేయడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి గత ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి(5.4%) పడిపోయింది. దీంతో వేతన జీవులకు ఆదాయ పన్నుల్లో ఉపశమనం కలిగించేందుకు రెవెన్యూ నష్టాలను రూ.50 వేల కోట్ల నుంచి రూ.1లక్ష కోట్ల వరకు భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు కథనం తెలిపింది. కొత్తగా 25% పన్నుశ్లాబ్ తీసుకురావడం పట్టణ పన్ను చెల్లింపుదారులు మరింత వ్యయం చేసేలా దోహదపడుతుందని, ఇది అంతిమంగా ప్రభుత్వానికే మేలు చేస్తుందని సీబీడీటీ(ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు) మాజీ సభ్యుడు అఖిలేశ్ రంజన్ పేర్కొన్నారు. తాజా బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో మార్పులు చేయనున్నట్టు ఎక్కువమంది నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పాత పన్ను విధానాన్ని తొలగించబోరని అంకిత్ జైన్ అనే నిపుణుడు తెలిపారు.

ధర్మ పరిరక్షణకు 'సనాతన బోర్డు'

దేశ సమగ్రతను కాపాడేందుకు ఏర్పాటు చేయాలి

» ఈ నెల 27న మహాకుంభమేళాలో 'ధర్మ సభ' నిర్వహణ
» 'సనాతన బోర్డు' రాజ్యాంగ ముసాయిదా ప్రకటిస్తాం: హిందూ సాధువులు

మహాకుంభ్ నగర్, జనవరి 23: ఈ నెల 27వ తేదీన మహాకుంభమేళ సెక్టార్ 17లో జరగనున్న 'ధర్మ సభ'లో 'సనాతన బోర్డు' రాజ్యాంగ ముసాయిదాను ప్రకటిస్తామని ప్రముఖ హిందూ ఆధ్యాత్మిక వేత్త దేవికానంద్ ఠాకూర్ వెల్లడించారు. గురువారం నిరంజని అఖాడాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మన ధర్మానికి (మతం) స్వేచ్ఛ లేదు. మన ఆలయాలను ప్రభుత్వాలు నియంత్రిస్తున్నాయి. మన గురుకులాలను మూసివేస్తున్నారు. గోమాతలు వీధుల్లో తిరుగుతున్నాయి.. ఈ క్రమంలో మన లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోయేందుకు సనాతన బోర్డు అవసరం' అని పేర్కొన్నారు. ధర్మసభకు అన్ని అఖాడాల ప్రతినిధులు, నలుగురు శంకరాచార్యుల ప్రతినిధులు, తదితరులు హాజరవుతారని చెప్పారు. సనాతన బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అది జరగకుండా కుంభమేళాను వదిలి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. జునా అఖాడాకు చెందిన మహంత్ స్వామి యతీంద్రానంద్ గిరి మాట్లాడుతూ. సనాతన బోర్డు భారతదేశానికే కాదు.. మొత్తం మానవాళికి అవసరమని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం, ద్వేషం, అరాచకాలను నిర్మూలించవచ్చన్నారు. నిరంజని అఖాడా సీనియర్ మహామండలేశ్వర్, ఉజ్జయిని అర్జి హనుమాన్ ఆలయ మహంత్ స్వామి ప్రేమానంద్ పూరీ మాట్లాడుతూ.. గంగానది భూమి వక్ఫ్ బోర్డుకు చెందిందని కొంత మంది వాదిస్తున్నారని, సూర్యుడు పుట్టినప్పటి నుంచి సనాతన ధర్మం ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నామన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు సనాతన బోర్డు ఏర్పాటు చాలా ముఖ్యమని అన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు సనాతన బోర్డు ఏర్పాటు అవసరమని ఆనంద్ అఖాడాకు చెందిన స్వామి బాలంకానంద గిరి మహారాజ్, పీఠాధీశ్వర్ స్పష్టం చేశారు.

10 కోట్ల భక్తుల పైగా పుణ్యస్నానాలు

పది రోజులుగా కొనసాగుతున్న మహా కుంభమేళాలో త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తుల సంఖ్య గురువారం మధ్యాహ్నానికి 10 కోట్లు దాటిందని యూపీ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, కుంభమేళ జరుగుతున్న ప్రాంతం నుంచి దాదాపు 300 అక్రమ వంట గ్యాస్ సిలిండర్లను అగ్నిమాపక శాఖ గురువారం స్వాధీనం చేసుకుంది.

ఇప్పటికే తొమ్మిది మంది సంతానం

మరోసారి గర్భం దాల్చిన మహిళ.. అబార్షన్ కోసం కౌన్సెలింగ్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆ మహిళ తొమ్మిదిమందికి జన్మనిచ్చింది. ఇప్పుడు మళ్లీ గర్భం దాల్చింది. దాంతో ఆరోగ్యశాఖ అధికారులు ఆమెకు అబార్షన్ నిర్వహించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమిళనాడులోని నామక్కల్ జిల్లా పెరియకొల్లపట్టిలో జరిగిన ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి. పెరియకొల్లపట్టికి చెందిన రోజుకూలీ గోపి(40), సంగీత(35) దంపతులకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి తొమ్మిదిమంది సంతానం. వీరిలో ఒకరు మృతి చెందగా, మరో చిన్నారిని దత్తతకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంగీత మళ్లీ గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, ఆరోగ్యం దెబ్బతింటుందని, అందువల్ల అబార్షన్ చేయించుకోవాలని సూచించారు. వారి సూచనలతో మల్లసముద్రం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన సంగీత పరీక్షలు చేయించుకుంది. ఆ వెంటనే మనసు మార్చుకుని అబార్షన్ చేయించుకోకుండానే ఇంటికి వచ్చేసింది. దీంతో అధికారులు ఆమెకు అబార్షన్‌పై కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

ఎవరెస్ట్ అధిరోహణ రుసుం రూ.13 లక్షలు

» 36 శాతం పెంచిన నేపాల్ ప్రభుత్వం

కాఠ్‌మాండూ, జనవరి 23: ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు వసూలు చేసే పర్మిట్ ఫీజును కనీసం 36 శాతం మేర పెంచుతూ నేపాల్ మంత్రి వర్గం నిర్ణయం తీసుకొంది. పర్వతారోహకుల కారణంగా చెత్త పేరుకుపోతున్న నేపథ్యంలో ఈ ఫీజులను పెంచుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. మార్చి-మే సీజన్‌లో వచ్చే విదేశీయులు రాయల్టీ ఫీజు కింద ఇంతవరకు ఒక్కొక్కరు 11 వేల డాలర్లు చెల్లిస్తుండగా ఇకపై 15వేల డాలర్లు (రూ.13 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబరు-నవంబరు సీజను రుసుము 5,500 డాలర్ల నుంచి 7,500 డాలర్ల (సుమారు రూ.6.50 లక్షలు)కు పెరిగింది. డిసెంబరు-ఫిబ్రవరి, జూన్-ఆగస్టు సీజన రుసుము 2,750 డాలర్ల నుంచి 3,750 (రూ.3.20 లక్షలు)కు పెరిగింది. ఈ నూతన రుసుములు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. పర్వతారోహకులు పైకి అనుమతించిన వస్తువులను మాత్రమే తీసుకెళ్లాలని స్పష్టం చేసింది.

లాస్‌ఏంజెలెస్‌లో మళ్లీ మొదలైన కార్చిచ్చు

నివాసాలు విడిచి వెళ్లాలని 50 వేల మందికి ఆదేశాలు

కాలిఫోర్నియా, జనవరి 23 : అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో కార్చిచ్చు మళ్లీ విజృంభిస్తోంది. గాలుల తీవ్రతతో వేగంగా వ్యాపిస్తున్న మంటలు వేలాది ఎకరాల్లోని చెట్లు, నివాస సముదాయాలను దగ్ధం చేస్తున్నాయి. ఉత్తర లాస్‌ఎంజెలెస్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని కాస్టియిక్ సరస్సు వెంబడి కొండల్లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున కార్చిచ్చు చెలరేగింది. గంటకు 67 కిమీల వేగంతో గాలులు వీస్తుండడంతో గంటల వ్యవధిలోనే ఈ మంటలు 39 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భూభాగాన్ని చుట్టుముట్టేశాయి. అగ్నికీలలు అంతకంతకు విస్తరిస్తుండడంతో కాస్టియిక్ సరస్సు వెంబడి ప్రాంతాల్లో నివసిస్తున్న 50వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించారు. 31,000 వేల మందిని ఉన్నపళంగా ఖాళీ చేయమని చెప్పగా, మరో 23,000 మందిని ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తూ మంటలు చెలరేగుతుండడంతో.. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక, లాస్‌ఏంజెలెస్‌లోని హాలీవుడ్ సహా పలు ప్రాంతాల్లో ఇటీవల కార్చిచ్చు చెలరేగిన సంగతి తెలిసిందే. జనవరి 7 నుంచి జరిగిన ఈ ఘటనల్లో 14,000 నిర్మాణాలు దగ్ధం అవ్వగా 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పాలీసేడ్స్‌లో 68 శాతం, ఈటన్‌లో 91 శాతం మంటలు అదుపులోకి వచ్చాయి. లాస్‌ఏంజెలెస్ దక్షిణ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క, బూడిద, బురద ముప్పును ఎదుర్కోనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కిడ్నీరాకెట్ కేసు.. ఏమీ చెప్పలేకపోతున్న దాతలు!

- నోరు మెదపని మూత్రపిండాల స్వీకర్తలు
- కర్ణాటకలోని ఓ బేకరీ అడ్డాగా ఒప్పందం
- తెరపైకి లేడీ ఏజెంట్ వ్యవహారం
- కిడ్నీ దాతలకు అందని డబ్బులు
- మరింత లోతుగా కమిటీ విచారణ

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అలకనంద ఆస్పత్రి కేంద్రంగా వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విచారణకు ఏర్పాటైన కమిటీ విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ కేసులో కిడ్నీ దాతలు వివరాలను సరిగ్గా చెప్పలేకపోతున్నట్లు తెలుస్తోంది. కమిటీ అడిగిన ప్రశ్నలకు వారు సరైన సమాధానాలు చెప్పడం లేదని సమాచారం. వీరిలో కొందరికి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తెలియకపోవడంతో.. దుబాసీల సాయంతో విచారిస్తున్నారు. కిడ్నీలను తీసుకున్న వారు కూడా కమిటీ అడుగుతున్న ప్రశ్నలకు నోరు మెదపడం లేదని తెలిసింది. ఈ రెండు కేటగిరీల వారు కూడా ప్రస్తుతం రోగులుగా ఆస్పత్రుల్లో ఉండడంతో.. వారిని కమిటీ సభ్యులు ఎక్కువసేపు విచారించలేకపోతున్నారు. ఉస్మానియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఇప్పటికే ప్రాథమిక వివరాలతో డీఎంఈకి నివేదిక సమర్పించినా.. ఈ రాకెట్ మూలాలను గుర్తించే దిశలో కసరత్తు చేస్తోంది. దాతలకు ఏజెంట్లు ఎక్కడ కలిశారు? ఒప్పందాలెలా జరిగాయి? మూలాలెక్కడున్నాయి? అనే వివరాలను రాబట్టేందుకు నిందితుల మొబైల్‌ఫోన్ల విశ్లేషణకు సన్నాహాలు చేస్తున్న కమిటీ.. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తోంది. మూత్రపిండాల మార్పిడి చేయించుకున్న వారిలో ఒకరు లాయర్.. మరొకరు ఇంజనీరు, ఇంకొకరు నర్స్ ట్రైనర్ ఉన్నారు. వీరందరికీ అవయవమార్పిడి చట్టంపై అవగాహన ఉంది. పైగా.. వీరిలో ఇద్దరు జీవన్‌దాన్‌లో పేర్లను నమోదు చేయించుకున్నారు. అయితే.. ఆ మార్గంలో దాతలు త్వరగా దొరకరని, ఒకవేళ అవకాశమున్నా.. తమ వంతు వచ్చేవరకు ఆలస్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ రాకెట్ ద్వారా మూత్రపిండాల మార్పిడి చేయించుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

కర్ణాటక బేకరీ అడ్డాగా..

ప్రస్తుతం పట్టుబడ్డ నిందితులు, దాతలు, స్వీకర్తల విషయంలో ఒప్పందాలన్నీ కర్ణాటకలోని ఓ బేకరీలో జరిగినట్లు కమిటీ గుర్తించింది. ఈ కేసులో స్వీకర్తలుగా ఉన్న నర్సు, లాయర్‌కు కర్ణాటకలోని ఓ బేకరీ నిర్వాహకుడి ద్వారా ఏజెంట్లతో పరిచయం ఏర్పడినట్లు కమిటీ గుర్తించింది. ఇక తమిళనాడుకు చెందిన దాతల తరఫున ఓ లేడీ ఏజెంట్ అంతా నడిపినట్లు తెలుస్తోంది. ఆర్థిక ఇబ్బందులున్న ఒంటరి మహిళలే టార్గెట్‌గా లేడీ ఏజెంట్ బాధితులను ముగ్గులోకి దించినట్లు సమాచారం. ఆమె ఈ నెల 16న హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఇద్దరు బాధిత మహిళలకు, తర్వాతి రోజు సర్జరీ చేసి కిడ్నీలు తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. ఈ ఇద్దరికీ చెరో రూ.4లక్షలు అందాల్సి ఉండగా.. కేసు కావడంతో ఇప్పుడా లేడీ ఏజెంట్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు మహిళల సహాయకులనూ పోలీసులు విచారిస్తున్నారు. వారు పోలీసు అదుపులో ఉండడంతో.. కమిటీ వారిని ప్రశ్నించలేకపోయిందని సమాచారం.

ప్రజలను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్ నేతలు: శ్రీరంగం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ ప్రజలను రెచ్చగొడుతూ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు తమ వంకరబుద్ధిని చాటుకుంటున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 40 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టంగా ప్రకటించారని గుర్తు చేశారు.

బిడ్డల్ని చంపి.. తల్లి ఉరి

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి లేదని భావించి బలవన్మరణానికి పాల్పడింది. తాను చనిపోతే బిడ్డలు దిక్కులేని వారవుతారనుకుందో ఏమో.. ఐదేళ్లలోపు వయసున్న ఇద్దరు బిడ్డలను చంపి మరీ ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురంలో ఈ ఘటన జరిగింది. మృతురాలు 31 ఏళ్ల ప్రేజా అలియాస్ మౌనిక! ఈమె తల్లిదండ్రులు ప్రభుత్వ లెక్చరర్లు. స్వస్థలం సూర్యాపేట. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. నిదానపురం గ్రామానికి చెందిన షేక్ బాజీది వ్యవసాయ కుటుంబం. ఉన్న కొద్దిపాటి పొలాన్ని తల్లిదండ్రులు సాగుచేస్తూనే కూలీ పనులకు వెళ్లేవారు. డిగ్రీదాకా చదువుకున్న బాజీ పోటీ పరీక్షల శిక్షణ కోసం రైల్లో విజయవాడ వెళుతుండగా ఆ పోటీ పరీక్షల శిక్షణ కోసం అదే రైల్లో ప్రయాణిస్తున్న మౌనిక అతడికి పరిచయమైంది. యాదృచ్ఛికంగా ఇద్దరూ ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. శిక్షణ సమయంలో ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఒకానొకరోజు మౌనికను బాజీ తన సొంతూరైన నిదానపురానికి తీసుకొచ్చాడు. ఇది తెలిసి.. మౌనిక తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి ఈ వివాహం వొద్దు అని మౌనికకు నచ్చజెప్పారు.. ఆమె వినలేదు. దీంతో వారు ఖమ్మం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాను మేజర్‌ను అని.. తన ఇష్టప్రకారమే పెళ్లి చేసుకుంటున్నానని మౌనిక స్పష్టంగా చెప్పడంతో పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అప్పుడే పుట్టింటితో మౌనికకు సంబంధాలు తెగిపోయాయి. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో మౌనికను బాజీ పెళ్లి చేసుకున్నాడు. ఆమె పేరును ప్రేజాగా మార్చాడు. వీరికి మెహక్ (5), మెనురూల్ (4) కూతుళ్లు కలిగారు. అయితే బాజీ ఏ పనీ చేయకుండా బలాదూర్‌గా తిరుగుతున్నా, తన భర్త దొంగతనాలూ చేస్తున్నాడనే విషయం మౌనికకు తెలియదు. బైక్‌లు, సెల్‌ఫోన్ల చోరీ.. చైన్ స్నాచింగ్ కేసులకు సంబంధించి నిదానపురం వచ్చిన ఖమ్మం పోలీసులు బాజీని అదుపులోకి తీసుకున్నారు. దీంతో మౌనిక షాక్‌కు గురైంది. గురువారం ఉదయం తన ఇద్దరు పిల్లలను ఉరితీసి.. తాను కూడా దూలానికి ఉరివేసుకుంది. మౌనిక మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మౌనిక తల్లిదండ్రులకు సమాచారం చేరవేయగా.. వారు నిదానపురం వచ్చేది రానిదీ చెప్పలేదని తెలిసింది. తమ అదుపులో ఉన్న బాజీని పోలీసులు గురువారం రాత్రి బయటకు పంపడటంతో అతడు ఖమ్మం ఆస్పత్రిలోని మార్చురీకి వచ్చినట్లు తెలిసింది.

కిడ్నీ మార్పిడి జరిగిందెక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

విప్పేందుకు ఉస్మానియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ నేతృత్వంలో ఏర్పాటైన విచారణ కమిటీ కసరత్తు చేస్తోంది. భారతీయ చట్టాలు.. ముఖ్యంగా అవయవమార్పిడి చట్టంపై అవగాహన ఉండే దేశీయ వైద్యులకు.. ఈ తరహా దందాల్లో పాలుపంచుకుంటే.. భారత వైద్య మండలి(ఎంసీఐ) లైసెన్సును రద్దు చేస్తుందని తెలుసు. ఈ నేపథ్యంలో కమిటీ విదేశీ వైద్యుల వ్యవహారంపై దృష్టిసారించింది. ఈ అనుమానాలకు బలం చేకూర్చేలా అలకనంద ఆస్పత్రి వెబ్‌సైట్‌లో యజమానుల వివరాలు ఉండడంతో.. కమిటీ ఈ అంశంపై ఫోకస్ చేస్తోంది.

రష్యా, ఉక్రెయిన్ వైద్యులు

అలకనంద కిడ్నీరాకెట్‌కు రష్యా, ఉక్రెయిన్‌తో సంబంధాలున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రి యజమాని డాక్టర్ సుమంత్ రష్యాలో ఎంబీబీఎస్ చేశారు. అక్కడి యూరాలజిస్టులతో తనకున్న సంబంధాలతో.. వారిని ఇక్కడికి పిలిపించి మూత్రపిండాల మార్పిడి సర్జరీలు చేయిస్తున్నట్లు తెలిసింది. అలకనంద వెబ్‌సైట్‌లో డాక్టర్ సుమంత్‌తోపాటు.. ముగ్గురు విదేశీ వైద్యులను 'హెడ్ ఆఫ్ అలకనంద ఆస్పత్రి'గా పేర్కొన్నారు. ఆ ముగ్గురు విదేశీ వైద్యులు నిజంగానే ఆస్పత్రిలో భాగస్వాములా? లేక.. సుమంత్ వారి ఫొటోలను అలా వాడుకున్నారా? అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఒకవేళ వారు నిజంగానే ఆస్పత్రి భాగస్వాములైతే.. భారత్‌లో సర్జరీలు చేస్తున్నారా? అందుకు ఎంసీఐ లైసెన్సు తీసుకున్నారా? అనేవి ప్రస్తుతానికి మిలియన్ డాలర్ల ప్రశ్నలుగా ఉన్నాయి.


ప్రధాన సూత్రధారి డాక్టర్ సుమంత్

రష్యా, ఉక్రెయిన్‌కు చెందిన వైద్యులను రప్పించి, వారితో సర్జరీలు చేయిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం నల్లగొండ కేంద్రంగా వెలుగులోకి వచ్చిన కిడ్నీ రాకెట్‌లోనూ.. దాతలు, స్వీకర్తలను తమిళనాడు, కర్ణాటక మీదుగా శ్రీలంకకు తరలించి, అక్కడ మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన విషయం తెలిసిందే..! ఈ కేసులోనూ విదేశీ లింకులున్నట్లు కమిటీ భావిస్తోంది.

సర్జరీలు జరిగిందెక్కడ?

అలకనంద ఆస్పత్రికి తొమ్మిది పడకలకే అనుమతి ఉంది. ఆ ఆస్పత్రిలో చిన్నపాటి ప్లాస్టిక్ సర్జరీలు, సాధారణ శస్త్రచికిత్సలు చేసేందుకు అనువైన ఆపరేషన్ థియేటర్ మాత్రమే ఉంది. అలాంటి చోట అవయవమార్పిడి నిర్వహించడం సాధ్యం కాదని యూరాలజిస్టులు అభిప్రాయపడుతున్నారు. "ఇలాంటి సర్జరీలకు అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ థియేటర్ సెటప్ ఉండాలి. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల సమయంలో ఇద్దరు యూరాలజిస్టులతో పాటు.. సహాయకుడిగా నెఫ్రాలజిస్టు, అనస్థీషియా నిపుణుడు/బృందం, జనరల్ ఫిజిషియన్, వాస్కులర్ సర్జన్, అత్యుత్తమ శిక్షణ పొందిన హెడ్ నర్స్, నర్సుల బృందం, అవసరాన్ని బట్టి కార్డియాలజిస్ట్ అవసరం ఉంటుంది" అని వివరిస్తున్నారు. దీంతో.. అలకనందలో మూత్రపిండాల మార్పిడికి అవకాశాల్లేవని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వేరే ఆస్పత్రిలో సర్జరీలు చేసి, శస్త్రచికిత్స తదనంతర పర్యవేక్షణకు కిడ్నీ దాతలు, స్వీకర్తలను అలకనందకు తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు సర్జరీలు ఎక్కడ జరిగాయన్న విషయం తెలియాలంటే.. ప్రధాన నిందితుడు సుమంత్ నోరు విప్పాల్సిందేనని కమిటీ, పోలీసు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

అనుమతులకు మించి సేవలు

తొమ్మిది పడకలున్న అలకనంద ఆస్పత్రికి ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ, జనరల్ ఫిజిషియన్ విభాగాల నిర్వహణకు మాత్రమే అనుమతి ఉందని రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు ఇదివరకే చెప్పారు. అయితే.. అలకనంద వెబ్‌సైట్‌లో మాత్రం రేడియాలజీ, యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, వాస్కులర్ సర్జరీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, రెహమటాలజీ, పెడియాట్రిక్స్, డెర్మటాలజీ విభాగాల్లో వైద్యసేవలు లభిస్తాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

కిడ్నీ మార్పిడికి రూ.50 లక్షలు

అలకనంద కిడ్నీ రాకెట్ ముఠా మూత్రపిండాల మార్పిడికి అవసరార్థుల నుంచి రూ.50 లక్షలు వసూలు చేస్తున్నట్లు విచారణ కమిటీ చీఫ్ డాక్టర్ నాగేందర్ మీడియాకు చెప్పారు. కిడ్నీలు విఫలమై.. దాతల కోసం వెతుకుతున్న ధనికులను గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్ఎంపీ డాక్టర్లను ఏజెంట్లుగా నియమించుకున్న విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. స్వీకర్తల నుంచి అక్షరాలా అరకోటి వసూలు చేస్తున్న ఈ ముఠా.. దాతలకు మాత్రం రూ.4 లక్షలు ఇచ్చి, చేతులు దులుపుకొంటుండడం గమనార్హం..! కాగా.. ఇప్పటి వరకు ఈ కేసులో పోలీసులు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరిలో ఆస్పత్రి యజమాని సుమంత్‌తోపాటు.. ఏజెంట్లు ఉన్నారు. ఆస్పత్రిలో దాడుల సమయంలో పరారైన వైద్యులను గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు రాచకొండ పోలీసులు 10 బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

నేనే చంపాను.. మీ వద్ద సాక్ష్యాలున్నాయా?

కేసు పెట్టి రిమాండ్ చేయండి.. కోర్టులోనే చూసుకుంటా.. భార్య హత్య కేసులో పోలీసులకు గురుమూర్తి సవాల్

- ఇంట్లో కనిపించని రక్తపు ఆనవాళ్లు.. దుర్వాసనా లేదు
- కిచెన్‌లో మాంసం నరికే చెక్క మొద్దు.. మద్యం సీసా
- హత్య చేసింది వాస్తవం.. మరి ఆ అవశేషాలెక్కడ?
- స్థానికంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలోనూ వెతుకులాట
- నిందితుడిది కట్టుకథ కాదు కదా? పోలీసుల మల్లగుల్లాలు



గురుమూర్తి ఇంట్లో మాంసం నరికే చెక్క మొద్దు, పక్కన మద్యం సీసా

గురుమూర్తి అద్దెకు ఉంటున్నది జిల్లెలగూడలోని ఈ ఇంట్లోనే

సరూర్‌నగర్, హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): "అవును నా భార్యను నేనే చంపాను.. మరి.. మీ వద్ద సాక్ష్యాలున్నాయా? నాపై కేసు పెట్టి రిమాండ్ చేయండి.. అంతా కోర్టులోనే చూసుకుంటా".. విశ్వసనీయ సమాచారం ప్రకారం జిల్లెలగూడ కేసులో నిందితుడైన మాజీ జవాను గురుమూర్తి పోలీసులకు విసిరిన సవాలు ఇది! ఇప్పుడు ఆ సాక్ష్యాలను వెతుకులాడే పనిలోనే పోలీసులు తలమునకలయ్యారు. భార్య వెంకట మాధవిని అతడు చంపింది నూటికి నూరుపాళ్ల వాస్తవం! మరి.. ఆ అవశేషాలు ఎక్కడ? కనీసం హత్య చేసినట్లుగా ఆనవాళ్లయినా కనిపించాలి కదా? అని పోలీసులు తలపట్టుకుంటున్నారు. అసలు.. గురుమూర్తి చెబుతున్నది వాస్తవమేనా? మృతదేహాన్ని ముక్కలుగా నరికి, ఉడికించి, వాటిని ఎండబెట్టి దంచి.. ఆ పొడిని చెరువులో కలిపేసి ఉంటాడా? లేదా.. తమను తప్పుదోవ పట్టించేందుకు అల్లిన కట్టుకథ కాదు కదా? విచారణలో గురుమూర్తి పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో పోలీసులు ఈ కోణంలోనూ ప్రశ్నలు వేసుకుంటున్నారు. గురుమూర్తి ఉంటున్న ఇంటి నుంచి అవశేషాలను పడేసినట్లుగా చెబుతున్న జిల్లెలగూడ చెరువు వరకు ఉన్న అన్ని సీసీ కెమెరాల డీవీఆర్‌లనూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జనవరి 16 నుంచి మాధవి కదలికలు ఎక్కడా కనిపించకపోవడంతో ఇంట్లోనే ఆమె హత్య జరిగి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. శరీర భాగాలను డ్రైనేజీలో వేశాడేమో అనే అనుమానంతో పోలీసులు బుధవారం పరిసర ప్రాంతాల్లోని అన్ని డ్రైనేజీ మ్యాన్ హోళ్లను తెరిపించి పరిశీలించారు. అయినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. బుధవారం వరకు గురుమూర్తిని మీర్‌పేటలోనే పోలీసులు విచారించారు. విషయం బయటకు పొక్కడంతో అదే రోజు రాత్రి అతడిని ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారణ జరుపుతున్నట్లు సమాచారం! గురువారం రాత్రి వరకు కూడా పోలీసులు ఈ కేసుకు సంబంధించి పెదవి విప్పకపోడం గమనార్హం!

వంటగదిలో మాంసం నరికే మొద్దు

భార్యను గురుమూర్తి ఇంట్లోనే హత్య చేసి ఉంటాడనే అనుమానాలకు బలం చేకూరేలా అతడు ఉంటున్న ఇంట్లోని వంటగదిలో మాంసం నరికే చెక్క మొద్దు కనిపించింది. గురుమూర్తి అద్దెకుంటున్న ఇంటి యజమాని, తన కుటుంబంతో కలిసి రెండు నెలల క్రితం బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది. పోలీసులు ఆయన్ను పిలిపించి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. అనంతరం ఆయన మళ్లీ ఇంటికి తాళం వేసుకుని బెంగుళూరు వెళ్లిపోయారు. ఆ భవనం రెండో అంతస్తులోని ఓ పోర్షన్‌లో గురుమూర్తి కుటుంబం ఉంటోంది. ఆ ఇంటికి కూడా పోలీసులు తాళం వేశారు. అయితే వంటగది కిటికీలో నుంచి లోపలికి చూస్తే కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద మాంసం నరికే చెక్క మొద్దు, పక్కన ఓ మద్యం బాటిల్, పళ్లెంలో చుడ్వా కనిపించాయి. ఓ సెల్ఫ్‌లో రెగ్యులర్‌గా వాడే చిన్న కుక్కర్ కనిపించింది. అయితే.. 50 కిలోలు ఉండే మనిషి మాంసాన్ని ఆ కుక్కర్‌లో ఉడికించడం సాధ్యమయ్యే పనేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఇంట్లో ఎలాంటి రక్తం మరకలు లేకపోవడం, వాసన కూడా రాకపోవడం పోలీసులను ఆలోచనలో పడేసింది. ఉడికించిన మాంసం ముక్కలతో పాటు ఎముకలను ఎండబెట్టినట్లుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ అక్కడ ఎండ ప్రసరించే ఛాయలే లేకపోవడంతో దీనికి బలం చేకూరడం లేదు. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా గురుమూర్తి పొడిపొడిగానే సమాధానాలు చెబుతున్నట్లు తెలిసింది.



నక్సలిజంపై ప్రత్యేక దృష్టి

- నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం: డీజీపీ డాక్టర్ జితేందర్

మెదక్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నక్సలిజంపై ప్రత్యేక దృష్టి సారించామని, నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో పరేడ్ మైదానం, సెల్యూట్ బేస్‌ను ఆవిష్కరించారు. ఎంపీ రఘునందన్‌రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. పోలీసు కవాతులో గౌరవ వందనం స్వీకరించిన డీజీపీ.. అతర్వాత మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన, మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీసుల సరెండర్ లీవ్‌లు, బిల్లులకు ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేసిందని, ఆరోగ్య భద్రతకు రూ.75 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం

యుద్ధం ఆపకపోతే మరిన్ని ఆంక్షలతో పీల్చిపిప్పిచేస్తానని అధికారంలోకి వచ్చీరాగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు రష్యా తాపీగా, శాంతంగా ప్రతిస్పందించింది. చర్చలకు తాము సిద్ధమేననీ, కానీ ఆంక్షలకే ట్రంప్ అత్యుత్సాహపడుతూంటారని క్రెమ్లిన్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఒకపక్క పుతిన్‌ను ప్రశంసిస్తూనే, ఆయనతో సాన్నిహిత్యం ఉన్నదని అంటూనే, రష్యాను ఇబ్బందిపెట్టడం తన ఉద్దేశం కాదని చెబుతూనే ట్రంప్ చాలా విమర్శలు చేశారు. దారికొచ్చి సంధికుదర్చుకోనిపక్షంలో వివిధ రకాల పన్నులు, సుంకాలు, ఆంక్షలతో రష్యాను దెబ్బతీస్తానని హెచ్చరించారు. తానేగనుక అధికారంలో ఉండివుండే అసలు ఈ యుద్ధమే మొదలయ్యేది కాదని ట్రంప్ మళ్ళీ గొప్పచెప్పుకున్నారు. పుతిన్ వల్లే రష్యా నాశనం అవుతోందనీ, ఆర్థికంగా పతనమైపోతోందనీ ఒకపక్క శాపాలు పెడుతూనే తామిద్దరి మధ్యా మంచి అవగాహన ఉన్నదని ట్రంప్ చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను బట్టి, ఆయన ఎప్పటినుంచో హామీ ఇస్తున్నట్టుగానే రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని సాధ్యమైనంతవేగంగా ముగించే ప్రయత్నమైతే ఆరంభిస్తున్నట్టు కనిపిస్తోంది.

ఉక్రెయిన్ యుద్ధం నాలుగో ఏడాదిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, అర్థంపర్థంలేని ఈ యుద్ధాన్ని ఇంకా పొడిగించడానికి వీల్లేదనీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారనీ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివర్లోగా శాంతి తెస్తానంటూ ఆయన తనకు ప్రమాణంచేశారని జెలెన్‌స్కీ కూడా చెబుతున్నారు. మొత్తంగా యుద్ధాన్ని ముగించడానికో, అందుకు వీలుగా చర్చలకో రంగం సిద్ధమవుతున్నట్టు కనబడుతోంది. యుద్ధం పరిష్కారం కాదని నరేంద్రమోదీ వంటివారు ప్రపంచవేదికలమీద ప్రవచిస్తున్నప్పుడల్లా పుతిన్ సైతం సానుకూలంగా స్పందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే.

రష్యా దిగివస్తుందా?

అయితే, అధికారంలోకి వచ్చిన ఒక్కరోజులోనే యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రకటించిన ట్రంప్‌కు అది అంత సులభం కాదని తెలియకపోదు. యుద్ధంలో రెండుపక్షాలూ పీకలోతున సుదీర్ఘకాలంగా మునిగి ఉండటం, అపారనష్టాలను మూటగట్టుకోవడం, ఎంతోకొంత కోల్పోనిదే కాలువెనక్కు తీసుకోలేకపోవడం వంటివి పరిష్కారాన్ని జటిలం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయపక్షాలనూ కూడా బుజ్జగింపులు, బెదిరింపులతో దారికి తేక తప్పదు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధ సరఫరాలతోనో, రష్యాను మరిన్ని ఆంక్షలతో శిక్షించడంవల్లనో యుద్ధాన్ని ఆపడం అసాధ్యం. ఉభయపక్షాలకూ ఎంతోకొంత లబ్ధిచేకూర్చి, రాజీపడేట్టుగా చేయడం తప్ప మార్గం లేదు. ఇన్నేళ్ళు యుద్ధం చేసి కూడా తనకు పక్కలోబల్లెంలాగా ఉంటున్న ఉక్రెయిన్‌ను అలాగే వదిలేయడం పుతిన్‌కు ససేమిరా ఇష్టం ఉండదు. ఉక్రెయిన్‌తో ఇకమీదట ఏ సమస్యా రాకుండా, అది నాటోతో కలిసి తన నెత్తినెక్కే అవకాశాలు లేనప్పుడే రష్యా దిగివస్తుంది. ట్రంప్ బృందం ప్రతిపాదనలకు ఉక్రెయిన్ సరేనంటే, అది ఐదోవంతు భూభాగాన్ని రష్యాకు వదులుకోవలసి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఆ మేరకు రష్యాను సంతృప్తిపరచి, మిగతా ఉక్రెయిన్‌ను పునర్నిర్మించడానికీ, ఆర్థికంగానూ, ఆయుధపరంగానూ అండగా ఉండటానికీ అమెరికా హామీ పడవచ్చు.

గెలిచిన యుద్ధాలతోనే కాదు, నిలిపినవాటితోనూ, నిలువరించినవాటితోనూ తాను విజయాన్ని లెక్కిస్తానని ట్రంప్ చెప్పుకున్నారు. పదిహేను నెలలుగా సాగుతున్న గాజాయుద్ధాన్ని ముగించడానికి చాలాకాలం ప్రయత్నాలు జరిగినమాట నిజం. ట్రంప్ అధికారంలోకి రావడానికి ముందే చర్చలు మొదలైనా, దిగిపోతున్న బైడెన్‌మాటకంటే, మరో నాలుగేళ్ళు అధ్యక్షుడుగా ఉండబోతున్న ట్రంప్ హెచ్చరికలకే నెతన్యాహూ దిగివచ్చారని అంతా నమ్ముతున్నారు. కాల్పుల విరమణతో పడిన ఆ తొలి అడుగు అంతిమశాంతికి దారితీస్తుందని భావిస్తున్నారు. స్వల్పకాలంలోనే ఉక్రెయిన్‌ను గెలవగలనని, అంతిమంగా తనదే పైచేయి అవుతుందని దానితో యుద్ధాన్ని ఆరంభిస్తున్న కొత్తలో పుతిన్ నమ్మారు. కానీ, అనేకశక్తుల రంగప్రవేశంతో యుద్ధం మరింత విస్తరిస్తూవచ్చింది, వెయ్యిరోజులకుపైగా ఎడతెగకుండా కొనసాగుతోంది. ఇంకా ఎంతకాలం సాగినా అంతిమంగా విజేతలంటూ ఎవరూ లేకపోయినా, అణ్వాయుధ వినియోగం ప్రమాదం కూడా పెరగవచ్చు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇచ్చిన హామీకి అనుగుణంగా అడుగులు పడితే సంతోషించాల్సిందే.

రాజ్యాంగస్ఫూర్తిని చాటే రేడియో కవి సమ్మేళనం

ఆకాశవాణి 1956 నుంచి నిర్వహిస్తూ వస్తున్న సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం విలక్షణమైనది. రాజ్యాంగ స్ఫూర్తికి, భిన్నత్వంలో ఏకత్వం అనే భావానికి ప్రతిరూపంగా, తనదైన శైలిలో అన్ని భాషల కవులను సంవత్సరానికి ఒకసారి ఒకే వేదిక మీద కలిపే అపూర్వ సందర్భమిది. ప్రతి ఏటా 23 భాషల్లో ఒక్కో కవిని ఎంపిక చేసి, అందరి కవితలనూ అన్ని భాషలలోకి అనువదించి జనవరి 25 రాత్రి పది గంటలకు దేశంలోని అన్ని కేంద్రాల ద్వారా ప్రసారం చేయటం ఆనవాయితీ. మరుసటి రోజు అంటే దేశ రిపబ్లిక్ దినోత్సవం నాడు మరోసారి అన్ని కేంద్రాలు వారి వీలును బట్టి ప్రసారం చేస్తాయి. ఇలా ఏ ప్రసార మాధ్యమంలోనూ జరుగదు. కవులను ఒకే వేదిక మీదకు తీసుకురావటం వల్ల వారి వారి భావాలను, ఆలోచనలను పంచుకోవడానికి వీలుకలుగుతుంది. భిన్న ప్రాంతాల ఆచార సంప్రదాయ సాంస్కృతిక రంగాల అంశాలను కలబోసుకునే అద్భుత అవకాశం ఉంటుంది. ఒక సమైక్య సమభావం బలపడుతుంది.

ఆకాశవాణి 2025 సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనానికి ముంబై ఆకాశవాణి కేంద్రం వేదిక అయ్యింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాష నుంచి ఏనుగు నరసింహారెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం తన 75 ఏళ్ళ చరిత్రలో 2014లో ఈ సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించింది. ప్రతి కవికి ఈ సమ్మేళనంలో పాల్గొనాలనే కోరిక ఉండటం సహజం. అవకాశం వచ్చినవారు గౌరవంగా, కొంచెం గర్వంగా అనుభూతి పొందుతారు కూడా. ఎవ్వరూ దీనికి అతీతులు కాకపోవచ్చు. ఇతర భాషల కవితలను అనువాదం చేయటం కూడా కత్తి మీద సాము లాంటిది. కవిత్వంలో, అనువాదంలో లబ్ధప్రతిష్ఠులతో ఈ పని పూర్తిచేయటం కూడా బృహత్ కార్యక్రమమే. ఈ సంవత్సరం ముకుంద రామారావు, మందలపర్తి కిషోర్, నందిని సిధారెడ్డి, కొలకలూరి ఇనాక్, అమ్మంగి వేణుగోపాల్, యార్లగడ్డ రాఘవేంద్రరావు, సుమనస్పతి రెడ్డి, సమ్మెట నాగమల్లేశ్వరరావు, నాళేశ్వరం శంకరం, సుధామ, యాకుబ్, శిలా లోలిత, చిల్లర భవానిదేవి, మామిడి హరికృష్ణ, ఐనంపూడి శ్రీలక్ష్మి, దర్భశయనం శ్రీనివాసాచార్య, తాడేపల్లి పతంజలి, అనంత పద్మనాభరావు, జింబో (మంగారి రాజేందర్) తదితరులు వివిధ భాషల కవితలను తెలుగులోకి అనువాదం చేశారు. వీరందరినీ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ఒకే వేదిక మీదకి తీసుకువచ్చి సత్కరించి, వారి అనువాదాలను వారితోనే చదివించి రికార్డు చేసింది. ఈ మహత్తర కార్యక్రమం ప్రోగ్రామ్ హెడ్ కొమ్మారెడ్డి లక్ష్మీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సుంకసరి రమేష్, అవధానులు శ్రీహరి, సందీప్‌ల బృందం పూర్తి చేసింది.

గత నాలుగైదు సంవత్సరాలుగా నాకు కూడా ఈ కార్యక్రమాన్ని దగ్గరగా పరిశీలించే అవకాశం దొరికింది. ఇతర భాషలలో కంటే తెలుగులోనే ప్రయోగాలు ఎక్కువగా కనిపించాయి. తెలుగు భాష కవిత్వంలోనే సామాజిక సంక్షోభాలు, మానవ సంబంధాలు, సమకాలీన మానసిక జీవన సంఘర్షణలు ఇలా ఎన్నో ఎన్నెన్నో అంశాలు గురించి కవుల మథనం స్పష్టంగా కనిపించింది. అయితే మన వారి కవిత్వం ఇతర భాషల్లోకి పెద్దగా తర్జుమా అవుతున్నట్లు లేదు. ఇది బాగా లోటు అనిపిస్తోంది. ప్రస్తుత కాలంలో ఆకాశవాణి నిర్వహిస్తున్న సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం సాహిత్య అభిలాషులకు, అభిమానులకు ఎడారిలో ఒయాసిస్సు వంటిందని చెప్పటానికి సందేహించవలసిన అవసరం లేదు.

– వలేటి గోపీచంద్
ఆకాశవాణి విశ్రాంత అధికారి

ప్రపంచ ప్రయాణం 19వ శతాబ్దంలోకి..?

మనుషుల సంతోషాన్ని విస్తృతపరుస్తూ సమాజం ముందుకే వెళుతుందని మనం నమ్ముతాం. మొన్నటికంటే నిన్న మిన్నగా.. నిన్నటి కంటే నేడు ఘనంగా.. నేటి కంటే రేపు మరింత అద్భుతంగా ఉంటుందంటూ రెండుమూడు వందలేళ్లల్లో చాలా రచనలు వచ్చాయి. ఆశలు లేకపోతే అడుగులే పడవు. భవితకు భరోసా కనపడకపోతే మన ప్రయత్నాల్లో ఊపూ ఉత్సాహం ఉండదు. సుదీర్ఘ కాలప్రవాహంలో సమాజం ముందుకు నడవటం నిజం! స్థూలంగా చరిత్ర చెప్పేది ఇదే! కానీ వెనుకంజ లేని సమాజమూ జీవితమూ ఉండవు. ఆ వెనుకంజ ఒక్కోసారి భయం కొల్పుతుంది. గతాన్ని నెత్తిమీదకు తెచ్చి పెడుతుంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. అంతర్జాతీయ వ్యవహారాల వ్యాఖ్యాత, ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్' టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు (ఇంపీరియలిజం) పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. సంతృప్తికరమైన జవాబు మాత్రం రాలేదు. సమాధానాలు రానంత మాత్రాన ప్రశ్నల విలువలు తగ్గిపోవు. చరిత్రలో జవాబులకంటే ప్రశ్నలకే బలం ఎక్కువ. మనిషి అన్వేషణలన్నీ ప్రశ్నలతోనే మొదలయ్యాయి. మహామహా ఆవిష్కారాలన్నీ వాటితోనే సాధ్యమయ్యాయి. వస్తువులను, పరికరాలను సృష్టించుకుని మనుగడ సాగిస్తున్న మనుషులకు ప్రపంచ సృష్టికి కూడా ఎవరో కారణమై ఉంటారనే ప్రశ్న తట్టి.. జవాబుల కోసం సాగించిన చింతనాన్వేషణతోనే మతాలన్నీ ఊపిరులు పోసుకున్నాయి. ఒక పథకంతో, శ్రమతో చేసే వస్తు, పరికర సృష్టే మానవ జీవనసారం కాబట్టి ఈ చరాచర ప్రపంచమూ అటువంటి సృష్టిజనితమేనని మనిషి అనుకున్నాడు. కాబట్టి ప్రశ్నకున్న విశిష్ట ప్రాధాన్యత నుంచి చూస్తే 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలు మళ్లీ విజృంభిస్తున్నాయా? అన్నది సందర్భోచితమైందిగానే తోస్తుంది. లోతుగా పరిశీలిస్తే ఆ ప్రశ్నకు సమాధానం అవుననే కొంతమేరకు చెప్పుకోవాల్సి వస్తుంది. ఆనాటి పోకడలు కొన్ని ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇవి ఎంత బలపడితే అంతగా ప్రపంచం వెనుకడుగులు వేస్తున్నట్టుగా కచ్చితంగా భావించొచ్చు.

19వ శతాబ్దంలో సామ్రాజ్యవాదాన్ని అనుసరించిన దేశాలన్నీ జాతీయవాదంతోనే తమ ఆక్రమణలను, ఆధిపత్యాన్ని సమర్థించుకున్నాయి. తమ దేశమే అన్ని రంగాల్లోనూ ముందుండాలనే వాదననే ప్రచారాస్త్రంగా చేసుకుని ప్రజలను యుద్ధోన్ముఖంగా నడిపించాయి. మొదటి ప్రపంచయుద్ధం ఆ విధంగానే వచ్చింది. అగ్రస్థానం కోసం అన్ని నియమాలనూ కాలదన్నాయి. వెనుకబడిన దేశాల ప్రజలకు నాగరికతనూ ఆధునికతనూ సాంకేతిక–శాస్త్ర విజ్ఞానాన్నీ అందివ్వటానికే ఆక్రమణలూ ఆధిపత్యాలూ యుద్ధాలూ అవసరమని వాదించాయి. సామ్రాజ్యవాదం ప్రత్యక్ష ఆక్రమణ రూపంలోనే ఉండాల్సిన పనిలేదు. కీలుబొమ్మ ప్రభుత్వాలను పెట్టి కీలక నిర్ణయాలన్నీ గుప్పెట్లో పెట్టుకుని సంపదను తరలించుకుపోయే పరోక్ష సామ్రాజ్యవాదమూ ఉంటుంది. రెండిటిలోనూ జరిగేది ఒకటే. ముడిసరుకుల సరఫరా కేంద్రంగా ఆక్రమిత దేశాలను మార్చివేయటం, పారిశ్రామిక ఉత్పత్తులకు కొనుగోలు మార్కెట్లుగా దిగజార్చటం సామ్రాజ్యవాదంలో ప్రధానంగా ఉంటుంది. ఇప్పుడైతే కాలుష్యకారక పరిశ్రమలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. అన్ని వ్యవస్థలనూ సామ్రాజ్యవాదం తన అవసరాలకు అనుగుణంగా మార్చివేస్తుంది. రాజకీయాలు మారిపోతాయి. పండే పంటలు మారిపోతాయి. చేసే ఉత్పత్తులు మారిపోతాయి. భూములపై హక్కులు మారిపోతాయి. పాతవర్గాలు పోతాయి. కొత్త వర్గాలు పుట్టుకొస్తాయి. ఇక రైల్వేలు, పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆధునిక విద్యా సౌకర్యాలు.. శాంతిభద్రతల స్థాపన లాంటివన్నీ సామ్రాజ్యవాద అవసరాల్లో భాగంగా కొంతమేరకు వస్తాయి. సామ్రాజ్యవాదం అహంకారపూరిత జాతీయవాదం చాలా సందర్భాల్లో పెనవేసుకునే ఉంటాయి.



> ట్రంప్ కోరుకున్నట్లుగా అన్నీ జరిగితే 21వ శతాబ్దం కచ్చితంగా కొన్ని అంశాల్లోనైనా 19వ శతాబ్దంలోకి పరకాయప్రవేశం చేస్తుంది. ఆనాటి సామ్రాజ్యవాద ఆత్మను ఆవాహన చేసుకుంటుంది. జాతి ఆధిక్యతా–న్యూనతా భావాల సుడిలో చిక్కుకుంటుంది. పర్యావరణ పరిరక్షణపై నిబద్ధత పలచబారిపోతుంది. ఇంటాబయటా వైవిధ్యాలను ఆక్షేపించే ఉపద్రవాన్ని తెస్తుంది. అసమానతలపై ఉపేక్షతను ప్రదర్శిస్తుంది. చివరకు ఉదార ప్రజాస్వామ్యమే కుదేలవుతుంది!

అమెరికా అగ్రస్థానంలో ఉండాలని పదేపదే వినిపిస్తున్న వాదనను పరిశీలిస్తే ఆ తరహా జాతీయవాదమే కనపడుతుంది. ఇతర దేశాల పట్ల అనుసరించాల్సిన మర్యాదలను విపరీత జాతీయవాదం పాటించదు. పన్నుల్లో అసంబద్ధత ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవటం ఆధునిక దౌత్యనీతి. ట్రంప్ హెచ్చరికలను చూస్తే ఆ దౌత్యనీతి ఛాయలు ఎక్కడా కనిపించవు. ఇంతపన్ను విధిస్తాం.. అంత పన్ను విధిస్తాం.. అనే ఏకపక్ష ప్రకటనలే మనం వింటున్నాం. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలనీ, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తామనీ, పనామా కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామనీ చేసే ప్రకటనలు సామ్రాజ్యవాద కాలాన్ని గుర్తుకు తెస్తాయి. దౌత్య పద్ధతులను, ఒప్పందాలను ఖాతరు చేయకపోవటం సామ్రాజ్యవాదంలో ఒక ప్రధాన లక్షణంగా ఉండేది. పరస్పర అంగీకారాల ద్వారా ఏర్పడిన సంస్థలను తప్పుపట్టటం, వాటి నుంచి వైదొలగటం ఆనాటి పోకడల్లో భాగమే. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచీ ప్రపంచ పర్యావరణ ఒప్పందం నుంచీ తప్పుకోవటాన్ని ఇంకోలా అర్థం చేసుకోలేం. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం జరగాలనీ దిగుమతులు-ఎగుమతులపై పన్నులు కనీస స్థాయిలో ఉండాలనీ ఆర్థిక సంస్కరణల పేరిట వివిధ దేశాలకు నిర్దేశించిందీ అమెరికా పాలకులే. ఇప్పుడు దానికి భిన్నంగా 19వ శతాబ్దంలో చేసినట్లు అధిక పన్నులను విధించి చౌక ఉత్పత్తులతో తమకు పోటీదారులుగా మారిన దేశాలను కట్టడి చేయాలనీ చూస్తున్నారు. చైనాతో వ్యవహరిస్తున్న తీరే దీనికి నిదర్శనం. పారిశ్రామిక విప్లవం తర్వాత ఇప్పటి ధనిక దేశాలన్నీ ఆనాటి పోటీ దేశాల ఉత్పత్తులపై విపరీతంగా పన్నులు వేసి వినియోగదారులు వాటిని కొనకుండా చేశాయి. భారత-చైనా సంప్రదాయ ఉత్పత్తులను అలాగే దెబ్బతీశారు. అధికపన్నుల విధింపులనే 'టారిఫ్ వాల్స్'గా పిలుస్తారు. ట్రంప్ హెచ్చరికలు కూడా ఆ 'వాల్స్' లాంటివే. ట్రంప్ దూకుడు చూస్తుంటే ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి కూడా వైదొలగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.



■ రాహుల్ కుమార్

పర్యావరణ విధ్వంసం 19వ శతాబ్దంలో విపరీతంగా పెరిగింది. 1869–1914ల మధ్య కాలాన్ని సామ్రాజ్యవాదం ఉచ్ఛదశగా చరిత్రకారులు పరిగణిస్తారు. ఆ కాలంలో జరిగిన పర్యావరణ విధ్వంసంతో ఏ యుగాన్నీ పోల్చలేం. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో పర్యావరణం గణనీయ మార్పులకు లోనైంది. ప్రకృతిని మనుషుల మనుగడకు ఆధారమని భావించకుండా దాన్ని జయించటం నాగరికత పరమార్థంగా ఆనాడు మారింది. పర్యావరణ పరిరక్షణ అనే భావనే ఆనాడు పాలకుల్లో లేదు. శిలాజ ఇంధనాలు కలగచేసే నష్టాలు తెలియవు. అడవుల కొట్టివేత విపరిణామాలు తెలియవు. పరిశ్రమల కాలుష్యం అరికట్టే విధానాలూ లేవు. విషయపరిజ్ఞానమూ లేదు. కొన్ని హెచ్చరికలు ఉన్నా లాభాలపై యావతో చెవికెక్కించుకోలేదు. 1970ల తర్వాతే పర్యావరణ చైతన్యం పెరిగింది. ఉష్ణోగ్రతలను పారిశ్రామిక విప్లవం నాటి కంటే రెండు డిగ్రీలు కిందకు దించకపోతే మానవాళి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందనే హెచ్చరికలు ఎన్నో ఉన్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాద పోకడలతో పర్యావరణ పరిరక్షణ చర్యలను ఈసడించుకోవటం స్పష్టంగా కనపడుతుంది. పర్యావరణ విపరిణామాలతో ఆర్కిటిక్ మంచుఫలకాలు కరుగుతున్నా ఉపేక్షిస్తూ అక్కడున్న గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రణలోకి తీసుకోవాలన్న ప్రతిపాదన వెనుకా అదే కన్పిస్తుంది. అక్కడున్న అరుదైన లోహాలు, చమురు సంపదపై ధ్యాసతో పాటు సైనిక ప్రయోజనాలే లక్ష్యంగా గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం కోసం అడుగులు పడుతున్నాయి. పనామా కాలువను ఎట్లాగైనా స్వాధీనం చేసుకుంటామని చెబుతున్న ట్రంప్.. అసలు ఆ కాలువను కట్టిందే అమెరికానేనని చేస్తున్న వాదన వెనుక పెద్ద చరిత్రే ఉంది. పనామా ఒకప్పుడు కొలంబియా దేశంలో ఒక రాష్ట్రంగా ఉండేది. 19వ శతాబ్దం చివరి నాటికి హవాయి, ఫిలిప్పీన్స్‌లను చేజిక్కించుకున్న అమెరికాకు అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాలను కలిపేలా కాలువ కావాల్సివచ్చింది. ఆ కాలువలో యుద్ధనౌకలు తిరగటం ఆనాడు అమెరికాకు అత్యవసరం. కాలువకు భూభాగం అడిగితే కొలంబియా అంగీకరించలేదు. 1903లో పనామాలో తిరుగుబాటు జరిగితే వెంటనే అమెరికా మద్దతు ప్రకటించి ప్రత్యేక దేశంగా గుర్తించింది. ప్రతిఫలంగా కాలువ తవ్వే హక్కునీ కాలువకు అటూఇటూ 8 కిలోమీటర్ల భూమినీ అమెరికాకు అప్పగించింది. కాలువ తవ్వకం 1914 ఆగస్టు 15న పూర్తయింది.

గత ఒప్పందాలన్నీ తిరగతోడితే దేశాల సరిహద్దులే చెదరిపోతాయి. ఏనాడో వదులుకున్న హక్కులను ఇప్పుడు కావాలనుకుంటే దేశాల తలరాతలు మారిపోతాయి. ఉక్రెయిన్‌తో పాటు మధ్య ఆసియా దేశాలపైనా రష్యా హక్కులు కోరొచ్చు. తైవాన్‌ను చైనా బలవంతంగా స్వాధీనం చేసుకోవచ్చు. అంతెందుకు మెక్సికో తాను అమెరికాకు కోల్పోయిన భూభాగాలనూ తిరిగి అడగొచ్చు.

> అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ గెలిచిన నాటి నుంచి ఒక వెనుకంజ గురించి తరచూ వినపడుతోంది. ప్రముఖ పాత్రికేయుడైన ఫరీద్ జకారియా ఇటీవల తన 'గ్లోబల్ పబ్లిక్ స్క్వేర్' టీవీ కార్యక్రమంలో ట్రంప్ విజయంతో 19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదపు పోకడలు మళ్లీ విజృంభిస్తాయా అనే ప్రశ్నను లేవనెత్తారు.

19వ శతాబ్దం నాటి సామ్రాజ్యవాదం పోకడలనే కాకుండా దాని విశ్వరూపం తెలుసుకుంటే ఇప్పటి తరాలకు ఆశ్చర్యంగా ఉంటుంది. జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్త అలెగ్జాండర్ సుపన్ 1900లో ఇచ్చిన లెక్కల ప్రకారం.. అమెరికా, యూరపు దేశాలు ఆఫ్రికా ఖండంలో 90.4 శాతం, పసిఫిక్ ఐలాండ్స్‌లో 98.9 శాతం, ఆసియాలో 56.5 శాతం, ఆస్ట్రేలియాలో 100 శాతం, అమెరికాలో 27.2 శాతం భూభాగంపై ఆధిపత్యం సంపాదించాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం, ఇటలీ... అంటే తొమ్మిది దేశాలు ప్రపంచాన్ని ఆ రీతిలో పంచుకున్నాయి.

అమెరికాలో ట్రంప్ కోరుకున్నట్లుగా అన్నీ జరిగితే 21వ శతాబ్దం కచ్చితంగా కొన్ని అంశాల్లోనైనా 19వ శతాబ్దంలోకి పరకాయప్రవేశం చేస్తుంది. ఆనాటి సామ్రాజ్యవాద ఆత్మను ఆవాహన చేసుకుంటుంది. జాతి ఆధిక్యతా–న్యూనతా భావాల సుడిలో చిక్కుకుంటుంది. పర్యావరణ పరిరక్షణపై నిబద్ధత పలచబారిపోతుంది. ఇంటాబయటా వైవిధ్యాలను ఆక్షేపించే ఉపద్రవాన్ని తెస్తుంది. అసమానతలపై ఉపేక్షతను ప్రదర్శిస్తుంది. అంతర్జాతీయ సంస్థల మనుగడకు ప్రమాదం వస్తుంది. శరణార్థులకు చోటు కరువవుతుంది. భిన్న లైంగిక ప్రవర్తన బలిపీఠం ఎక్కుతుంది. అబార్షన్ హక్కుకు విఘాతం కలుగుతుంది. జాతీయవాదానికి స్వార్థమే పరమార్థమవుతుంది. చివరకు ఉదార ప్రజాస్వామ్యమే కుదేలవుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

దేవాలయాలకు నష్టం చేస్తే ఎలా?

గత బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల విలువైన దేవాలయ భూములను నాయకులు దోచుకున్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దేవాలయ భూములకు పాసు పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇదిలా వుండగా మహిళా సంఘాల వారిని కోటీశ్వరులను చేయటానికి, వారితో 1000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టిస్తామని ఆర్థిక, విద్యుత్ శాఖామాత్యులు భట్టి విక్రమార్క ఇటీవల చెప్పారు. వారికి బహుశా ప్రభుత్వ స్థలాలు ఇస్తారేమో అనుకున్నాం, కానీ దురదృష్టవశాత్తూ దేవాలయ భూములను లీజుకు ఇచ్చి వాటిలో నిర్మించదలచారని పేపర్లలో వచ్చింది. ఇది ఎంతో శోచనీయం. ఎందుకంటే సోలార్ ప్లాంటు దేవాలయాల తరఫున పెడితే బ్యాంకు అప్పు తీరాక వచ్చే లాభం దేవాలయానికి వస్తుంది, దానితో దేవాలయాలను, గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చు. కానీ మహిళా సంఘాలకు దేవుడి మాన్యాలను ఇస్తే ఆ సంఘంలో ఉండే అయిదుగురో లేదా పదిమందికో మాత్రమే లాభం కలుగుతుంది. గ్రామానికి కానీ, దేవాలయానికి కానీ లాభం ఉండదు.

మన పూర్వీకులు ఎందరో తమ స్వంత భూములను దేవాలయాలకు ఇచ్చారు. వాటిని ఇప్పుడు మహిళా సంఘాలకు 25–30 ఏళ్ళకు లీజుకు ఎందుకు ఇవ్వాలి? తరువాత వారు తిరిగి ఇస్తారన్న నమ్మకం ఏమిటి? ఇదంతా భక్తులకు మనస్తాపం కలిగించే విషయం. మహిళా సంఘాలకు ఇవ్వదలచుకుంటే ప్రభుత్వ భూములు ఇవ్వాలి కానీ, దేవాలయాల భూములను లీజు పేరుతో వేరే వారికి ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఎక్కడ ఉంది? కొంత మంది మహిళలను కోటీశ్వరులను చేసే ప్రయత్నంలో దేవాలయాలకు నష్టం చేస్తే ఎలా? ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో పునరాలోచన చేసి అయిదు జిల్లాల్లో 231 ఎకరాల దేవాలయాల భూములను మహిళా సంఘాలకు ఇచ్చే నిర్ణయాన్ని విరమించుకోవాలి. దేవాలయ భూముల్లో తలపెట్టిన సోలార్ విద్యుత్తు తయారీ కార్యక్రమాన్ని ఆ దేవాలయానికే చెందే విధంగా నిర్ణయం తీసుకోవాలి. గత 10 సంవత్సరాలలో దేవాదాయ శాఖకు నష్టం చేసిన వారి మీద విచారణ జరిపి, పోగొట్టుకున్న దేవుడి మాన్యాలను తిరిగి దేవాలయాలకు దఖలుపడేలా చర్యలు తీసుకోవాలి.

– జమలాపురపు శ్రీనివాస్

గుండె జారని పాట

చెట్లను నరికేయడం
మొక్కల్ని పెరికేయడం కొత్త కాదు
మట్టి పూసుకున్న విత్తనాల నెత్తురుతారో!

సగం పగిల్న దుఃఖిత చెమట చుక్కల దగ్గర
చేతులు కలిపిన అడుగుల సుందర ప్రపంచ కలల్ని
ఆదరంగా
అడవి కడుపులో దాచుకొనేది
ఒక్కసారే శిశిర మెందుకొచ్చిందో!

తలల వెలలు ఊరించడం ఇవ్వాళే కాదు గానీ
ఒక్కసారిగా పడమర దిక్కు
అడవినెందుకు ప్రేమించిందో!
చూపు ఎక్కలేకు
మంచుపొగ గాఢతర గోడెన్దుకు కట్టిందో!

మెటల్ డిటెక్టర్‌ను ప్రేమలో పడేసి
తన కన్నును తన వేలే పొడవడం కొత్త కాదు
అడివంతా రేలా పూల పరిమళాలు
నెత్తుటి వాసనెన్దుకేస్తున్నాయో!

ఈ విభూది పొద్దు మాటున
సాల్వాజుడుం తొడుక్కున్న ఎర్ర దుస్తుల చూపులు
కొండ శిఖరం చేరాకే
కగార్ గుడారాల తుపాకి కాళ్ళు మొలిచాయో!

ఈ పురిటి నొప్పుల మీద
అందమైన పదచిత్రాలు పొదగలేక పోతున్నాను
క్షమించండి!
ఈ దుఃఖపు ముద్దల చేతితో
గొంతు పెగలడం లేదు కాని

అదిగో
కల్లోల సముద్రం మీంచే
గుండెజారని జాలరి పాట వినిపిస్తోందిప్పుడు

– వడ్డెబోయిన శ్రీనివాస్

కృత్రిమమేధతో అందరికీ విద్య


ప్రపంచ జనాభా 81 బిలియన్‌లలో 24 శాతం పైగా నిరక్షరాస్యులు ఉన్నారు. 195 దేశాలలో 74 శాతంపైగా దేశాలు నిరక్షరాస్యత, అవిద్యతో నేటికీ పోరాటం సాగిస్తూనే ఉన్నాయి. ఈ భూమిపై ఉన్న ప్రతి మానవుడికి విద్య ఒక ప్రాథమిక మానవ హక్కుగా నిర్ధారిస్తూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. నిరక్షరాస్యత, అవిద్యలను పారద్రోలడానికి మానవజాతిని సమాయత్తం చేస్తోంది. ఈ లక్ష్యసాధనలో జనవరి 24ను అంతర్జాతీయ విద్యాదినోత్సవంగా ప్రకటించింది. వివిధ దేశాల ప్రభుత్వ సంస్థలను, విద్యారంగంపై కృషి చేస్తున్న అన్ని సంస్థలను ఏకీకృతం చేసి – తమ కార్యకలాపాలను పునఃసమీక్షించుకుంటూ ముందుకు నడిపేందుకు ఈ అంతర్జాతీయ విద్యాదినాన్ని ప్రతిపాదించింది.

లింగభేదాలు, ఆర్థిక అసమానతలు అధిగమించి 2030 నాటికి అత్యుత్తమమైన ఉన్నత విద్యను, ప్రామాణికమైన వృత్తి శిక్షణలను విశ్వవ్యాప్తంగా అందరికీ సమకూర్చాలని ఐక్యరాజ్యసమితి విధివిధానాలను సిద్ధంచేసింది. ప్రపంచదేశాలు విద్యను ప్రతి పౌరుడికి తప్పనిసరి చేస్తూ, ఉచితంగా అందరికీ సమకూరే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరింది. దేశాలన్నీ పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, డిజిటల్ విద్యావిధానంవైపు పురోగమించటం నేటి అనివార్య అవసరంగా ఐక్యరాజ్యసమితి భావిస్తోంది. ఈ నేపథ్యంలో 2025 జనవరి 24 విద్యాదినోత్సవాన్ని 'Artificial Intelligence and Education: Preserving Human Agency in a World of Automation' అంశంగా నిర్వహిస్తోంది.

20వ శతాబ్దంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచం సాధించిన పురోగతి విద్యారంగంలో పెనుమార్పులకు కారణం అయ్యింది. ఇంటర్నెట్, కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్స్ దైనందిన పాఠ్యాంశ బోధనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డులు, ఈ బుక్స్ కంప్యూటర్ లాబ్‌లు ఆధునిక తరగతి గదులకు చిరునామాగా మారాయి. ఇంటర్నెట్ సహకారంతో ఆన్‌లైన్ తరగతులు, వర్చువల్ క్లాసులు విద్యాబోధనలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. అంతర్జాలం కేంద్రంగా వెబ్‌నార్ల సహకారంతో ప్రపంచ స్థాయి విద్యాబోధన విశ్వవ్యాప్తంగా లభిస్తున్నది. ఈ నేపథ్యంలో కృత్రిమమేధతో విద్యాబోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యా ప్రణాళికల రూపకల్పన ఇత్యాది అవకాశాలను ఐక్యరాజ్యసమితి పరిశీలిస్తున్నది. ఈ సంవత్సరం జనవరి 24న నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యా దినోత్సవంలో ఈ అవకాశాలపై ప్రపంచ దేశాలతో సమావేశాలు నిర్వహిస్తోంది.

కృత్రిమ మేధను విద్యారంగంలో మరింత ఎక్కువగా ఉపయోగించడానికి ప్రపంచ దేశాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. కృత్రిమ మేధతో విద్యార్థుల గ్రహణశక్తిని పసిగట్టడానికి, తదనుగుణంగా పాఠ్య బోధనా ప్రణాళికలను రూపొందించడానికి కృషి జరుగుతోంది. కృత్రిమ మేధ సహాయంతో విద్యార్థుల ప్రజ్ఞా

> కృత్రిమ మేధతో విద్యార్థుల గ్రహణశక్తిని పసిగట్టడానికి, తదనుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపొందించడానికి కృషి జరుగుతోంది. ఏఐ సహాయంతో విద్యార్థుల ప్రజ్ఞాపాటవాలను గుర్తించడం, గ్రేడులను నిర్వహించడం వంటి పద్ధతులను పెంపొందిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసే కంప్యూటర్ అనువర్తనాలను తయారు చేస్తున్నారు.



పాటవాలను గుర్తించడం, గ్రేడులను నిర్వహించడం వంటి పద్ధతులను పెంపొందిస్తున్నారు. పాఠ్యాంశాలపై ప్రశ్నోత్తరాలను నిర్వహించి, విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసే కంప్యూటర్ అనువర్తనాలను తయారు చేస్తున్నారు. కృత్రిమ మేధతో విద్యార్థుల బలహీనతలను గుర్తించడం అపూర్వ విజయాలు సాధించడానికి తగిన సూచనలు సలహాలు అందించే 'అల్గారిథమ్'లను రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం మెరుగుపరచడానికి, విద్యార్థులు త్వరితగతిన పాఠ్యాంశాలు నేర్చుకునే నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృత్రిమ మేధతో కంప్యూటర్ వ్యవస్థలను తయారు చేయటం ప్రారంభించారు. పాఠ్యప్రణాళికల రూపకల్పనకు, పాఠశాలల నిర్వహణకు, విద్యార్థుల ప్రజ్ఞా పాటవాలను అంచనా వేయడానికి కృత్రిమ మేధను పెద్దఎత్తున వినియోగించే ప్రయోగాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. విద్యార్థులు చదువు మానివేయకుండా నియంత్రించడానికి, చదువులో వెనకపడకుండా పర్యవేక్షించడానికి, చదువుపై ఆసక్తిని పెంపొందించడానికి సరికొత్త అప్లికేషన్లను కృత్రిమ మేధతో అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆధునిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను అందిపుచ్చుకోవటంతో పాటు భారతదేశం నేటి జనాభా అవసరాలకు తగినన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను పెంపొందించుకోవాలి. 1.4 బిలియన్ల జనాభాగల మన దేశంలో 1,113 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. సుమారు 14 లక్షల పైచిలుకు పాఠశాలలున్నాయి. ఈ సంస్థలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తూ సంఖ్య మరింత పెంచుకోవాలి. భారతదేశం జీడీపీలో 2.8 శాతం మాత్రమే విద్య కోసం కేటాయిస్తున్నది. దేశ జనాభాకు తగినంతగా ఈ కేటాయింపులు మరింత పెంచవలసివుంది. ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశాల జాబితాలో ప్రథమ స్థానంలో ఉన్న మన దేశం అక్షరాస్యతా శాతంలో 128వ స్థానంలో ఉంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిన దేశాలు ప్రపంచంలో అనేకం ఉన్నాయి.

దేశంలో 1.5 మిలియన్లపైగా విద్యార్థులు ఇంజనీరింగ్ మరియు సాంకేతిక శాస్త్రాలలో, 8.5 మిలియన్‌లపైగా విద్యార్థులు బి.యస్‌సి., బి.ఏ., బి.కామ్., మొదలైన సాధారణ శాస్త్రాలలో, 60 వేలకుపైగా వైద్యవిద్యార్థులు ప్రతి సంవత్సరం పట్టభద్రులు అవుతున్నారు. 1.4 బిలియన్ జనాభా గల మన దేశంలో ప్రతి సంవత్సరం పది మిలియన్ల జనాభాను మాత్రమే పట్టభద్రులుగా రూపొందించుకోగలుగుతున్నాం. ఇది భారతీయ సమాజాన్ని అప్రమత్తం చేస్తున్న ప్రమాదఘంటిక. ఈ సంఖ్య మరింత పెరగాలి అంటే కళాశాలల, విశ్వవిద్యాలయాల సంఖ్యను పెంచుకోవాలి. స్థాపించబడిన సంస్థలను మరింత బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో నేటికీ మన విశ్వవిద్యాలయాల ర్యాంకులు 145 అంతకన్నా క్రిందస్థాయిలోనే ఉంటున్నాయి. ఈనాడు ప్రపంచంతో పోటీపడుతున్న భారతదేశం విద్యారంగంపై మరిన్ని ఆర్థిక వనరులను వెచ్చించక తప్పదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినన్ని కళాశాలలను, విశ్వవిద్యాలయాలను నెలకొల్పక తప్పదు.

భారతదేశ జనాభాలో 74 శాతంపైగా అక్షరాస్యులు ఉన్నప్పటికీ, వారిలో 66 శాతం ఇంటర్మీడియట్ అంతకంటే తక్కువ స్థాయిలోనే విద్యను విరమిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం హైస్కూలు స్థాయిలోనే విద్యను విరమిస్తున్నారు. ఇలా విద్యను వదిలేస్తున్న వారిలో ఎక్కువశాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే కావటం గమనార్హం. వీరు చదువులు వదిలేసి పొట్టకూటికోసం కార్మికులుగా మారుతున్నారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాలు ఈ సమస్య పరిష్కారం కోసం అనేక ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నాయి. భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని అందిపుచ్చుకుంటూ విజ్ఞాన ఆధారిత ఆర్థిక శక్తిగా అత్యున్నత స్థానం పొందాలని పరుగులు పెడుతున్నది. ఈ ప్రయాణంలో విద్యారంగం కీలకం. నైపుణ్యం ఆధారిత ఉపాధి అవకాశాలు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యవల్లనే సాధ్యపడతాయి. మన దేశ విద్యారంగ ప్రణాళికలు ఈ దిశలో రూపుదిద్దుకోవలసి ఉంది.

■ భరత్ వేదాంతం

(నేడు అంతర్జాతీయ విద్యాదినోత్సవం)

హృదయ విదారకం

కానరాని కార్డియాలజీ సేవలు



కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి

- ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నిల్
- కార్డియాలజిస్టులు లేక రోగుల ఇబ్బందులు
- ఒకే ఒక వైద్యురాలు.. వందల సంఖ్యలో రోగులు..
- నియమించాలని ప్రజల వేడుకోలు

వరంగల్ మెడికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో కార్డియాలజీ సేవలు మృగ్యమయ్యాయి. ఎంజీఎంతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా వైద్యుల కొరత వల్ల కార్డియాలజీ సేవలు పేదలకు అందని ద్రాక్షగానే మారాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలకు భారంగా ఉన్న కార్డియాలజీ సేవలు పేదల ఆస్పత్రిలో లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత కాలంలో అనేక మంది గుండె జబ్బులకు లోనవుతున్నారు. అంతేకాకుండా ఏ సర్జరీ చేయాలన్నా కార్డియాలజీ వైద్యుల సలహా రోగులకు అవసరం. ఈ సేవలు ఎంజీఎంలో లేకపోవడంవల్ల ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్డియాలజిస్టు ఒక్కరే..

కార్డియాలజీ విభాగంలో ఒకే ఒక్క వైద్యురాలు విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఇద్దరు కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. కార్డియాలజీ సేవలు బలోపేతం చేయాలంటే రోగుల సంఖ్యకు సరిపడా వైద్యులను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో ముగ్గురు అసిస్టెంటు ప్రొఫెసర్లను నియమిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లేదని ఎంజీఎం అధికారులు చెబుతున్నారు.

అలంకారప్రాయంగా 2డీ ఏకో

గుండె జబ్బుల రోగులకు నిర్వహించే 2డీ ఏకో పరీక్ష జరిపే యంత్రం సూపర్ స్పెషాలిటీలో ఒకటి, ఎంజీఎం ఆస్పత్రిలో మరొకటి ఉన్నాయి. రెండింటికీ కలిపి ఒకే టెక్నీషియన్ ఉండటంతో మూడు రోజులు చొప్పున అక్కడ, ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. మొత్తం కార్డియాలజీ విభాగంలో నలుగురు ఈసీజీ టెక్నీషియన్లు ఉండగా ఒకరు 2డీ ఏకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది రోగులు 2డీ ఏకో పరీక్ష కోసం వస్తూ ఉంటారు. ఇతర విభాగాలలో సర్జరీల కోసం కూడా సర్జరీ ప్రొఫైల్‌లో ఈ పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. రెండు యంత్రాలు ఉన్నా టెక్నీషియన్ లేకపోవడం వల్ల పరీక్షలు నిర్వహించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రోజు 100 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నారని, మరికొందరికి ఫలానా రోజు రమ్మని తేదీలు ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం.



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగం

2డీ ఏకో యంత్రాలు అవసరం

కార్డియాలజీ విభాగంలో 2డీ ఏకో పరీక్షలు నిర్వహించే యంత్రాలు అవసరమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కొక్క యంత్రం ఖరీదు రూ.12 లక్షల 50 వేలు ఉంటుందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్డియాలజీ విభాగంలో మౌలిక వసతులు కల్పించడం లోపాటు వైద్యుల కొరత తీర్చాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.



కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉన్న ఒకే ఒక్క 2డీ ఏకో యంత్రం



కార్డియాలజీ విభాగం వద్ద కోసం బారులు తీరిన ఔట్‌పేషెంట్లు

నెలరోజులుగా తిరుగుతున్నా..

ఉష, హనుమకొండ

నాకు ఇప్పటికే ఓపెన్‌హార్ట్ అయింది. హైదరాబాద్ నిమ్స్‌లో చేయించుకున్నా. ఈ మధ్య కాలంలో గైనిక్ సమస్య ఏర్పడింది. గర్భసంచి తొలగించాలని వైద్యులు సూచించారు. కానీ కార్డియాలజీ అభిప్రాయం తప్పనిసరి అని వైద్యులు సూచించడంతో ఇక్కడికి వస్తే పట్టించుకునే వారే లేరు. నాకు వేసెక్టమీ ఆపరేషన్ చేయాలంటే ఆ సమయంలో కార్డియాలజిస్టు, సర్జన్లు కలిసి చేయాలని చెప్పారు. ఇద్దరు విభాగాలు కలవడం కష్టం, హైదరాబాద్‌కు వెళ్లమని సూచించారు. ఇంత పెద్ద ఆస్పత్రి ఉండి ఏమి లాభం.

2డీ ఏకోకు డిమాండ్

ఎంజీఎంతోపాటు వరంగల్ సీకేఎం, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, హనుమకొండ ప్రభుత్వ టీబీ ఆస్పత్రి రోగుల ఈ పరీక్ష కోసం వస్తుంటారు. తేదీలు ఇచ్చి పంపిస్తుండటంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక అత్యవసర కేసులు అయితే అంతే సంగతులని వాపోతున్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా మరో నలుగు టెక్నీషియన్లను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్ నేతలు పథకాలను అడ్డుకుంటున్నారు..

- ఉద్దేశపూర్వకంగానే వార్డు సభల్లో రగడ సృష్టిస్తున్నారు..
- మీడియా సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హనుమకొండలోని అశోకా కన్వెన్షన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ నెల 26నుంచి మరో నాలుగు పథకాల ఫలాలు ప్రజలకు అందనున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతో పాటు అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందచేస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రజలకు వద్దకు వెళ్లి లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందన్నారు. వార్డు సభలను నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు పథకాలను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను గందరగోళానికి గురి చేస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దమ్ముంటే వరంగల్ నగర అభివృద్ధికి చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

ప్రభుత్వ పథకాల అమలు కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతుందని వెల్లడించారు. ప్రజలు వదంతులు, బీఆర్ఎస్ నేతల మాటలను నమ్మవద్దని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు వర్తిస్తాయన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ఉనికి కోసం బీఆర్ఎస్ నేతలు కుట్రలు పన్ని ప్రజలను రెచ్చగొడుతున్నారని రాజేందర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ శ్రేణులకే పథకాలు అంటూ బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. పేదలకు పథకాల ఫలితాలు అందకుండా ఈ విధమైన కుట్రలకు బీఆర్ఎస్ నేతలు దిగజారడం అనైతికమని విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పంపిణీ చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. త్వరలో మాస్టర్‌ప్లాన్ ప్రదర్శన ఉంటుందని, కలెక్టరేట్, కుడా, కార్పొరేషన్ కార్యాలయాల్లో ప్రదర్శించడంతోపాటు ఇంటర్‌నెట్‌లో పెట్టనున్నట్లు వెల్లడించారు. నామినేటెడ్ పదవుల కల్పన విషయం అధిష్ఠానానిదే అని మీడియా ప్రశ్నలకు రాజేందర్‌రెడ్డి సమాధానంగా చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నియామకాలు జరగాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకుడు ఈవీ శ్రీనివాస్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు అబూబాకర్, తాడిశెట్టి విద్యాసాగర్, పుప్పాల ప్రభాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును 'కాగ్' తప్పు పట్టింది

- ప్రాజెక్టుకు ఏడాదికి రూ.13వేల కోట్లు వడ్డీలు
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

7



మాట్లాడుతున్న కోదండరామ్

నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేయాలి

- అనర్హులు ఉంటే గ్రామసభల్లో తొలగించాలి
- దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

గీసుగొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు సంక్షేమ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రాంపురం, గంగదేవిపల్లి, శాయంపేటలలో గ్రామసభలు నిర్వహించగా గంగదేవిపల్లిలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ సభల్లో అనర్హులను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆమె స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు రానివారు ఆందోళన చెందొద్దన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతరంగా కొనసాగుతుందని చెప్పారు. జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఊకల్ సొసైటీలో తనకు రూ.90వేలు రైతు రుణమాఫీ కాలేదని స్థానిక రైతు కూసం రాజారాం అధికారులకు విన్నవించారు. వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెన్షన్‌లు ఇప్పించాలని మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సురేష్, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సీఐ మహేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

- సంగెం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయాలను కలెక్టర్ సత్యశారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాగుకు యోగ్యం కాని భూమి వివరాలను ఆమె తెలుసుకొని వాటిని రైతు భరోసా నుంచి తొలగించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అక్కడ గ్రామ సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి ఉన్నారు.

బ్యాంకుల భద్రతపై దృష్టి సారించాలి

బ్యాంకు అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సొమ్మును పదిలంగా కాపాడేందుకు బ్యాంకు అధికారులు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా బ్యాంకు అధికారులకు సూచించారు. గురువారం భద్రత చర్యలపై కమిషనరేట్ పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకు అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఇటీవల కమిషనరేట్ పరిధిలో బ్యాంకర్ల తప్పిదాల వల్ల జరిగిన సంఘటనలు వివరించారు. బ్యాంకులతో పాటు ఏటీఎంల భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడంతోపాటు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ప్రధానంగా సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించడంతోపాటు వీలైనంతవరకు బ్యాంకు బయట, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చోరీ జరిగేందుకు వీలున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాల దృశ్యాలను క్లౌడ్ స్టోరేజీ లేదా ప్రత్యామ్నాయ సిస్టంలో భద్రపరచాలని, బ్యాంకు పరిసరాల్లో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలిగించడంతోపాటు వెలుగుకోసం లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. నూతన టెక్నాలజీకి సంబంధించిన అలారంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకు ప్రధాన నిబంధనలను అనుసరించి సాయుధ సిబ్బందితో తగిన భద్రతతో ఏటీఎంలో డబ్బును లోడ్ చేయాలన్నారు.

బ్యాంకుల్లో అనుమానాస్పదంగా వ్యవహరించే వ్యక్తుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, తిరుమల్, దేవేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ టీచర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే డివిజన్లలో వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఊరికొక్క, డివిజన్‌కొక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కోరారు. మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాజీపేట డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌గౌడ్, ఆర్ఐ నవనీత్, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, జైభీం యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి విజయ్, టీచర్స్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, 58, 60డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నం చందర్, జనగాం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- క్యాతంపల్లిలో గ్రామసభ

6



సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రెండో రోజు జేఈఈ మెయిన్స్ ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా ముగిశాయి. వరంగల్, హనుమకొండ జిల్లాల కేంద్రాల్లో 5 పరీక్షాకేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షకు 97.45 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు ఉదయం నిర్వహించిన మొదటి సెషన్‌లో 1,255 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,223 మంది హాజరు కాగా, 32 మంది గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 1,255 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1223 మంది విద్యార్థులు హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారు. రెండవ రోజు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని శుక్రవారంతో పరీక్ష ముగుస్తుందని సిటీ కోఆర్డినేటర్ కె.శ్రీలతరెడ్డి తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- రాజ్‌కుమార్ హత్య కేసులో నిందితుడు వెంకటేశ్వర్లు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి

7

అభివృద్ధి పనులకు వేగంగా పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బల్దియా పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వరంగల్ నగరంలో ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఇంకా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఇంకా వాహనాల మరమ్మతులో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, సౌజన్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు విడుదల చేసి ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ బకాయిలను రూ.1000 కోట్లు విడుదల చేసి ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రుల పెండింగ్ బకాయిలు దాదాపు రూ.1000 కోట్లు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రైవేట్ ఆస్పత్రుల ముందు బోర్డులు పెట్టడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించి ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించాలని ఆ ప్రకటనలో కోరారు.

కిరోసిన్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- హనుమకొండ కలెక్టరేట్‌లో ఘటన



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన రాజేందర్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు కార్తీక్ తమను ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నాడని శివనగర్‌కు చెందిన కొలిపాక రాజేందర్ అనే వ్యక్తి గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే రాజేందర్ చేతిలో ఉన్న కిరోసిన్ డబ్బాను తీసుకుని అతడిని కాపాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన కొడుకు కార్తీక్ రోజు తాగి వచ్చి తనను, తన భార్యను డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని హింసిస్తున్నాడని ఆరోపించారు. మిల్స్‌కాలనీ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయాడు. తన కొడుకుకు బుద్ధిచెప్పి తమను మంచిగా చూసుకునే విధంగా జిల్లా అధికారులు చొరవ చూపాలని ఈ సందర్భంగా రాజేందర్ బోరున విలపించాడు.

అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టంచేశారు. గురువారం మండలంలోని క్యాతంపల్లిలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందొద్దని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారుంటే దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులకు ప్రభుత్వం వడ్డీ కడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మవద్దని కడియం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని, ఏడాది కాలంలోనే 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్లు రుణమాఫీచేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు.

ఈ సందర్భంగా ముప్పారం చెరువు నుంచి నారాయణగిరి వరకు ఉన్న ఫీడర్ చానల్ కాలువను ఎమ్మెల్యే కడియం పరిశీలించారు. ఫీడర్ చానల్ కాలువ పూడికతీసి కాలువను వెడల్పు చేసి కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలం వరకు పనులను పూర్తి చేస్తామన్నారు. ధర్మసాగర్ నుంచి ఎలుకుర్తి మీదుగా డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, మంజూరు కాగానే ముప్పారం, నారాయణగిరి గ్రామాల్లో కాలువలు, డ్రైనేజీ నిర్మాణాలను చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, నారాయణగిరి గ్రామంలో రాజశేఖర్ అనే కార్యకర్త పార్టీలో అందరినీ కలుపుకుపోవాలని, గ్రామంలో రెండు గ్రూపులు ఉన్నాయని, ఈ క్రమంలో నేరుగా అధికారులతో లబ్ధిదారుల ఎంపిక చేయించాలని చెప్పారు. ఈ క్రమంలో నాయకుడు రాంరెడ్డి అడ్డుకొని మైక్ లాక్కోవడంతో సమావేశంలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమనిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, ఎంపీడీవో అనిల్ కుమార్, తహసీల్దార్ సదానందం పాల్గొన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని అడ్డుకోవాలి

చట్టసభలో సీపీఎస్ అభ్యర్థి ఉండాలి

సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ



సమావేశంలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాబోతున్న యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని అడ్డుకోవాలంటే చట్టసభలో సీపీఎస్ యూనియన్ అభ్యర్థి ఉండాలని, ఎమ్మెల్సీ బరిలో ఉంటున్న డాక్టర్ కొలిపాక వెంకటస్వామిని సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు తప్పకుండా గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఉందని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తెలంగాణ గెజిటెడ్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, విశిష్ట అతిథిగా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కొలిపాక వెంకటస్వామి హాజరయ్యారు.

ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. సీపీఎస్ సంఘం ఏర్పడిన కొద్దికాలంలోనే రాష్ట్రంలోని 2.5లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు 16లక్షల గ్రాట్యుటీ సౌకర్యం సాధించుకున్నామని, అదేవిధంగా ఉద్యోగి రిటైర్మెంట్ వరకు భద్రత చేకూర్చే ఫ్యామిలీ పెన్షన్ సౌకర్యం సాధించుకున్నామన్నారు. ఇక కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని పీఎఫ్ఆర్‌డీఏ ద్వారా ఏప్రిల్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాబోతున్న మరో మోసపూరిత పథకం యూనిఫైడ్ స్కీమ్ అని, దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలంటే చట్టసభలో మన అభ్యర్థి ఉండాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కొలిపాక వెంకటస్వామి మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఉపాధ్యాయుడు పెట్టుబడిదారులకు పబ్బం గడిపే సీపీఎస్‌ను పాతర వేయాలంటే తప్పకుండా ఎన్నికల్లో పాల్గొని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలన్నారు. తనను గెలిపిస్తే మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం హనుమకొండ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేశారు. అదేవిధంగా ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళా ఉపాధ్యాయులకు కొలిపాక వెంకటస్వామి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బుచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్, ఆవునూరి రవి, నాగముని, లక్ష్మణమూర్తి, రవీందర్‌రెడ్డి, డి.హరి కుమార్, రాజు, సరళారాణి, ఉమారాణి, ఆనంద్ కుమార్, అక్బర్, రఘుపతి, శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి 25న ఇంటర్వ్యూలు

జనగామ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో క్వాలిటీ మేనేజర్(1) పోస్టు భర్తీకి 25న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కె.మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మాస్టర్ ఇన్‌హాస్పిటల్ మేనేజ్‌మెంట్, మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్స్ డిగ్రీ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అర్హతలతో పాటు కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో 25న కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జఫర్‌గఢ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జఫర్‌గఢ్ తెలంగాణ ఆదర్శ పాఠశాల అనుబంధ బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న అదనపు వంటమనిషి-1, నైట్ వాచ్‌మన్-1 (రెండు పోస్టులు) ఉద్యోగాలు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు కస్తూర్బా వసతి గృహం ఇంచార్జీ, బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ స్వప్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి, నైట్ వాచ్‌మెన్‌కు పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి, అభ్యర్థుల వయసు 25-40 మధ్య ఉండాలన్నారు. వంట మనిషికి నెలకు రూ.6,500, నైట్‌వాచ్ వుమెన్‌కు రూ.8,710 చొప్పున వేతనం అందిస్తారన్నారు. అర్హత గల మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు రెండు పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డు, కుల, నివాస ధృవీకరణ, సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లను దరఖాస్తు పత్రాలతోజతపర్చాలని ఎస్‌వో సూచించారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ క్యాంపస్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మైసూర్ యూనివర్సిటీలో జనవరి 23 నుంచి 28వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ మహిళల క్రికెట్ జట్టును 2024-25 ఏడాదికి గురువారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎం.నవ్య, కెప్టెన్(కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ), జి.మోహనశ్రీ, వైస్ కెప్టెన్(టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల (వుమెన్స్) మహబూబాబాద్), బి.లీషా, (ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), టి. అశ్విత (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం) జె.అనూష (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల (వుమెన్స్) మహబుబాబాద్), వై.రుచిత(డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), ఎస్.దాత్రిశ్రీ,(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), వి.సుజాత (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం), బి.నవ్య (టీజీబ్ల్యూఆర్‌డీ (వుమెన్స్) కళాశాల, మహబూబాబాద్), పి.సరిత (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), ఎస్.జయశ్రీ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ) ఎస్.తుమ్మరేఖ జి.ఐశ్వర్య (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, (వుమెన్స్) కొత్తగూడెం), ఎం.సౌమ్యశ్రీ (ప్రభుత్వ పింగళి డిగ్రీ కళాశాల, వడ్డెపల్లి), పి. శ్రీనిధి (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ), డి.యశస్విని (టీటీబ్ల్యూఆర్‌డీసీ (వుమెన్స్) కొత్తగూడెం), బి.మంజుల (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్)లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఎమ్డీ.అఫ్జల్ వ్యవహరిస్తారని వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య తదితరులు అభినందించారు.



తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభలో మాట్లాడుతున్న బుర్స పోచయ్య

ఆదివాసీల హక్కులను హరిస్తున్న పాలకులు

తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జల్, జమీన్, జంగల్ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఆదివాసీల హక్కులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేయకుండా హరిస్తున్నాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య దుయ్యబట్టారు. గురువారం హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని అశోకకాలనీలో గల గిరిజన భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా తుడుందెబ్బ మహాసభలు జరిగాయి. మొదటగా ఆదివాసీల ఆరాధ్యుడు కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ముఖ్య అతిథిగా హాజరైన బుర్స పోచయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రాజ్యాంగం 5వ షెడ్యూల్ ద్వారా గుర్తించిన భూభాగ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, అమలు చేసేంత వరకు పాలకులపై నిరంతర పోరాటం చేస్తామని హెచ్చరించారు. గిరిజనేతరుల చేతుల్లో ఉన్న గిరిజనుల భూములను 1/59, 1/70చట్టాల ప్రకారం ప్రభుత్వం ఆదివాసీ లకే చెందాలని కోనేరు రంగారావు కమిషన్ సిఫారస్ చేసిందని అన్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఏరియాలో పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీలకు స్వయంప్రతిపత్తిని కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వనరుల దోపిడీని అరికట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఏరియాల్లో 1960 వడ్డీవ్యాపార నిషేధ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. జీవో 317ను షెడ్యూల్డ్ ఏరియాల్లో రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సదస్సులో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్లు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, గుర్రాల రవీందర్, చంద రఘుపతి, సోయం రాజేందర్, ఇప్ప విజయ, సోయం రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహం నుంచి గిరిజన భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

జేఎన్ స్టేడియాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య



బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమింగ్‌పూల్‌ను సందర్శిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న రెజ్లింగ్‌హాల్, కబడ్డీ కోర్టుతో పాటు ఇండోర్ స్టేడియం, బాలసముద్రంలోని స్విమ్మింగ్‌పూల్‌ను జిల్లా క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌తో కలిసి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేడియంలో పలు అభివృద్ధి పనులతో పాటు సిమ్మింగ్‌పూల్ గేటు ముందు వర్షపు నీరు నిలువకుండా కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీవైఎస్‌వోను ఆదేశించారు. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టులోని ఉడ్ కోర్టుకు మరమతులు చేపట్టాలని, నిర్మాణంలో ఉన్న కబడ్డీకోర్టు, రెజ్లింగ్‌హాల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచనల మేరకు స్విమింగ్‌పూల్, జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాన్ని సందర్శించామన్నారు. అదే విధంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో క్రీడా మైదానాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

హనుమకొండ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి, పునరావాస పథకాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి లబ్ధిదారుల ఎంపిక జరుగనుందన్నారు. ఎలాంటి బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేల సబ్సిడీ ఉంటుందన్నారు. దరఖాస్తుకు చివరి గడువు ఫిబ్రవరి 2వ తేదీగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో చోరీకి పాల్పడుతున్న మహిళ అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఒంటరి ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న మహిళను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి నిందితురాలి నుంచి రూ.15 లక్షల 50వేల విలువ చేసే 188 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన కట్రోజు విజయ సులభం డబ్బులు సంపాదించాలనుకుంది. ఆమె భర్త కార్పెంటర్‌గా పనిచేస్తుండగా, వచ్చిన ఆదాయంతో ఇల్లు గడవకపోగా మద్యానికి బానిస కావడంతో చోరీలకు పూనుకుంది. ఈ క్రమంలో బట్టల షాపులతో పాటు ఆటోలు, రైళ్లు, బస్సుల్లో ప్రయాణించే ఒంటరి ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసేందుకు సిద్ధపడింది. నిందితురాలు మొదటగా ఖమ్మం నుంచి వరంగల్‌కు రైలులో వస్తున్న క్రమంలో మహిళ పర్సు చోరీ చేసి పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లింది. తర్వాత ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో 7 చోరీలు, మట్టెవాడ, ములుగు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రెండు చొప్పున, హసన్‌పర్తి, కొత్తగూడెం, ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున మొత్తం 14 చోరీలకు పాల్పడి పలుమార్లు జైలు జీవితం గడిపింది. జైలు నుంచి విడుదలైనప్పటికీ ఆమెలో ఎలాంటి మార్పు రాకుండా కిందటేడు ఫిబ్రవరి, మార్చిమాసాల్లో హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు ఆభరణాలు చోరీ చేయగా, డిసెంబర్ మాసంలో హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగులో రహస్యంగా భద్రపరిచిన బంగారు ఆభరణాలు చోరీ చేసింది. ఇదే రీతిలో నాలుగు రోజుల కిందట బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో నుంచి బంగారు ఆభరణాలు చోరీచేసింది. నాలుగు చోరీలపై ప్రత్యేక దృష్టి పెట్టిన హనుమకొండ పోలీసులు.. నిందితురాలిపై నిఘా పెట్టగా గురువారం ఉదయం టైలర్‌స్ట్రీట్‌లో పట్టుబడింది. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరా లను ఒప్పుకుందని ఏసీపీ తెలిపారు.

యూజీసీ వర్సిటీల నూతన ముసాయిదా బిల్లును తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ, వడ్డె రవీందర్, సారంగపాణి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం, యూజీసీ గ్రాంట్ కమిషన్ తెచ్చిన వర్సిటీల నూతన ముసాయిదా బిల్లును తిప్పికొట్టాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్, రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం కేయూలో రిటైర్డు ప్రొఫెసర్లు, స్కాలర్లు, జాక్ సభ్యుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో వర్సిటీలను గాలికి వేదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్సిటీలకు గ్రాంట్లను ఇవ్వడంలేదన్నారు. రాజకీయ ప్రాబల్యంతో రాజకీయ నేతలకు ప్రైవేట్ వర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా యూజీసీ వర్సిటీలకు గ్రాంట్లు, పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. స్కాలర్లుకు ఫెల్లోషిప్‌లు తగ్గించి కర్ర పెత్తనానికి దిగుతున్నాయని ధ్వజమెత్తారు. కేయూ రిటైర్డు ప్రొఫెసర్ సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మాట్లాడుతూ.. 2020 కేంద్రం నూతన విద్యా విధానంలో భాగంగా యూజీసీ ప్రభుత్వ వర్సిటీల వీసీల నియామకాల నిబంధనలు ఆర్థాంతరంగా మార్చడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల్లో డిగ్రీ, పీజీ ప్రవేశాల్లోనూ అడ్డగోలు సూచనలు చేశారని తప్పుపట్టారు. రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని చెప్పారు.

కేయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎం.సారంగపాణి మాట్లాడుతూ.. విద్య ఉమ్మడి జాబితాలో ఉందని అయితే కేంద్ర రాష్ట్రాలు నిధులు ఇవ్వడం లేదన్నారు. డబ్బుల లేమితో విద్యార్థులకు వర్సిటీలు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాల పరిధిలోని వర్సిటీ వీసీల నియామకంపై గవర్నర్ల పెత్తనం చెలాయించే నూతన యూజీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో లేని రాష్ట్రాల్లో గవర్నర్లు అక్కడి సీఎంలకు సమస్యలను సృష్టిస్తున్నారని చెపారు. అదేక్రమంలో వీసీలపై పెత్తనాన్ని గవర్నర్లకు ఇవ్వడం ఎంతవరకు సమాంజసం అని ప్రశ్నించారు. విద్యారంగంలో నిష్ణాతులైన వారికి వీసీలుగా నియమించే సంప్రదాయానికి తిలోదాలు ఇచ్చేందుకు యూజీసీ నిబంధనలు తెస్తోందని ఆరోపించారు. వర్సిటీల్లో కోర్సులు, ప్రవేశాలే నిబంధనలు మార్చడం వల్ల గందరగోళం ఏర్పడుతోందని అన్నారు. వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టడం లేదన్నారు. తాత్కాలిక అధ్యాపకులతో బోధన నడుస్తోందన్నారు. యూజీసీ నూతన ముసాయిదా బిల్లును రాష్ట్రంతోపాటు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావంతులందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డు ఆర్టీఓ జాన్సన్, కేయూ స్టూడెంట్ జాక్ వ్యవస్థాపకుడు డాక్టర్ మంద వీరాస్వామి, డాక్టర్ వంగాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6250	5600
పల్లికాయ (పచ్చిది)	4600	4100
కందులు	6852	5560
పెసళ్లు	6822	2800
పత్తి	7100	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14300	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్	13500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	15500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఆ దర్శపై సక్తి

- ఆదర్శ పాఠశాలపై తల్లిదండ్రుల చూపు
- ఉత్తమ ఫలితాల సాధనతో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆరు నుంచి ఇంటర్ వరకు విద్య
- ప్రవేశాలకు తుది గడువు ఫిబ్రవరి 28

నెక్కొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాలలకు జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందించడం, ఉత్తమ ఫలితాలను సాధించడమే కాకుండా ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు విద్యాబోధన చేస్తుండడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. వరంగల్ జిల్లాలో 2013లో ఆరు పాఠశాలలు నెక్కొండ, పర్వతగిరి, చెన్నారావుపేట(అమీనాబాద్). సంగెం(గవిచర్ల), ఖానాపురం (బుధరావుపేట), గీసుగొండ (వంచనగిరి) మండలాల్లో ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో రాబోయే విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్ల భర్తీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో యేటా ఈ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలుస్తున్నారు.



నెక్కొండలోని ఆదర్శ పాఠశాల

ఫిబ్రవరి 28 వరకు గడువు

ప్రణయ్ కుమార్, ఆదర్శ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్



ఆదర్శ స్కూల్, కళాశాలల్లో అడ్మిషన్ పొందేందుకు ఫిబ్రవరి 28 వరకు గడువు ఉంది. అడ్మిషన్ కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో వంద సీట్లు ఉండగా, ఏడు నుంచి పదో తరగతి వరకూ ఖాళీలను భర్తీ చేస్తాం. ఇందుకు గాను ప్రవేశ పరీక్షలను ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తాం. ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ.200, ఇతరులు రూ.125 చెల్లించాల్సి ఉంటుంది.

బాలికలకు ప్రత్యేక హాస్టల్

తొమ్మిది. పదో తరగతి, ఇంటర్మీడియేట్ చదువుతున్న బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం ఉంది. రవాణా ఇబ్బందులు కూడా లేవు. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతుండగా, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు విశాలమైన హాస్టల్ గదులు ఉన్నాయి. గదుల్లో విద్యార్థుల సంఖ్య కూడా పరిమితంగానే ఉంది. ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, విద్యార్థులకు వైద్య చికిత్సలకు ఎఎన్ఎం ఉండడంతో ప్రశాంత వాతవరణంలో విద్యనభ్యసిస్తున్నారు.

విశాలమైన క్రీడాస్థలాలు

ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక శాతం ప్రధాన పట్టణాల్లో ఉండడడం, క్రీడా స్థలాలు లేక విద్యార్థులు శారీరక ఎదుగుదలకు అవరోదం ఏర్పడుతుండగా, ఆదర్శపాఠశాలలు మాత్రం ప్రశాంత వాతవరణంలో విశాలమైన క్రీడా స్థలాలు ఏర్పాటు చేశారు.


కొల్లాపురంలో మొసలిని బంధించిన అధికారులు

పొలంలో మొసలి

పట్టుకుని పాకాల సరస్సులో వదిలేసిన అటవీ అధికారులు

గూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నీటిలో ఉండాల్సిన మొసలి పంటపొలాల్లోకి వచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో గురువారం జరిగింది. రైతులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గూడూరు మం డలం కొల్లాపురం గ్రామంలో ఓ పెద్ద మొసలి వాగు అంచు నుంచి బయటకొచ్చి పంట పొలాల్లో ప్రత్యక్షమైంది. పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తున్న రైతులకు కనిపించడంతో గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి సురేష్‌కు సమాచారం అందించారు. దీంతో అధికారులు కొల్లాపురానికి చేరుకొని, మొసలిని తాడుతో బంధించి ప్రత్యేక వాహనంలో గూడూరు రేంజ్ కార్యాలయానికి తరలించారు. 12 అడుగుల పొడవు, 270 కిలోల బరువున్న ఈ మొసలిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలం పాకాల సరస్సులో వదిలారు. రెండేళ్ల వ్యవధిలో ఐదుసార్లు కొల్లాపురం, రాములుతండా, లక్ష్మీపురం, దామెరవంచ గ్రామాల్లోకి ఇదే తరహాల్లో మొసళ్లు వచ్చాయని, వాటిని కూడా పాకాల సరస్సులో వదిలేసినట్టు రేంజ్ అధికారి సురేష్ తెలిపారు. వర్షకాలంలో పాకాల సరస్సు నుంచి వాగుల ద్వారా నీటి ప్రవాహానికి మొసళ్లు బయటకు వస్తుంటాయని వివరించారు. మొసలిని తరలించిన వారిలో సెక్షన్ అధికారి సంతోష్‌కుమార్, బీట్ అధికారి సురేష్, బేస్‌క్యాంప్ సిబ్బంది బోజ్యా, స్వామి, నరేష్, బాలాజీ, ఈడీసీ వాచర్స్ రమేష్, సురేష్ ఉన్నారు.


పాకాల సరస్సులో మొసలిని వదిలిన అటవీ శాఖ అధికారులు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- రాజ్‌కుమార్ హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్ హత్యకు మహిళతో వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌ను హత్య చేసిన నిందితుడు వెంకటేశ్వర్లును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు.

కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన నిందితుడు ఏనుగుల వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన మాచర్ల రాజ్‌కుమార్ ఇద్దరు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరికీ ఓ మహిళతో ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా గతంలో పలుమార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. సదరు మహిళ నిందితుడు వెంకటేశ్వర్లును దూరం పెట్టడం తో పాటు రాజ్‌కుమార్‌తో సన్నిహితంగా ఉండడంతో కోపం పెంచుకు న్నాడు. ఎలాగైనా రాజ్‌కుమార్ హత్యకు వెంకటేశ్వర్లు పథకం వేశాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు ఓ కత్తిని ఆటోలో పెట్టుకొని తిరుగుతుండగా బుధవారం ఉదయం 11.30 గంటలకు అదాలత్ జంక్షన్ వద్ద ఆటోలో రాజ్‌కుమార్‌ను చూశాడు. దీంతో వెంకటేశ్వర్లు తన ఆటోతో రాజ్‌కుమార్ ఆటోను ఢీకొట్టి గొడవకు దిగాడు. ఆపై రాజ్‌కుమార్‌పైకి కత్తి తీసుకొని దాడి చేశాడు. అందరూ చూస్తుండగానే కత్తితో పలుమార్లు దాడి చేశా రు. విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణరెడ్డి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తర లించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

కాగా, రాజ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న వెంకటేశ్వర్లును గురువారం హనుమకొండ బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో 20 మంది యువకులు చూస్తూ ఉండిపోయారని, ఎవరూ కూడా ఆపే ప్రయత్నం చేయకపోవడం బాధగా ఉందని ఏసీపీ తెలిపారు. అన్ని వైపులా పోలీసులు ఉండరని ప్రజలు, యువకులు కళ్లముందు నేరం జరిగినప్పుడు స్పందించాలన్నారు. ఆ సమయంలో కాపాడే ప్రయత్నం చేస్తే రాజ్‌కు మార్ ప్రాణాలు దక్కేవని ఏసీపీ పేర్కొన్నారు. కాగా, ఈ హత్యకు వివా హేతర సంబంధం పెట్టుకున్న మహిళ ప్రమేయం లేదని ఈ సంద ర్భంగా ఏసీపీ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.సత్యనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగేతర భూములకు

రూ.164.79 కోట్ల రైతు బంధు

- అప్పనంగా కట్టబెట్టిన గత బీఆర్ఎస్ సర్కారు
- కోల్డ్ సోరేజీలు, ఫంక్షన్ హాళ్లకు సైతం
- సర్వేలో వెల్లడవుతున్న నమ్మలేని నిజాలు



హనుమకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు బంధు పేరుతో సాగేతర భూములకు సైతం రూ.167.79 కోట్లను అప్పనంగా చెల్లించింది. రైతులకు పెట్టుబడి సాయం కింద వారిని ఆదుకునేందుకు గత ప్రభుత్వం 2018లో రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది తెలిసిందే. పథకం మంచిదే అయినా అమలులో చోటు చేసుకున్న అవకతవల వల్ల ప్రజాధనం దారుణంగా దుర్వినియోగం అయినట్టు వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైంది. రైతు భరోసా పేరుతో ఈ పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రైతు బంధు దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళనను చేపట్టింది. ఇందులో భాగంగా రైతుబంధు వర్తిస్తున్న సాగేతర భూములు ఏ మేరకు ఉన్నాయనేది తేల్చేందుకు సర్వేకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధికారులు గురువారం వరకు జరిపిన సర్వేలో మొత్తం 27,466 ఎకరాలు సాగేతర భూమిగా గుర్తించారు. ఇందులో హనుమకొండ జిల్లాలో 6100 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 2357 ఎకరాలు, జనగామ జిల్లాలో 5996 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 8135 ఎకరాలు, ములుగు జిల్లాలో 2667 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2490 ఎకరాలు సాగేతర భూమిగా నిర్ధారించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ భూములకు 12 సార్లు రైతు బంధు కింద ఏడాదికి రెండు పంటలకు గాను ఎకరానికి రూ. 10వేల చొప్పున చెల్లించారు. అంటే ఈ లెక్కన ఏడాది రూ. 60వేల చొప్పున ఇప్పటి వరకు 12 విడతల 27,466 ఎకరాల సాగేతర భూమికి రూ. 164,79,60,000 చెల్లింపు జరిగింది. సర్వే పూర్తి చేయడానికి ఇంకా రెండు రోజుల సమయం ఉంది. తుది అంచనా ప్రకారం ఈ సాగేతర భూముల మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వం రైతు బంధును కోల్డ్ స్టోరేజీలు, ఫంక్షన్ హాళ్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, బీడు భూములకు కూడా ఇవ్వడంతో ప్రజాధనం పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయినట్టు సర్వేలో వెల్లడైంది.

కాళేశ్వరం ప్రాజెక్టును 'కాగ్' తప్పు పట్టింది

- ప్రాజెక్టుకు ఏడాదికి రూ.13 వేల కోట్ల వడ్డీలు
- ఎమ్మెల్సీ కోదండరామ్

భీమదేవరపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును కాగ్ నివేదిక తప్పు పట్టిందని, డ్యామ్ సెఫ్టీ అధికారులు.. పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించే ఇంజనీర్లు సైతం తప్పుపట్టారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవసరం లేని చోట కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ప్రకాష్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతూ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కోదండరామ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సంవత్సరానికి రూ.13వేల కోట్ల వడ్డీలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రూ.85వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు రూ.1.50వేల కోట్లకు పెరిగిందన్నారు. ఎవరిది తప్పో.. ఎవరిది ఒప్పో.. కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టు చెబుతుందన్నారు. ఇలా అందరూ తప్పు పడితుంటే.. కాళేశ్వరం ప్రాజెక్టు బాగానే ఉందని ప్రకాష్‌రావు లాంటి వారు మాట్లాడి ప్రజల ముందు అపహాస్యం పాలవుతున్నారన్నారు. ఈ నెల 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు ప్రజలకు అమలవుతాయన్నారు. గత ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు అప్పులు చేస్తే వాటికి వడ్డీలు చెల్లించలేక ప్రభుత్వం అవస్థలు పడుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను మంత్రిగా చూడవచ్చానని ఓ విలేఖరి ప్రశ్నించగా.. కాలమే నిర్ణయిస్తుందని సమాధానాన్ని కోదండరామ్ దాట వేశారు.



ధర్మారంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

పని ఒత్తిడిలో ఆర్టీసీ డ్రైవర్లు

- సిబ్బంది కొరతతో రెట్టింపు డ్యూటీలు
- ఏళ్లు గడిచినా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం
- నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

హనుమకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి మెరుగైన ప్రయాణం అందించి వారి గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకం. 70 ఏళ్ల ఆర్టీసీ చరిత్రలో డ్రైవర్లు పనిభారంతో చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా డ్రైవర్ల స్థితిగతులపై కథనం.

డబుల్ డ్యూటీలు

ఆర్టీసీ వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోల పరిధిలో ఆర్టీసీ డ్రైవర్లు అదనపు డ్యూటీలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సరిపడా సిబ్బంది లేక అనారోగ్యంతో ఉన్నప్పటికీ సెలవులు ఇవ్వకుండా డ్రైవర్లను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ రీజినల్ పరిధిలో 1,235 మంది ఆర్టీసీ డ్రైవర్లు పని చేస్తున్నారు. బస్సులకు సరిపడా డ్రైవర్లు లేకపోవడంతో డ్రైవర్లు రెట్టింపు డ్యూటీలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఒత్తిడితో విధులు నిర్వర్తించి నిద్రలేని రాత్రులు గడుపుతూ కుటుంబాలకు, పండుగలకు దూరమవుతున్నట్లు వాపోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జనగామలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి ఆర్టీసీ డ్రైవర్లు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అప్పుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లిస్తూ రావాల్సిన పీఆర్‌సీని అందించి రద్దయిన కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.



బస్సుల వద్ద ఆర్టీసీ డ్రైవర్లు

అదనపు పనిభారం

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత ఇబ్బంది పెడుతోంది. దీంతో 12 గంటలు పనిచేయాల్సిన కార్మికులు.. డబుల్ డ్యూటీలు చేస్తున్నారు. దీంతో పని ఒత్తిడికి గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు. అలాగే ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికులకు ఆర్టీసీ కార్పొరేషన్ చాలీ చాలని జీతాలు ఇస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి బెనిఫిట్స్ అందక జీతాలు సరిపోక డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ జిల్లా సెక్రటరీ యాకస్వామి

ఆర్టీసీలో కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించి వెంటనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలి. 2021 పీఆర్‌సీని అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. రిటైర్డ్ అయిన కార్మిక కుటుంబాలకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

పసిడి ధర పైపైకి..

తులం రూ. 82,580 » వెండి తులం రూ. 940

» రూ. లక్షకు చేరువలో బంగారం

వరంగల్ చౌరస్తా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. వివాహాల సీజన్ ప్రారంభం కాక ముందే బంగారం ధర భగ్గుమంటోంది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం రూ.82,580 ధర కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం (నవరస్) రూ. 76,470 పలికింది. తులం వెండి రూ. 940 ధర పలికింది. రోజు రోజుకూ బంగారం ధరలు పెరగడంతో సామాన్యులకు వివాహాల సమయంలో కొనుగోలుకు అందని ద్రాక్షగా నిలిచేలా ఉంది. పెళ్లి ముహూర్తాల సీజన్ ప్రారంభం కాకముందే బంగారం, వెండి ధరలు పెరగడంతో, వేసవి కాలం పెళ్లిళ్ల సీజన్ వరకు తులం బంగారం రూ.లక్ష వరకు చేరుకుంటుందని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి. రికార్డు స్థాయిలో ఇప్పటికే రూ.80 వేల పైచిలుకు ధర పలకడంతో బంగారం కొనుగోలు, అమ్మకాలు నిర్వ హించేవారు పెదవి విరుస్తున్నారు. దుకాణాల యజమానులు సైతం ఇంత ధర పెరగడంతో పెట్టుబడి పెట్టడం కూడా కష్టమైన పనేనని వాపోతున్నారు. రాబోయే రోజుల్లో బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలుపుతున్నారు.



స్వయం సహాయక సంఘ సభ్యురాలికి అరుదైన గౌరవం

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు ఆహ్వానం


గన్నీ బ్యాగుల తయారీలో కల్పన

శాయంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు దాసరి కల్పనకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో సెర్ప్ తరఫున మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగిన కల్పన వేడుకలలో పాల్గొనడంతో పాటు కేంద్ర మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొననున్నారని గురువారం ఏపీఎం శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. సాధారణ మహిళగా ఉన్న కల్పన స్వయం సహాయక సంఘంలో సీఆర్‌పీగా వివిధ రాష్ట్రాలలో సేవలు అందించడంతోపాటు స్వయం ఉపాధితో పారిశ్రామిక వేత్తగా ఎదిగి తోటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఓ మహిళ పాల్గొనే అవకాశం దక్కిందని ఏపీఎం తెలిపారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన కల్పన దంపతులు గురువారం ఢిల్లీకి బల్దేరి వెళ్లారు.

టేకు వనాలే.. దేవుళ్లుగా

రామలక్ష్మణులుగా ఆరాధిస్తున్న గ్రామస్థులు

టేకు వనాలనే దేవుళ్లుగా భావించి.. ఆ రెండు చెట్లను రామలక్ష్మణు లని పిలుచుకుంటున్నారు కమలాపూర్ గ్రామస్థులు. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామ సమీపంలో వందేళ్లకు పైబడిన రెండు టేకు చెట్లలో ఒక చెట్టుకు రాము.. మరో చెట్టుకు లక్ష్మణ్ అని పేర్లు పెట్టుకున్నారు. మొదటి చెట్టు 65 అడుగుల పొడవు, రెండో చెట్టు 55 అడుగుల పొడవు ఉంది. రెండేసి చెట్లు సుమారు 15 అంగులాల వెడల్పు ఉండటం అందరిని ఎంతగానో ఆకర్షిస్తోంది. కాగా, ఏళ్ల తరబడి ఉంటున్న ఆ టేకు వనాలకు గ్రామస్థులు మేడారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాగా, ఆ వనాలకు పేర్లు పెట్టడం అందరిని ఎంతగానో ఆకర్షిస్తోంది.

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఆంధ్రజ్యోతి



మానవ అక్రమ రవాణా

నిర్మూలనకు కృషి చేయాలి

హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాథోడ్ రమేష్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు అందరు కలిసికట్టుగా పనిచేయాలని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల్లోని ఎన్జీవోలకు మానవ అక్రమ రవాణా నిర్మూలన, వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్డీవో రాథోడ్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఇంకా కొన్ని రంగాలలో మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి కారణమైన అంశాలను ఎన్జీవోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, దానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలకు తెలపాలన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణా నిర్మూలనకు, బాండెడ్ లేబర్ నిర్మూలన కొరకు కృషి చేస్తామని ఎన్జీవోలు ప్రతిజ్ఞ చేశారు. దానికి సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. ఎఫ్ఎంఎం సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో పోలీస్ ఇన్స్‌పెక్టర్ పి.వెంకన్న, హనుమకొండ జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు, హైదరాబాద్ ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ నుంచి అడ్వొకేట్ మేరక మని, మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మండల పరశురాములు, హనుమకొండ జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, ప్రాజెక్టు మేనేజర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం హనుమకొండ విద్యానగర్‌లోని టీడీపీ మినీ కార్యాలయంలో టీడీపీ వరంగల్ పశ్చిమ మాజీ ఇన్‌చార్జి ఎమ్డీ.రహీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నారా లోకేష్ బర్త్ డే కేక్‌ను రహీం కట్‌చేసి టీడీపీ శ్రేణులకు పంపిణీ చేసి సంబరాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు బర్ల యాకూబ్, కాగితాల జయశంకర్, కిన్నెర సుధాకర్, మాడగాని మనోహర్, అనిశెట్టి సతీష్, కొంగర ప్రభాకర్, పోతరాజు అనిల్‌కుమార్, కటకం కుమారస్వామి, వెలగందుల రవీందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేత ఎండీ రహీం

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లో గురువారం హనుమకొండ జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధానకార్యదర్శి పెరుకారి శ్రీధర్, కోశాధికారి పూజారి సత్యనారాయణ, మంద రాఖేష్, మెడిది మధుసూధన్, బండారి సతీష్, భరత్, పల్లం పద్మ, రవి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా షాపులకు టెండర్లు పూర్తి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన షాపులకు గురువారం బల్దియా కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. బల్దియా అదనపు కమిషనర్ జోనా ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు కౌన్సిల్ హాల్‌లో ఈ వేలం పాటలకు టెండర్లు నిర్వహించారు. ఈ దుకాణాలను 12 మంది వ్యాపారులు దక్కించుకున్నట్టు అదనపు కమిషనర్ జోనా వెల్లడించారు. ఈ షాపుల వేలం ద్వారా సుమారు రూ.5లక్షల వరకు బల్దియాకు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఫిబ్రవరి నుంచి షాపులు దక్కించుకున్న వారికి అధికారిక ఉత్తర్వులు అందిస్తారు.

సర్వేల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్

▸▸ బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సర్వేల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నాక మళ్లీ ఇప్పుడు గ్రామ, వార్డు సభలు ఏర్పాటు చేయడం ఎందుకని ప్రశ్నించారు. గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తేటతెల్లమైందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఒక వైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే.. మరోవైపు కార్యకర్తలకు పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకుల పాపం అధికారులకు శాపంగా మారిందని, ప్రజలకు సమాధానం చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారన్నారు. ప్రతిపక్షాల మీద బురద జల్లడం మాని పరిపాలనపై దృష్టి పెట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని ఆమె కోరారు.

బీఆర్ఎస్ హయాంలో అన్ని మతాలకు పెద్దపీట

▸▸ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి ఉర్సు దర్గాకు గిలాఫ్‌ను తీసుకువెళ్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ అన్ని మతాలకు పెద్దపీట వేశారని హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉర్సు కరీమాబాద్ దర్గాకు గిలాఫ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ తరుపున సమర్పించామన్నారు. అందరికీ 469వ ఉర్సు దర్గా ఉత్సవాల సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. పీఠాధిపతి శ్రీ నవీద్‌బాబా, ఉబేద్ బాబా అల్లా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, హైదరాబాద్ మైనారిటీ నాయకులు సోహెల్‌షేక్ అబ్దుల్లా, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ మసూద్ రిజ్వానా, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కాజీపేటలో మాదిగ మహాజనుల వేదిక ఏర్పాటు

కాజీపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏబీసీడీల వర్గీకరణే ధ్యేయంగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమానికి మద్దతుగా కాజీపేటలో గురువారం మాదిగ మహాజనుల వేదిక ఏర్పాటు జరిగింది. వేదికలో గబ్బెట శ్రీనివాస్ మాదిగతో పాటు వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్‌కు ప్రతీ ఇంటినుంచి ప్రతీ మాదిగ డప్పు చేతపట్టి తరలిరావాలని కోరారు. ఏబీసీడీ వర్గీకరణే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా మాదిగలంతా కదిలిరావాలని అన్నారు. వర్గీకరణ జరిగే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జై.. మాదిగ, జైజై మాదిగ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సభలో నాయకులు బొల్లె కుమార స్వామి, ఆరూరి సాంబయ్య, కుమ్మరి కోటి, బరిగెల వినయ్, మాచర్ల ప్రభాకర్, ఇమ్మడి రవి, బస్కె కృష్ణ, మేకల రవి, కట్టస్వామితోపాటు వివిధ సంఘ నాయకులు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగుల తోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో

ప్రజల భాగస్వామ్యం కీలకం



మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

హసన్‌పర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. గురువారం గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎస్పీ ప్లాంట్‌ను ప్రారంభించి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెట్ల పెంపకం లేకపోవడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్న వ్యక్తులు, కంపెనీలు, సంస్థలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రతీ ఒక్కరు సైనికుల్లా పనిచేసి పర్యావరణ సమతుల్యతకు సహకరించేందుకు చెట్లను విరివిగా నాటాలన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు తాను చదువు కున్న పరిస్థితులు, జీవితంలో తాను ఎంచుకున్న లక్ష్యంలో పడిన కష్టాలతో సాధించిన విజయాలను గురించి ఎస్పీ రూపేష్ వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారాంకర్ణ, వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

▸▸ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

▸▸ 5వ డివిజన్‌లో వార్డుసభ కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలు నిరంతరం జరుగుతుందని, అర్హులైన అందరికీ పథకాలు అందుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం 5వ డివిజన్‌లోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ నిర్వహించారు. బల్దియా అధికారులు, సిబ్బంది హాజరైన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై ప్రభుత్వ పథకాల గుర్తించి అక్కడి ప్రజలకు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక లోటుడి ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీ ఒక్కొక్కడిగా పూర్తి చేస్తున్నామని, ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని అన్నారు. ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ఇంకా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను డివిజన్ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు తాడిశెట్టి విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు స్వామిచరణ్, రవీందర్, దేవేందర్, నాయకులు గణేశ్, సతీష్, సరళ, సురేందర్, అనిత్, రాజేశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వంగపహాడ్ గ్రామంలో..

గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్ గ్రామంలో వార్డు సభ జరిగింది. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నాల రఘు హాజరై కార్యక్రమాన్ని ప్రారంబించారు. గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు దరకాస్తులు చేసుకున్నారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ అర్హుడికి సంక్షేమ పథకాలు

హనుమకొండ చౌరస్తా: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన వార్డు సభలో తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లజాబితాలో పేర్లులేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ కార్పొరేటర్ నసీర్‌జీహన్, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్‌యాదవ్, నాయకులు రాకేష్, సతీష్, రమేష్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



10వ డివిజన్ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు

8వ డివిజన్‌లో..

8వ డివిజన్ కుమార్‌పల్లి మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్రజాపాలన వార్డు సభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్థానిక డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన సభకు పేద ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంక్షేమ పథకాలు అందనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి ప్రజాపాలన ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. జీడబ్ల్యూఎంసీ ఏఈ, ఆశా వర్కర్లు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

● కాజీపేట: సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావొద్దు, ఇది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో, 48వ డివిజన్ దర్గాలో గురువారం వార్డు సభలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు వార్డు సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. కొత్తగా దరఖాస్తులు చేసుకునే వారు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, అబూబక్కర్, నాయకులు ఎండీ అంకూస్, షేక్ అమర్, పాలడుగుల ఆంజనేయులు, సింగారపు రవిప్రసాద్, తహసీల్దార్ బావుసింగ్‌తో పాటు స్థానిక నాయకులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిద్ధాపూర్, సూదన్‌పల్లి, మడిపల్లి గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలు ఆయా పంచాయతీ స్పెషలాఫీసర్‌ల అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారి జాబితాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మడిపల్లిలో జరిగిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడి హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల అమలుకు ప్రభుత్వ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకునేవాళ్లు హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తులు తీసుకొని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ వెంకటేశం, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీవో విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, కల్పన, టీఏ సృజన, మాజీ సర్పంచ్‌లు చిర్ర సుమలత విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జనగాం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హనుమకొండ చౌరస్తా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 8వ డివిజన్ గుడిబండల్ నుంచి కుమార్‌పల్లి మార్కెట్, సుధానగర్ వరకు స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... 8వ డివిజన్ పరిధిలోని గుడిబండల్ సర్కిల్ నుంచి వరకు కుమార్‌పల్లి మార్కెట్, సుధానగర్ వరకు సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ అదే విధంగా 4వ డివిజన్ గొల్లపల్లెలో సీసీరోడ్డు, సైడ్ డ్రైన్‌స్మార్ట్ నిధులు రూ.3కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశామన్నారు. డివిజన్‌లో శాశ్వతకాలంగా పేరుపోయిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాగా, 8వ డివిజన్ ఇందిరానగర్ ఎస్సీ హాస్టల్ పక్క వాడలో వారం రోజులుగా డ్రైయినేజీలు నిండి మురుగునీరు రోడ్డుపై కాలువల ప్రవాహిస్తుంటే ఎవ్వరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. అయితే తనకు అత్యవసర పనుల కారణంగా కాలనీని సందర్శించలేకపోతున్నానని చెప్పడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.కార్యక్రమంలో మేయన్ గుండు సుధారాణి, కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



8వ డివిజన్ గుండిబండల్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి

క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం

కాజీపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళీ కృష్ణ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో గురువారం జరిగిన క్రికెట్ పోటీలను కొత్త మురళీ కృష్ణ, మజ్దూర్ యూనియన్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ, సీసీఎస్ అధ్యక్షుడు చిలుకు స్వామి హాజరై పోటీలను ప్రారంభించారు. మెదటగా రామగుండం, రైల్వే ఇనిస్టిట్యూట్ డీజిల్ షెడ్‌ల మధ్య జరిగిన పోటీలలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ జట్టు విజయం సాధించింది. అనంతరం లోకో 11, ఆర్పీఎఫ్ జట్ల మధ్య జరిగిన పోటీలలో ఆర్పీఎఫ్ జట్టు విజయం సాధించింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజేతలకు బహుమతులు పంపిణీ ఉంటుందని ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ కమిటీ జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి గిరిమెట్ల రాజేశ్వర్ రావు, కల్చరల్ విభాగాల ఇంచార్జీ దారావత్ రఘుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సభలకు ప్రజల నుంచి విశేష స్పందన

వరంగల్ కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో నాలుగు రోజులుగా వార్డు సభలు జరుగుతున్న విషయం తెలిసిందే. వార్డుసభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను చేజిక్కించుకునేందుకు దరఖాస్తులతో ఎగబడుతున్నారు. ఉదయమే ఆయా డివిజన్‌ల సెంటర్‌ల వరకు చేరుకుని బారులు తీరుతున్నారు. కాగా, గురువారం బల్దియా పరిధిలో 28 డివిజన్‌లలో వార్డు సభలు జరిగాయని అధికారులు తెలిపారు. ఈ సభలో గురువారం ఒక్క రోజే 10902 రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు రాగా, నాలుగు రోజులకు కలుపుకుని 25,182 దరఖాస్తులు వచ్చినట్టు బల్దియా అధికారులు తెలిపారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల కోసం గురువారం ఒక్క రోజే 4,626 దరఖాస్తులు వచ్చినట్టు బల్దియా అధికారులు ఇక నాలుగు రోజులకు కలుపుకుని 12,771 దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో విడతల వారిగా జరుగుతున్న సభలలో బల్దియా అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు.

నేడు వార్డు సభలు జరిగే డివిజన్లు, ప్రాంతాలు

వార్డు నెంబరు	ప్రాంతం	నియోజకవర్గం
06	శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ లష్కర్‌బజార్	వరంగల్ పశ్చిమ
09	అంబేద్కర్ భవన్ మాల కమ్యూనిటీ హాల్ మైసమ్మ దేవాలయం	వరంగల్ పశ్చిమ
31	నెహ్రూ విగ్రహం శాయంపేట	వరంగల్ పశ్చిమ
50	రెవెన్యూ కాలనీ	వరంగల్ పశ్చిమ
57	అంబేద్కర్ భవన్	వరంగల్ పశ్చిమ
58	టీఎన్‌జీవోఎస్ కాలనీ వాటర్ ట్యాంక్	వరంగల్ పశ్చిమ
46	రాంపూర్ జీపీ కార్యాలయం	వర్ధన్నపేట
65	చింతగట్టు జీపీ కార్యాలయం	వర్ధన్నపేట

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి అండ్ పీజీ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర, ట్రాఫిక్ పోలీస్ , రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. తొలుత సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటంతో పాటు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, పింగిళి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, కాంగ్రెస్ నేతలు ఈవీ శ్రీనివాస్‌రావు, బంక సరళ సంపత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి ఇండస్ట్రీయల్ ఫీడర్ వినియోగదారులకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ అశోక్ తెలిపారు. జాతీయ రహదారి పనుల కారణంగా జరుగుతున్న విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏడీ అశోక్ తెలిపారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన

ఐఎంఏ నూతన కార్యవర్గం



వరంగల్ మెడికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లోని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను తమ కార్యాలయంలో హనుమకొండ జిల్లా ఐఎంఏ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంత్రి సురేఖను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఐఎంఏ సభ్యులు పేద ప్రజలకు ఉపయోగంగా ఉండేవిధంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే తమపూర్తి సహకారం ఉంటుందని మంత్రి సురేఖ హామీనిచ్చారు. ఇందులో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జున రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజిత్‌మహమ్మద్, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ శిరీష్‌కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ మన్మోహన్‌రాజ్, తెలంగాణ హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడు డాక్టర్ ముక్క దిలీప్, ఐఎంఏ ఉపాధ్యక్షులు, తానా వరంగల్ కోశాధికారి, టీజీఎంసీ సభ్యులు డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

నా భూమి ఆక్రమణకు కుట్ర

▸▸ బల్దియా అధికారుల సాయంతో కబ్జాకు యత్నం

▸▸ అనుమతులు పొందినా ఫలితంలేదని విశ్రాంత ఉపాధ్యాయుడి ఆవేదన

▸▸ 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించిన భూ యజమాని





భూమి పత్రాలను చూపిస్తున్న విశ్రాంత టీచర్ రాజశేఖర్, పెద్దమ్మగడ్డలో 30 ఫీట్ల రోడ్డును చూపిస్తున్న స్థానికులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తన పట్టా భూమి ముందు రోడ్డును ఆక్రమించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని, అనుమతులు పొందినా న్యాయం జరగడం లేదని, పలు మార్లు బల్దియా గ్రీవెన్స్, కమిషనర్‌ను కలిసినా అదే పరిస్థితి ఉందని ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కాజీపేట మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతస్థాయి అధికారితో పాటు టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి, ఎల్‌వో కార్యాలయంలో పనిచేసే కొందరు వ్యక్తులు, బీఐ, ఆర్ఐలు అందినకాడికి దండుకుని తన భూమిని పక్క వారికి అప్పగించే కుట్ర చేస్తున్నారంటూ 'ఆంధ్రజ్యోతి' ఎదుట తన గోడు వెల్లబోసుకున్నారు. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలివీ.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఓదెల రాజశేఖర్.. సర్వీస్‌లో ఉండగా 1989లో పెద్దమ్మగడ్డ శివారులోని అక్షరకాలనీలో సర్వే నెంబర్ 562/ఎ, 572/ఎలో దాతి నర్సయ్య అనే వ్యక్తి నుంచి 355 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి పట్టాకాలంలో రాజశేఖర్ ఉంటున్నాడు. ఈ స్థలానికి రెండు చోట్ల 30ఫీట్లతో కూడిన రోడ్డును వదిలి ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే రెండేళ్ల కిందట ఓ వ్యక్తి రాజశేఖర్ భూమికి వెనకాల అనుకుని 183 గజాల స్థలాన్ని 2023లో కొనుగోలు చేశారు. ఈ క్రమంలో రాజశేఖర్ 2023లో బల్దియా అధికారుల అనుమతులతో ఎల్‌ఆర్ఎస్ పన్ను చెల్లించి ఇంటి అనుమతులు తెచ్చుకుని.. వెంటనే ప్రహరీ నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో పక్కనే భూమి కొనుగోలు చేసిన వ్యక్తి అదే యేడు రాత్రికి రాత్రే ప్రహరీ కూల్చివేశాడు. బాధితుడు హనుమకొండ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. కొద్ది రోజులు స్తబ్ధతగా ఉన్న కబ్జాదారుడు.. ఇటీవల తిరిగి భూమి మీదకు వచ్చి నానా హంగామా చేశాడు. రెండోసారి కూడా అతడిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఇద్దరిని పిలిచి మాట్లాడారు. ఇరువర్గాల భూమి పత్రాలు చూసి రాజశేఖర్ పత్రాలు సరైనవేనని నిర్ధారించారు. కబ్జాదారుడు మాత్రం రాజశేఖర్‌కు అక్కడ ఉన్నది 20 ఫీట్ల రోడ్డు అని 30 ఫీట్లు ఉన్నట్టు ప్రభుత్వ అధికారులను తప్పు పట్టిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా బల్దియా నుంచి రాజశేఖర్‌కు ఇచ్చిన ఇంటి అనుమతులను కూడా రాజకీయ పలుకుబడి, డబ్బులు వెదజల్లి రద్దు చేయించినట్టు చెప్పాడు.

కోర్టుకెక్కిన గొడవ

బల్దియా అధికారులు చేసిన అన్యాయంపై రాజశేఖర్ 2024 అక్టోబరు 21 హైకోర్టును ఆశ్రయించాడు. మూడు వారాల్లో రాజశేఖర్ సమస్య పరిష్కరించి కోర్టుకు నివేదిక ఇవ్వాలని బల్దియా అధికారులను హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కానీ ఇప్పటివరకు బల్దియా సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ అధికారులు కోర్టుకు జవాబు ఇవ్వడం లేదని వాపోయారు. అంతేకాకుండా ప్లాన్ మార్చి కబ్జాదారుడు తనను మానసికంగా ఇబ్బందికి గురి చేస్తున్నాడని ఆవేదన వెలిబుచ్చాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బల్దియాలో పనిచేసే కొందరు ఉద్యోగులతోపాటు ఎల్‌వో కార్యాలయంలో పని చేసే వ్యక్తులు డబ్బులు దండుకుని తన భూమిని పక్కవారికి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించాడు. ఇద్దరి పత్రాలు అధికారులు పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని రాజశేఖర్ విజ్ఞప్తి చేస్తున్నాడు. పాలక వర్గంలో ఉన్న ఓ మహిళ చక్రం తిప్పుతూ భారీ మొత్తంలో డబ్బులు దండుకుని తన భూమి విషయంలో వివాదం సృష్టిస్తోందని ఆరోపించాడు. ఇప్పటికైనా బల్దియా కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసులు చొరవ తీసుకుని భూమి పత్రాలను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. కొందరు భూకబ్జాదారులు, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లోచంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు ప్రాణరక్షణ కల్పించాలని విశ్రాంత ఉద్యోగి రాజశేఖర్ తెలిపాడు.

గంజాయితో పట్టుబడ్డ నలుగురు యువకులు

వరంగల్ క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామంలో ఓ వెంచర్‌లో గురువారం గంజాయితో నలుగురు యువకులు పట్టుబడ్డట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. 5 గ్రాముల గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్ సీజ్ చేసి అరెస్టు చేశామన్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

వడ్డెపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : 12వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నాగేందర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ న్యూస్ చానల్ సీఈవో జి.స్వప్న పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కానిస్టేబుల్ నాగేందర్‌తో తనకు ప్రాణహాని ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్న అతడిపై చట్టపరంగా తగిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను కోరారు. డీసీపీ స్థాయి అధికారి లేదా సైబర్ క్రైం అధికారులతో విచారణ జరిపించి మహిళలను దూషిస్తున్న అతడిని శిక్షించాలని కోరారు.

విశేషం



వ్యాసుల తరువాత దాసులే...

మహా భక్తుడుగా, సంకీర్తనా చార్యుడిగా అద్వితీయమైన స్థానాన్ని పొందిన మహనీయుడు శ్రీ పురందరదాసు. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారాంశాన్ని సాధారణ ప్రజలకు అర్థం అయ్యేలా ... సరళమైన కన్నడ భాషలో ఆయన అందించాడు. పురందరదాసు రచన... అద్భుతమైన సంగీతం, సరళమైన సాహిత్యం, ఆధ్యాత్మిక జ్ఞానాల అపూర్వ సంగమం. భౌతికమైన సంపదలకన్నా భక్తి తత్పరత, జ్ఞానం గొప్పవని బోధించిన ఆయన జననం... దైవ సంకల్పం.

భగవంతుడి ఆజ్ఞ మేరకు... నారదుడు తాను రచించిన భక్తి సూత్రాలను ఆచరణలోకి తేవడానికి.... శ్రీనివాసనాయకుడుగా ఈ భూమి మీద అవతరించాడు. ధన సంపాదనే ధ్యేయంగా, లోభిత్వంతో... నవకోటి నారాయణుడిగా కోట్లకు పడగలెత్తిన శ్రీనివాస నాయకుడు.... ఒక చిన్న ఘటనతో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలే అసలైన సిరిసంపదలని సమాజానికి తెలియజేసే పురందరదాసుగా మారాడు. జగన్నాటక సూత్రధారి అయిన శ్రీహరి... స్వయంగా బ్రాహ్మణ రూపంలో వచ్చినా, ఆయనను సామాన్య యాచకుడిగా భావించి, ఆరు నెలలపాటు వాకిలిలో నిలబెట్టాడు శ్రీనివాసనాయకుడు. ఆ తరువాత తన తప్పును తెలుసుకొని, విరక్త శిఖామణిగా మారాడు. శ్రీవ్యాసరాయల నుంచి సకల శాస్త్రార్థ ఉపదేశాలను పొందాడు, భక్తితో పాడి శ్రీకృష్ణునితో నాట్యం చేయించాడు.

ఎవరి భాగ్యం గొప్పది?

కర్ణాటక శాస్త్రీయ సంగీత పితామహుడు అనిపించుకున్న పురందరదాసుకు, విజయనగర సామ్రాజ్యానికి ఎనలేని అనుబంధం. ఆయన కాలంలో శ్రీకృష్ణదేవరాయలు విజయనగర చక్రవర్తిగా పాలన సాగించేవాడు. తన రాజ్యంలో పేరుమోసిన వ్యాపారి ఒకరు... రాత్రికి రాత్రి సర్వస్వాన్ని దానం చేసి, హరిదాసుగా మారాడనీ, ఎన్నో దివ్యమైన తత్త్వాలు ఉపదేశిస్తున్నాడని, మహిమాన్వితుడని రాయలు విన్నాడు. ఆయనను స్వయంగా చూడాలని వ్యాసరాయల మఠానికి వచ్చాడు. వ్యాసరాయలు... పురందర, కనకదాసులతో భజనలో ఉన్నారు. రాయలు దేవాలయ మండపంలో కూర్చున్నాడు. పూజలో, భజనలో లీనమై, భావసమాధిలో మునిగిపోయిన వారు అతని రాకను గమనించలేదు. ఆ తాదాత్మ్యత నుంచి బయటకు వచ్చిన తరువాత... రాయలను కుశల ప్రశ్నలు వేశారు. తన సుకృతం వల్ల యతులను, హరిదాసులను చూసే భాగ్యం కలిగిందని, పురందరదాసు వృత్తాంతం విని వచ్చానని రాయలు తెలిపాడు. తరువాత పురందరదాసును తనతోపాటు ఏకాంతానికి తీసుకువెళ్ళి, ఆయన అనుభవాలన్నీ విన్న రాయలు భక్తితో, ఆనందంతో పరవశుడయ్యాడు. అప్పుడు పురందరదాసు వైరాగ్యాన్ని వినోదంతో మిశ్రమం చేసి... 'నిమ్మ భాగ్య దొడ్డదో, నమ్మ భాగ్య దొడ్డదో' (మీ భాగ్యం గొప్పదా? మా భాగ్యం గొప్పదా?) అంటూ భగవన్నామ సంకీర్తన చేశాడు. "రాజ్య సంపదకు చోరులు, శత్రువుల భయం ఉంటుందేమో కానీ... మా రామ నామ సంపదకు ఎలాంటి భయం లేదు. ధాన్యం, బెల్లం, నెయ్యి లాంటి సరుకులు చెడిపోతాయేమోననే చింత ఉండవచ్చు, 'హరినామామృతం' అనే సరుకు విషయంలో ఏ చింతా ఉండదు. మీ భాగ్యం లక్ష్మీదేవి అయితే... మా భాగ్యం నారాయణుడు. మన అందరి భాగ్యం పురందర విఠలుడు" అని పాడాడు. రాయలు పరమానందం చెంది... పురందరదాసును సత్కరించాడు. రాయలు ఇచ్చిన ఆభరణాలను, వస్త్రాలను, కానుకలను పేదలకు పురందరదాసు దానం ఇచ్చాడు. ఇది తెలుసుకున్న శ్రీకృష్ణదేవరాయలు బాధ పడగా... "కృష్ణరాయా! వాటిని నేను అలంకరించుకుంటే హరికి ప్రీతిపాత్రం కాదు. అందుకే వాటిని ఆ హరికే సమర్పించాను" అని వివరించాడు. దీనితో రాయలుకు పురందరదాసు మీద గౌరవం మరింత పెరిగింది.

అంతటా నెలకొన్న దేవుడొక్కడే...

'మానవ జన్మ దొడ్డదో' అనే కృతిలో మానవజన్మ విశిష్టతను అందరూ తెలుసుకోవాలనీ, దాన్ని వృధా చేసుకోవద్దనీ పురందరదాసు హెచ్చరిస్తారు. ఆయన కీర్తనలలో వైవిధ్యం ఊహాతీతం. భక్తి, విరక్తి, లాలిపాటలు, దేవతా/ క్షేత్ర వర్ణన, వ్యాపారం, సామాజిక బాధ్యత, విమర్శ... ఇలా అన్ని అంశాల గురించీ ఆయన కీర్తనలు ఉంటాయి. ఒకసారి కొంతమంది ముస్లిం యువకులు ఆయనను ఉరుసుకు ఆహ్వానించి దేవునిమీద పాట పాడమని కోరినప్పుడు... అంతటా నెలకొని ఉన్న దేవుడు ఒకడే అంటూ 'క్లాహుస్సేన్ బాహుస్సేన్ ' అనే కీర్తనలో దశావతార స్తుతి చేసి, అక్కడ ఉన్న ముస్లింల మనసును గెలిచారు. పరమత సహనం ఆవశ్యకతను తెలియజేశారు. పురందరదాసు రచించిన కృతుల గొప్పదనం ఎంతటిదంటే 'వ్యాసుల (వ్యాసభగవానులు) తరువాత దాసులే' అని ఆయన ప్రసిద్ధి చెందారు. వ్యాసరాయలవారు... శ్రీమద్వాచార్యుల సర్వమూల గ్రంథాలతోపాటు... పురందరదాసు కృతులను వ్యాసపీఠం మీద ఉంచి... రెండిటికీ సమానమైన గౌరవం ఇచ్చేవారు. ఆయన సాహిత్య ఔన్నత్యానికి ఇది నిదర్శనం.

కర్ణాటక సంగీతానికి పునాది

సాక్షాత్తూ నారదుడే పురందరదాసు అయినందున ఆయన సంగీత స్థాయి అనుపమానంగా ఉంటుంది. ఆ కాలంలో కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందే విద్యార్థులకు వ్యవస్థీకృతమైన పద్ధతి ఉండేది కాదు. పదిహేనవ మేళకర్త రాగమైన మాయామాళవగౌళ రాగాన్ని... ఆదిరాగంగా చేసుకొని, సంగీత శిక్షణ కోసం దాన్ని సిద్ధపరిచారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా... మలహరి రాగంలో పిళ్ళారి గీతాలు రచించారు. ఈ విధంగా కర్ణాటక సంగీతానికి భద్రమైన పునాది వేసి, దాని మీద సుస్థిరమైన కట్టడాన్ని పురందరదాసు నిర్మించారు. ప్రతి సంవత్సరం పుష్యమాస అమావాస్యనాడు వచ్చే వారి పుణ్యతిథిని సద్భక్తులందరూ అత్యంత వైభవంగా జరుపుకొని పునీతులవుతారు. దాసశ్రేష్ఠుడైన పురందరదాసు నామస్మరణతో అభీష్టాలు నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడాలి

భారత దేశం సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజు జనవరి 26. దీని వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల అవిరళ కృషి ఉంది. అటువంటివారిలో మాతాజీ నిర్మలాదేవి ఒకరు. ఆమె కుటుంబం మొత్తం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంది. నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే అప్పటి రాజ్యాంగ రచనా కార్యంలో చురుగ్గా పాలు పంచుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత... పార్లమెంట్ సభ్యునిగా సేవలు అందించారు.

జైల్లో చిత్రహింసలు...

నిర్మలాదేవి బాల్యంలో మహాత్మాగాంధీ ఆశ్రమంలో ఉండేవారు. ఆమెకు నేపాలీల్లా చిన్ని చిన్ని కళ్ళు ఉండడంతో... గాంధీ మహాత్ముడు ఆమెను ముద్దుగా 'నేపాలీ' అని పిలిచేవారు. ఆశ్రమంలో పాడుకొనే ప్రార్థనా గీతాలను 'భజనావళి' పేరిట ఒక పుస్తకంగా ఆయన రూపొందించారు. ఆ సమయంలో... నిర్మల సలహా ప్రకారం... ఆ గీతాలను మన సూక్ష్మ శరీరంలోని చక్రాలు ఏ క్రమంలో ఉంటాయో... అదే క్రమంలో పొందుపరిచారు. చిన్నారి నిర్మలతో ఆయన అనేక విషయాలు చర్చించడం చూసి మిగిలినవారు ఆశ్చర్యపోయేవారు. అప్పుడు గాంధీ మహాత్ముడు "ఒక్కొక్కసారి పెద్దవారి కన్నా చిన్న పిల్లల నుంచే సరైన మార్గదర్శకత్వం లభిస్తుంది అనేవారు. అలాంటి గొప్ప నాయకుల మధ్య పెరిగిన నిర్మల... వారి అడుగుజాడల్లో నడిచారు. ఆమె తండ్రి ప్రసాదరావు ఆ రోజుల్లో నాగపూర్‌లో పేరు ప్రఖ్యాతులున్న మేజిస్ట్రేట్. ఖుర్‌ఆన్‌ను మరాఠీ భాషలో అనువదించిన పండితుడు. పెద్ద బంగళాలలో నివసించే వారి కుటుంబం స్వాతంత్ర్యోద్యమంలో ఆస్తులన్నీ త్యాగం చేయడం వల్ల... పూరిళ్ళలో నివసించాల్సి వచ్చింది. తల్లితండ్రులిద్దరూ జైలుకు వెళితే... ఇంటి బాధ్యతలను నిర్మల స్వీకరించారు. ఆమె లాహోర్ మెడికల్ కాలేజీలో చదువుతున్నప్పుడు... క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా... కాలేజీ మీద భారత జెండాను ఎగురవేశారు. దీనితో కాలేజీ నుంచి ఆమెను బహిష్కరించారు. నాగపూర్‌లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ధర్నా చేసి అరెస్టయ్యారు. జైలులో ఆమెను అక్కడి అధికారులు చిత్రహింసలు పెట్టారు. విద్యుత్ షాక్ ఇచ్చారు, మంచు గడ్డల మీద పడుకోబెట్టారు. అయినా ఆమె ఉద్యమాన్ని విడిచి పెట్టలేదు. గ్రామ గ్రామానికీ తిరిగి రహస్యంగా కరపత్రాలు పంచిపెట్టేవారు. గ్రామీణ ప్రజలను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చైతన్యపరిచేవారు.



ఆధ్యాత్మికతకు అనుకూలం

ఆ తరువాత సహజయోగ ధ్యానపద్ధతిని ప్రవేశపెట్టారు. మానవులలో కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆత్మ సాక్షాత్కారాన్ని ప్రసాదించడానికి అనేక దేశాల్లో పర్యటించారు. ఎక్కడికి వెళ్ళినా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం గురించి చెప్పేవారు. "యోగాకు పుట్టినిల్లు మన భారతావని. ఎందరో మహనీయులు నడయాడిన నేల మనది. ఇక్కడ ఎన్నో భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాలు, వృత్తులు ఉన్నా... ప్రతి ఒక్కరూ తమ జీవిత చరమాంకంలో భగవంతుణ్ణి చేరుకోవాలనే అభిలషిస్తారు. మన దేశ ఆధ్యాత్మికతకు అనుకూలమైనది. అలాగే భారతీయ సంగీతం ఆధ్యాత్మికపరంగా ప్రశస్తమైనది. హిందుస్తానీ సంగీతమైనా, కర్ణాటక సంగీతమైనా... వాటిలోని రాగాలు మన సూక్ష్మశరీరంలో ఉండే వివిధ చక్రాలను లేదా శక్తి కేంద్రాలను చైతన్యతరంగాల ద్వారా శుద్ధి చేస్తాయి. కుండలినీ శక్తిని జాగృతం చేయడానికి భారతీయ సంగీతం కన్నా అనుకూలమైనది మరొకటి లేదు" అని నిర్మలాదేవి చెప్పారు. ఆమె దగ్గర సంగీత కచ్చేరీలు చేయడానికి వచ్చిన చాలామంది... కుండలినీ శక్తి జాగృతి చెందిన అనుభూతి పొంది... సహజయోగంలో స్థిరపడ్డారు.

సహజయోగ

అందరికీ ఆత్మసాక్షాత్కారమే లక్ష్యం

"మనల్ని సృష్టించిన పరమాత్మను ప్రస్తుతించడమే ఏ కళకైనా పరమావధి. మన ఆలయాలు అద్భుతమైన శిల్పకళకు నిలయాలు. మన నృత్యరీతులు... నాట్యం ద్వారా భగవంతుణ్ణి చేరుకోవడానికి రూపొందినవి. మన సాహిత్యంలో భక్తికి, కరుణరసానికి ప్రాధాన్యం ఎక్కువ ఇన్ని రకాలుగా ఆధ్యాత్మికతకు అనువైన ఈ దేశంలో జన్మించడానికి ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి" అని చెప్పేవారు నిర్మలాదేవి. "ఆ రోజుల్లో మేము దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాం. ఇప్పుడు మీరు మీ ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడాలి. మీ ఆత్మను అరిషడ్వర్గాలు, అహంకార, ప్రత్యహంకారాలు ముక్తిని పొందకుండా నిరోధిస్తున్నాయి. వాటి బానిసత్వం నుంచి బయటకు రండి. విశ్వంలో ఉన్న మానవులందరూ తమలోని కుండలినీ శక్తిని జాగృతం చేసుకొని, సహజయోగం ద్వారా అంతిమ స్వాతంత్ర్యం అయిన ఆత్మ సాక్షాత్కారం పొందేలా చేయడమే నా లక్ష్యం. ఈ విషయంలో భారతీయులే మిగిలిన దేశాల ప్రజలను ముందుండి నడిపించాలి. యువత దేశభక్తిని పెంపొందించుకుంటేనే దేశం పురోగతి చెందుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. దేశ విముక్తికోసం తమ సర్వస్వాన్ని నిస్వార్థంగా త్యాగం చేసి, గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో పయనించిన మాతాజీ నిర్మలాదేవిని, ఆమె కుటుంబాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్మరించుకోవడం సముచితం.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



కొత్తగూడెం, సాగర్‌లలో ఏఏఐ బృందం

» విమానాశ్రయాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

కొత్తగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిసరాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సర్వే బృందం గురువారం పరిశీలించింది. కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట, రామవరం ప్రాంతంలోని 950 ఎకరాల స్థలాలను ఆ బృందం పరిశీలించింది. ఈ బృందానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదనను వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రతినిధి బృందంతో జిల్లా యంత్రాంగం, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ పాటిల్ సమావేశమయ్యారు.ఇక, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కుడివైపున ఏపీలోని పల్నాడు జిల్లా రైట్ బ్యాంకు (విజయపురి సౌత్) వద్ద స్థలాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద సభ్యుడు ఏఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. దాదాపుగా 1,600 ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు ఏపీలో పలు ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించినట్లు చెప్పారు. కొత్త విమానాశ్రయం ఏర్పాటైతే తెలంగాణలోని పర్యాటక కేంద్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నివేదికను కేంద్ర బృందం త్వరలో కేంద్రానికి అందచేయనుంది. ఆ తర్వాత మరోసారి కేంద్రం నుంచి సాంకేతిక నిపుణుల బృందం కూడా రానుంది.

మార్చి 6 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు మార్చి 6వ తేదీ నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. మార్చి 15తో ఈ పరీక్షలు ముగియనున్నాయి. మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు టెన్త్ వార్షిక పరీక్షలను నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్..

పరీక్షల ముందు ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తొలగించడానికి అధికారులు ఉచిత కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. వారి కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్న విద్యార్థులు 14416 లేదా 1800914416 టోల్ ఫ్రీ నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

సీయూఈటీ(పీజీ) దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 2

» మార్చి 13 నుంచి 31 వరకు ప్రవేశ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 41 పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు కోడింగ్ సిద్ధం చేసినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీఈయూటీ)ద్వారా జరుగుతాయని తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం అభ్యర్థులు ఫిబ్రవరి 2లోగా సీయూఈటీ(పీజీ)-2025కు దరఖాస్తు చేసుకోవాలని గురువారం సూచించారు. ప్రవేశ పరీక్షలు మార్చి 13 నుంచి 31 వరకు ఉంటాయని తెలిపారు.

తునికాకు సేకరణ రద్దుతో ఆదివాసీలకు నష్టం

» అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నక్సలైట్ల పేరుతో తునికాకు సేకరణను కేంద్రం రద్దు చేయడంతో ఆదివాసీలు, గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బీ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ నిర్ణయం వల్ల ప్రతిఏటా అడవి బిడ్డలకు సుమారు రూ.300 కోట్ల నష్టం జరుగుతోందన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల దావోస్ పర్యటన వల్ల వేలాది కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెబుతున్నారని, అయితే.. ముందు గత ప్రభుత్వాల హయాంలోని దావోస్ పెట్టుబడులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రులు తీసుకొచ్చే పెట్టుబడులతో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.2.5లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

గదుల్లోనూ గోల్‌మాల్ గోవిందా!

తిరుమల కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల బుకింగ్‌లో స్కామ్

» జగన్ జమానాలో భారీ కుంభకోణం

» టీటీడీకి రూ.కోట్లలో నష్టం

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో తిరుమలలో జరిగిన ఓ కుంభకోణం వెలుగుచూసింది. తిరుమలలో వైసీపీ పెద్దలు అడ్డగోలుగా దర్శనాలకు గేట్లెత్తగా... దళారులు, సిబ్బందిలో కొందరు గదుల స్కామ్‌కు తెరలేపారు. తిరుమలలోని డోనర్ కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లను 'దాతల' పేరుతో బుక్ చేసి, వాటిని ఇతర భక్తులకు అద్దెకు ఇచ్చి వచ్చిన సొమ్మును తమ జేబుల్లో వేసుకున్నారు. ఐదేళ్లపాటు సాగిన ఈ దందాతో టీటీడీకి కోట్లలోనే నష్టం వాటిల్లినట్లు అంచనా. తిరుమలలో డోనర్ కాటేజీలు 962... బడా కార్పొరేట్ కంపెనీలు నిర్మించిన పెద్దస్థాయి గెస్ట్‌హౌస్‌లు 62 ఉన్నాయి. వీటి అద్దె రోజుకు వంద నుంచి రూ.ఆరేడువేల దాకా ఉంటుంది. 'డోనర్ స్కీమ్' కింద దాతల నుంచి స్వీకరించిన విరాళాలతో తిరుమలలో నిర్మించిన కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల బుకింగ్, నిర్వహణ టీటీడీ చేతుల్లోనే ఉంటుంది. అయితే, దాతలకు కానీ, వారు సూచించిన వారికి కానీ ప్రస్తుత నిబంధనల ప్రకారం ఏడాదిలో 30 రోజులు ఆయా గృహాల్లో వసతి కల్పిస్తారు. ఇక... గెస్ట్‌హౌస్‌లు నిర్మించిన వారికి ఏటా 3 రోజులు మాత్రమే ఉచితంగా కేటాయిస్తారు. వీఐపీ బ్రేక్ దర్శనం కూడా కల్పిస్తారు. అయితే ఈ వెసులుబాటు 20 ఏళ్లు మాత్రమే దాతలకు ఉంటుంది. అదే... సంస్థల పేరిట విరాళం ఇస్తే పాతికేళ్ల ఈ సౌలభ్యం ఉంటుంది. ఈ కాలపరిమితి దాటిన దాతలు ఇచ్చే సిఫారసు లేఖలు గదుల కేటాయింపులో పని చేయవు. దీనిపై ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ లేదు. దీంతో కొందరు దళారులు, సిబ్బంది... దాతల పేరిట లేఖలు సృష్టించి సొంతంగా గదులు అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇలా ఐదేళ్లలో 200కు పైగా అక్రమ బుకింగ్‌లు చేసినట్టు సమాచారం. నిజానికి.. కంపెనీలు, ప్రైవేటు దాతలు ప్రతీ సంవత్సరం జనవరిలో విధిగా టీటీడీలో తమ డోనేషన్ సర్టిఫికెట్‌ను పరిశీలన చేయించుకోవాలి. ఒకవేళ డోనర్ మరణిస్తే సంబంధిత వ్యక్తులు టీటీడీకి సమాచారం అందించాలి. కానీ... ఇవేవీ సక్రమంగా జరగడం లేదు. కాలపరిమితి దాటిన, మరణించిన డోనర్ల పేరుతో వీళ్లే లేఖలను సృష్టించి, గదులను ఆన్‌లైన్‌లో ఫ్రీగా బుక్ చేస్తున్నట్లుగా ఎంట్రీ చేసి, భక్తుల నుంచి సొమ్ము వసూలు చేశారు. కాటేజీల బుకింగ్‌కు, వాటి ద్వారా వస్తున్న ఆదాయానికి పొంతనలేకపోవడంతో... అసలేం జరుగుతోందని ఆరా తీయడంతో ఈ స్కామ్ బయటపడింది.

కళ్లముందే చంపుతుంటే ఎవరూ రాలే!

» నాకొక్కరు తోడొచ్చినా రాజ్‌కుమార్ ప్రాణాలు దక్కేవి

» హనుమకొండ హత్య ఘటనపై చంద్రమౌళి ఆవేదన



వరంగల్ క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో ఓ ఆటోడ్రైవర్ మరో ఆటోడ్రైవర్‌ను కత్తితో పొడిచి హతమార్చిన ఘటనను స్థానికులు ఇంకా మర్చిపోలేకపోతున్నారు. ఈ ఘటన సమయంలో అక్కడున్న సుమారు 20 మంది చోద్యం చూస్తూ ఉండిపోయారు తప్ప అడ్డుకొనే ప్రయత్నమే చేయలేదు. పైగా ఫోన్లలో వీడియోలు తీసుకున్నారు. కానీ, పండ్లు విక్రయిస్తూ జీవించే పెండ్యాల చంద్రమౌళి మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఆ ఘర్షణను అడ్డుకోబోయిన చంద్రమౌళి గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆ దారుణం గురించి వివరించారు. తనకు ఒకరిద్దరు తోడై ఉంటే రాజ్‌కుమార్ ప్రాణాలు దక్కేవన్నారు. 'బుధవారం మధ్యాహ్నం రెండు ఆటోలు నిలిపి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా ఆపడానికి వెళ్లా. వాళ్లలో మాచర్ల రాజ్‌కుమార్‌ది, మాదీ మడికొండే. దీంతో గొడవ ఏంటని అడిగా. సర్కిల్‌లో రెండు ఆటోలు ఒక దానికొకటి తాకినాయనే విషయంలో గొడవ జరుగుతున్నదని రాజ్‌కుమార్ చెప్పాడు. అదేసమయంలో వెంకటేశ్వర్లు ఒక్కసారిగా ఆటోలోంచి కత్తి తీసి రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. రాజ్‌కుమార్‌ను వెళ్లిపొమ్మని చెప్పా.. కానీ, వాని వల్ల నాకేమైతదంటూ రాజ్‌కుమార్.. వెంకటేశ్వర్లు చేతిలో ఉన్న కత్తిని గుంజుకొనే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లు కత్తితో రాజ్‌కుమార్ పొట్టలో విచక్షణారహితంగా పొడిచాడు. నేను ఆపే ప్రయత్నం చేస్తుండగా నా భార్య కూడా అక్కడికి వచ్చి అట్ల చూస్తున్నరేంది? ఎవరైనా వచ్చి ఆపండని అరిచినా ఎవరూ దగ్గరికి రాలే. రాజ్‌కుమార్ పొట్టలో నాలుగు కత్తిపోట్లు పడడంతో స్పృహ తప్పి పడిపోయాడు. ఆ తర్వాత అందరూ వచ్చారు. నాతో పాటు ఇంకొక్కరైనా తోడై ఉంటే రాజ్‌కుమార్ ప్రాణాలు పోయేవి కాదు. కళ్లముందు అంత దారుణం జరగడం బాధగా ఉంది. ఓ మనిషి ప్రాణం తీస్తుంటే ఎవరూ రాకపోవడం ఇంకా బాధగా ఉంది' అంటూ చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు.

అందరూ మాట్లాడుకొని అఫిడవిట్లు ఇచ్చారా?

» కట్ అండ్ పేస్ట్ చేసినట్టు ఉన్నాయేంటి?

» 'నవయుగ'కు కాళేశ్వరం కమిషన్ ప్రశ్న

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): "కట్ అండ్ పేస్ట్ చేసినట్లు అందరి అఫిడవిట్లు ఒకేలా ఉన్నాయి. అందరూ మాట్లాడుకొని ఒకేలా అఫిడవిట్లు ఇచ్చారా?" అని సుందిళ్ల బ్యారేజీను నిర్మించిన నవయుగ సంస్థ ప్రతినిధులను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించింది. నవయుగ సంస్థ ప్రతినిధులను కమిషన్ గురువారం క్రాస్ ఎగ్జామిన్ చేసింది. సంస్థకు చెందిన ముగ్గురు ప్రతినిధుల అఫిడవిట్లను పరిశీలించిన కమిషన్.. ఈ విధంగా వ్యాఖ్యానించింది. ప్రవాహ వేగాన్ని అంచనా వేయడంలో వైఫల్యం వల్లే బ్యారేజీ దెబ్బతిందని, డిజైన్‌కు తగ్గట్లుగానే తాము నిర్మాణం చేశామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. సీసీ బ్లాకులు ఎన్నిసార్లు కొట్టుకుపోయాయని కమిషన్ ప్రశ్నించగా... 2022 వరదలకు బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, ఆ తర్వాత కూడా పలుమార్లు ఇలాగే జరిగిందని బదులిచ్చారు. బ్యారేజీలో బుంగలు ఏర్పడగా.. గ్రౌటింగ్ చేశామని తెలిపారు. బ్యారేజీ నిర్మాణం 2021 డిసెంబరులోరు పూర్తయిందని, ఆ తర్వాత ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం ఒప్పందమేమీ జరగలేదని తెలిపారు. నిర్మాణం తర్వాత ఫైనల్ పేమెంట్ కోసం బిల్లులు సమర్పించగా.. బ్యారేజీ దెబ్బతినడంతో చెల్లింపులు ఆపేశారని పేర్కొన్నారు. ఇంకా రూ.220 కోట్ల మేర సంస్థకు రావాల్సి ఉందని వివరించారు. బ్యారేజీలో బుంగలు పడ్డ తర్వాత జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్) సిఫారసులతో అన్ని రకాల పరీక్షలు చేసి ఎన్‌డీఎస్‌ఏకు నివేదికలు అందించామన్నారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీని కట్టిన ఎల్‌అండ్‌టీ ప్రతినిధులను శుక్రవారం, అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులను శనివారం కమిషన్ విచారించే అవకాశం ఉంది. ఇదే సంస్థకు చెందిన ఓ ప్రతినిధిని విచారించే క్రమంలో తుది సవరణ అంచనాలు ఎప్పుడు సిద్ధం చేశారని కమిషన్ ప్రశ్నించింది. 2023లో తుది సవరణ అంచనాలను ఆమోదించారని, అదే ఏడాది అనుబంధ ఒప్పందం జరిగిందని ఆయన తెలిపారు. బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారా? అని అడగ్గా 2024లో విడుదల చేశారని బదులిచ్చారు.

ఆర్టీసీలో సమ్మె సైరన్!

సమస్యల పరిష్కారానికి జేఏసీ నిర్ణయం

» ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్

» నేడు, రేపు నల్లబ్యాడ్జీలతో నిరసన

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆర్టీసీ పరిరక్షణ, ఇతర సమస్యల పరిష్కారంపై కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీలో విద్యుత్ బస్సుల్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ శుక్ర, శనివారం కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగుతున్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే ఆర్టీసీ యాజమాన్యానికి సోమవారం సమ్మె నోటీసులను ఇచ్చేందుకు ఆర్టీసీ జేఏసీ సన్నద్ధమవుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోవడంపై కార్మికులు అసంతృప్తిగా ఉన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలపై కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు ఇటీవల కాలంలో ఆర్టీసీలో విద్యుత్ బస్సుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు డిపోలను విద్యుత్ బస్సులు సమకూరుస్తున్న సంస్థలకే అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీ కార్మికుల్ని ఇతర డిపోలకు మారుస్తున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు పనిభారం పెరిగిందని జేఏసీ నేతలు చెబుతున్నారు. పనిభారం, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సమ్మె తప్ప మరో మార్గం కనిపించడం లేదని జేఏసీ నేతలు వెల్లడించారు. ఆర్టీసీ ఎండీకి సోమవారం మధ్యాహ్నం సమ్మె నోటీసులు ఇవ్వనున్న నేతలు సానుకూల నిర్ణయం రాకపోతే మార్చి మొదటి వారం నుంచి సమ్మెలోకి వెళ్లాలని భావిస్తున్నారు. "ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఆర్టీసీ ఉద్యోగుల్ని ప్రభుత్వంలో విలీనం చేయాలి. ఈవీ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచన విరమించుకోవాలి. ప్రభుత్వానికి ఆర్టీసీపై ప్రేమ ఉంటే 5 వేల కోట్లు కేటాయించాలి. ఈవీ బస్సుల్ని స్వాగతిస్తున్నాం.. కానీ ప్రైవేటు సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇవే అంశాలపై సోమవారం సమ్మె నోటీసు ఇస్తున్నాం" అని జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. కాగా, కార్మికుల సమస్యలపై చర్చలు జరుపుతామని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేయబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇదివరకే స్పష్టం చేశారు.

సీఎం, మంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరించండి

» కేకేకు ఎస్‌డబ్ల్యూయూ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కె.కేశవరావుకు టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) విజ్ఞప్తి చేసింది. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తదితరులు గురువారం కేకేను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘంలో కేకే సభ్యులుగా ఉన్నారు. దీంతో ఆయన్ను కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యలు వివరించి పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని కేకే భరోసా ఇచ్చారని రాజిరెడ్డి తెలిపారు.

ఏపీ పిటిషన్‌పై విచారణ 13కు వాయిదా

» కృష్ణా జలాల కేటాయింపు కేసు

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణల మధ్య కృష్ణా జలాల కేటాయింపునకు సంబంధించిన కేసును సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది. ఏపీ, తెలంగాణ మధ్య జలాల పునఃపంపిణీ జరగాలంటూ 2023 అక్టోబరులో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారించింది. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుండగానే ఈ అంశంపై ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ జరపనుందని ఏపీ ధర్మాసనం దృష్టికి తెచ్చింది. అందువల్ల అంతకుముందే తాము దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు ఇవ్వాలని కోరింది. దాంతో ఫిబ్రవరి 13న వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● శుక్రవారం 24 జనవరి 2025

ఇచ్చుకుందాం బేబీ..



విష్వక్‌సేన్ హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మాత. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి 'ఇచ్చుకుందాం బేబీ..' పాటను గురువారం విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యానికి జేమ్స్ స్వరపరిచిన ట్రాక్ అప్ బీట్ మోడ్రన్ స్టయిల్ బ్లెండ్‌తో ఆకట్టుకుంటోంది. ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసిక ఆలపించారు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో అవుట్ అండ్ అవుట్ కామెడీ ఫిల్మ్ ఇదే' అని అన్నారు. చిత్ర దర్శకుడు రామ్‌నారాయణ్ మాట్లాడుతూ 'ఈ కథను ఇద్దరు, ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి వున్నోడే చేయాలి. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ నాకు దొరికారు' అని అన్నారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'సినిమా కోసం విశ్వక్ చాలా కష్టపడ్డారు. ఈ క్యారెక్టర్ తన కెరీర్‌లో నిలిచిపోతుంది' అని అన్నారు.

హైలెస్సో.. హైలెస్సా



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తండేల్' చిత్రం నుంచి మూడో పాటను గురువారం విడుదల చేశారు. శ్రీమణి రాసిన 'హైలెస్సో హైలెస్సా' పాటను దేవిశ్రీప్రసాద్ స్వరపరచగా శ్రేయా ఘోషల్, నకాశ్ అజీజ్ పాడారు. ప్రేమజంట మధ్య ఉన్న అనుబంధాన్నీ, అనురాగాన్నీ అద్భుతంగా ఆవిష్కరించే పాట ఇదని దర్శకుడు చందూ మొండేటి చెప్పారు. ఈ పాటలో నాగచైతన్య మాస్ లుక్‌లో కనిపించి అభిమానుల్ని అలరించనున్నారు. అలాగే సాయిపల్లవి క్లాసికల్ డాన్స్ మూమెంట్స్‌తో మరింత ఆకట్టుకోనున్నారు. అద్భుతమైన ఈ జోడీ తమ అభినయంతో కనువిందు చేయనున్నారు. సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

అన్నీ అద్భుతంగా కుదిరాయి



'ఈ సినిమా చేస్తున్నప్పుడు ఒక పాజిటివ్ ఎనర్జీ ఉండేది. ఇది ఒక మ్యూజికల్ జర్నీలా అనిపించింది. అన్నీ అద్భుతంగా కుదిరాయి. ఇదంతా డివైన్ ఎనర్జీగా భావిస్తున్నా. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో దగ్గుబాటి వెంకటేశ్. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు, శిరీశ్ నిర్మించారు. ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి కుటుంబ చిత్రాన్ని ఇవ్వాలనుకున్నాం. కానీ ప్రేక్షకులు నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు' అని అన్నారు. చిత్రదర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సినిమాకు దూరమైన ప్రేక్షకులు మా చిత్రాన్ని చూసేందుకు థియేటర్లకు రావడం ఆనందంగా ఉంది. వచ్చిన ప్రతీ రూపాయి ప్రేక్షకుడి నవ్వుతో రావడం హ్యాపీగా ఉంది. ఈ విజయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. కుటుంబ కథా చిత్రాలకు ఉండే బలాన్ని ఈ సినిమా మరోసారి నిరూపించింది' అని అన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ "సంక్రాంతికి వస్తున్నాం" ఓ అమ్మలాంటి జ్ఞాపకం. ఈ సినిమాతో ప్రతి గడపకు వెళ్లగలిగాను 'కలిసుందాం రా' పాటలని ప్రేక్షకులు తమ గుండెల్లో పెట్టుకున్నట్టే ఈ చిత్రంలోని పాటలను కూడా అంతలా ఆస్వాదించారు' అని అన్నారు.

ఆస్కార్ నామినేషన్ల జాబితా విడుదల



సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆస్కార్ నామినేషన్ల జాబితా విడుదలైంది. 97వ అకాడమీ అవార్డుల కోసం పోటీపడుతున్న ఫీచర్ ఫిల్మ్ జాబితాను కమిటీ విడుదల చేసింది. వీటిల్లో 'ఎమీలియా పెరెజ్' చిత్రం 13 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక ఆంగ్లేతర చిత్రం ఇన్ని నామినేషన్లు పొందడం ఓ రికార్డ్. 10 నామినేషన్లతో 'విక్డ్' చిత్రం రెండో స్థానంలో ఉంది. మెయిన్‌స్ట్రీమ్ ఫీచర్ ఫిల్మ్ జాబితాలో భారతీయ చిత్రాలేవీ అర్హత సాధించలేదు. సాధారణంగా ప్రతీ ఏడాది జనవరి 8 నుంచి 14 తేదీలలో ఈ నామినేషన్ల ప్రక్రియ జరుగుతుంది. కానీ కాలిఫోర్నియాలో ఏర్పడిన కార్చిచ్చు కారణంగా రెండు సార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు గురువారం ఈ జాబితాను ప్రకటించారు. అయితే ఈ జాబితాను ప్రకటించిన సమయంలోనూ కాలిఫోర్నియాలో మరోసారి కార్చిచ్చు చెలరేగింది.

అనూజ లఘుచిత్రానికి నామినేషన్



ఢిల్లీ నేపథ్యంలో తెరకెక్కిన 'అనూజ' చిత్రం ఈ ఏడాది లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో పోటీలో నిలవడమే భారతీయులకు కొంత ఊరటనిచ్చే విషయం. తొమ్మిదేళ్ల బాలకార్మికురాలి జీవితం ఆధారంగా దర్శకద్వయం ఆడమ్.జే.గ్రేవ్స్, సుచిత్ర మట్టై ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రెండు సార్లు ఆస్కార్ అవార్డు గెలిచిన నిర్మాత గునీత్ మోంగా, నటి ప్రియాంక చోప్రా ఈ లఘు చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరించారు. 'ఏ లైన్', 'ఐ యామ్ నాట్ ఏ రోబోట్', 'ద లాస్ట్ రేంజర్', 'ద మాన్ హు కుడ్ నాట్ రిమైన్ సైలెంట్' లఘు చిత్రాలతో 'అనూజ' పోటీపడుతోంది. ముందు ప్రకటించిన విధంగానే మార్చి 2న ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది.

హ్యాపీగా రిటైరవుతా



నటనకు ఆస్కారమున్న విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పిస్తూ దక్షిణాది చిత్రాలతో పాటు బాలీవుడ్‌లోనూ సత్తా చాటుతున్నారు రష్మిక మందన్న. విక్కీ కౌశల్ సరసన ఆమె నటించిన తాజా చిత్రం 'ఛావా'. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఈ చిత్రంలో రష్మిక శంభాజీ మహారాజ్ భార్య యేసుబాయి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో రష్మిక తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'యేసుబాయి పాత్రలో నటించే అవకాశం తనకు దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు రష్మిక చెప్పారు. ఒక నటిగా నాకు ఇంతకు మించి ఏం కావాలి. ఈ సినిమా తర్వాత నేను సంతోషంగా రిటైర్ అవ్వగలను అని దర్శకుడితో చెప్పాను. ఈ పాత్ర అంత గొప్పగా ఉంటుంది. షూటింగ్ టైంలో ఎన్నిసార్లు భావోద్వేగానికి గురయ్యానో లెక్కలేదు. ట్రైలర్ చూస్తున్నప్పుడు కూడా అంతే ఉద్వేగానికి గురయ్యాను' అన్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో దినేష్ విజయన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.











ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం
కొత్త టారిఫ్ ప్లాన్స్

వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసమే..
ట్రాయ్ చర్యలతో దిగొచ్చిన టెలికాం సంస్థలు

న్యూఢిల్లీ: డేటా అవసరం లేని ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం టెలికాం సంస్థలు కొత్త ప్లాన్స్ ప్రకటించాయి. ఈ ప్లాన్స్‌లో వినియోగదారులకు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ మొట్టికాయలతో టెల్కోలు ఈ ప్లాన్స్ తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా ఎయిర్‌టెల్ రూ.499, రూ.1,959 టారిఫ్‌తో రెండు ప్రీపెయిడ్ ప్లాన్స్ ప్రకటించింది. ఇందులో రూ.499 టారిఫ్ ప్లాన్ 84 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత వాయిస్ కాల్స్, 900 ఎస్ఎంఎస్‌లతో లభిస్తుంది. రూ.1,959 ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత వాయిస్ కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లతో లభిస్తుంది. రిలయన్స్ జియో కూడా దాదాపు ఇదే సదుపాయాలతో రూ.458, రూ.1,958 టారిఫ్‌తో రెండు ప్రీపెయిడ్ ప్లాన్స్ ప్రకటించింది. ఇందులో రూ.458 ప్లాన్ వ్యాలిడిటీ 84 రోజులు. ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులు అపరిమిత వాయిస్ కాల్స్, వెయ్యి ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చు. రూ.1,958 ప్లాన్ వ్యాలిడిటీ 365 రోజులు. ఈ ప్లాన్ ద్వారా చందాదారులు అపరిమిత వాయిస్ కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చు. డేటా అవసరం లేని ప్రీపెయిడ్ చందాదారులకు ఈ ప్లాన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ సైయెంట్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.124 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.179 కోట్లు)తో పోల్చితే లాభం 28.3 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో డీఈటీ (డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ) మొత్తం ఆదాయం కూడా స్వల్పంగా క్షీణించి రూ.1,480 కోట్లుగా నమోదైంది. కాగా డీఈటీ విభాగంలో కొత్తగా 13 డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం
రూ.1,413 కోట్లు
డిసెంబరు త్రైమాసిక ఆదాయం రూ.8,359 కోట్లు.. కలిసొచ్చిన ఎన్ఆర్‌టీ వ్యాపారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,413 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.1,379 కోట్లు) తో పోల్చితే లాభం 2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ రూ.7,215 కోట్ల నుంచి రూ.8,359 కోట్లకు పెరిగింది. ఇటీవల కొనుగోలు చేసిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) వ్యాపారంతో పాటు కొత్త ఔషధాల విడుదల, నిర్వహణపరంగా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవటం ఎంతగానో కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా అఫర్డబిలిటీ, నవకల్పనలపై దృష్టి పెట్టడం ద్వారా రోగుల అవసరాలను తీర్చేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్ఆర్‌టీ వ్యాపారం నుంచి అదనంగా రూ.605 కోట్ల రెవెన్యూ రావటం కలిసివచ్చిందని కంపెనీ తెలిపింది.

అమెరికా వ్యాపారంలో స్వల్ప వృద్ధి

డిసెంబరు త్రైమాసికంలో ఉత్తర అమెరికా వ్యాపారం స్వల్పంగా 1 శాతం వృద్ధితో రూ.3,349 కోట్ల నుంచి రూ.3,383 కోట్లకు పెరిగిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. మరోవైపు యూరప్ వ్యాపారం ఏకంగా 143 శాతం వృద్ధితో రూ.497 కోట్ల నుంచి రూ.1,210 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌లో అమ్మకాలు కూడా రూ.1,180 కోట్ల నుంచి రూ.1,346 కోట్లకు పెరగగా వర్థమాన మార్కెట్లలో విక్రయాలు 12 శాతం పెరుగుదలతో రూ.1,436 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో ఆర్ అండ్ డీ వ్యయాలు రూ.665.80 కోట్లుగా ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. కంపెనీ మొత్తం ఆదాయాల్లో ఇది 8 శాతానికి సమానమని పేర్కొంది.



కీలక వ్యాపారాలపై మరింత దృష్టి

కంపెనీకి చెందిన ప్రస్తుత ఔషధాల పోర్టుఫోలియోను మరింత పటిష్ఠం చేయటంతో పాటు కీలకమైన వ్యాపారాలైన జెనరిక్స్, ఏపీఐలపై మరింత దృష్టి పెట్టనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎంవీ నరసింహం తెలిపారు. అంతేకాకుండా వ్యూహాత్మక విభాగాలైన కన్స్యూమర్ హెల్త్, ఇన్నోవేటివ్ ఉత్పత్తులు (డిజిటల్ థెరాప్యుటిక్స్, ప్రత్యేకమైన మాలిక్యూల్స్), బయోసిమిలర్స్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు తగ్గట్టుగానే ఆర్ అండ్ డీపై పెట్టుబడులు పెంచుకుంటూ వస్తున్నట్లు నరసింహం తెలిపారు.

మారుతి కార్లు మరింత ప్రియం

- రూ.32,500 వరకు పెరుగుదల
- ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: పెరిగిన ముడిసరుకు ధరలు, నిర్వహణ వ్యయాల భారాన్ని పాక్షికంగా తగ్గించుకునేందుకు తమ కార్ల ధరలు రూ.32,500 వరకు పెంచనున్నట్టు దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తెలిపింది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ధరల పెరుగుదల అమల్లోకి వస్తాయని తెలిపింది. కంపెనీ ప్రస్తుతం రూ.3.99 లక్షల నుంచి (ఆల్టో కే-10) నుంచి రూ.28.92 లక్షల (ఇన్విక్టో) శ్రేణిలో కార్లను విక్రయిస్తోంది. కాంపాక్ట్ కారు సెలేరియో ధర గరిష్ఠంగా రూ.32,500 పెరుగుతుంది. ప్రీమియం కారు ఇన్విక్టో ధర రూ.30,000, వ్యాగన్-ఆర్ ధర రూ.15,000, స్విఫ్ట్ ధర రూ.5,000 పెరుగుతాయి. ఎస్‌యూవీల్లో బ్రెజ్జా ధర రూ.20,000, గ్రాండ్ విటారా ధర రూ.25,000 వరకు పెరగనున్నాయి. ఎంట్రీ లెవెల్ కార్లలో ఆల్టో కే10 ధర రూ.19,500, ఎస్-ప్రెసో ధర రూ.5,000 పెరుగుతుంది. ప్రీమియం కాంపాక్ట్ కారు బాలెనో ధర రూ.9,000, ఎస్‌యూవీ ఫ్రాంక్స్ ధర రూ.5,500, కాంపాక్ట్ సెడాన్ డిజైర్ ధర రూ.10 వేలు పెరగనుంది.

ఆర్‌బీఐ నుంచి భారీ డివిడెండ్!

రూ.2 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి కేంద్ర ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో డివిడెండ్ లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని క్వాంట్‌ఎకో రీసెర్చ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అంచనా వేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) కూడా ఆర్‌బీఐ కేంద్ర ప్రభుత్వానికి రూ.2.01 లక్షల కోట్లు డివిడెండ్‌గా చెల్లించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి ఎంత మొత్తం డివిడెండ్‌గా చెల్లించాలనే విషయాన్ని మే నెలలో జరిగే ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సమావేశం నిర్ణయించనుంది.

పెట్టుబడులు, రూపాయి-డాలర్ మారకం రేటులో తేడా, కరెన్సీ నోట్లు ప్రింట్ చేసినందుకు వచ్చే ఫీజు ద్వారా ఆర్‌బీఐకి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుంది. అందులో కొంత మొత్తాన్ని తన అవసరాలకు ఉంచుకుని, మిగతా మొత్తా న్ని కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌గా చెల్లిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు నీరసించి, పన్నుల వసూళ్ల వృద్ధి రేటు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

డాలర్‌తోనే రూపాయికి కష్టాలు

ఆర్‌బీఐ జోక్యం మంచిది కాదు: రాజన్

దావోస్ (స్విట్జర్లాండ్): డాలర్ మారకం రేటు పుంజుకోవడం వల్లే.. మన రూపాయి మారకం రేటు క్షీణిస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు డాలర్ మారకం రేటును మరింత పెంచుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదన్నారు. అలా చేస్తే మన ఎగుమతులూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాలర్-రూపీ మారకం రేటులో మరీ తీవ్రమైన ఆటుపోట్లు ఏర్పడితే తప్ప ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదని రాజన్ స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో సామాన్య ప్రజానీకంపై దృష్టి పెట్టండి



రాజకీయంగా పటిష్ఠ స్థితిలో ఉన్న కేంద్రంలోని ఎన్‌డీఏ 3.0 ప్రభుత్వం రాబోయే కేంద్ర బడ్జెట్లో వృద్ధిని, ఉపాధి కల్పనను ఉత్తేజితం చేయగల, సంక్లిష్టమైన సంస్థాగత సంస్కరణలకు నడుం బిగించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. ఆర్థిక వ్యవస్థను సుస్థిర వృద్ధి బాటలో నడపడమే బడ్జెట్ ప్రాథమిక లక్ష్యం కావాలన్నారు. కేవలం వృద్ధిని పెంచితే చాలదని, సమాజంలో అసమానతలు తగ్గించాలన్నారు. ప్రధానంగా దేశ జనాభాలో దిగువ అర్ధభాగం భారీ వినియోగ శక్తి వృద్ధికి చోదకంగా ఉంటుందని చెప్పారు. వారు మరింతగా సంపాదించినట్టయితే మరింతగా వ్యయం చేస్తారని, ఫలితంగా ఉత్పత్తి పెరిగి మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని సుబ్బారావు చెప్పారు.

జడ్చర్లలో డెయిరీ ప్రాసెసింగ్ ప్లాంట్

రూ.20 కోట్లతో ఏర్పాటు: అక్షయకల్ప ఆర్గానిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్గానిక్ డెయిరీ ఉత్పత్తుల సంస్థ అక్షయకల్ప ఆర్గానిక్.. హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేస్తోంది. ఇందులో భాగంగా జడ్చర్లలో రూ.20 కోట్ల పెట్టుబడితో ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు శశి కుమార్ తెలిపారు. హైదరాబాద్ మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను రోజుకు 40 వేల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌లో మొత్తం 8 రకాలైన ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు ఆయన చెప్పారు. 2019లో తెలంగాణ మార్కెట్లోకి అడుగుపెట్టామని, ప్రస్తుతం 65 మందికి పైగా రైతులతో కలిసి పనిచేస్తుండగా దీన్ని 385 మందికి పెంచుకోవాలని చూస్తున్నట్లు శశి తెలిపారు.

జడ్చర్ల ప్లాంట్ ఈ ఏడాది అక్టోబరు నాటికల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు. జడ్చర్లతో పాటు కంపెనీ ఇప్పటికే కర్ణాటకలోని తిప్టూర్, తమిళనాడులోని చెంగల్పట్టులో రెండు యూనిట్లను నిర్వహిస్తోందని తెలిపారు. పూర్తిగా ఆర్గానిక్ విధానంలో రైతుల నుంచి పాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. కాగా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మార్కెట్లలో ఇప్పటి వరకు ఆవు పాలను మాత్రమే విక్రయిస్తున్న అక్షయకల్ప అక్టోబరు నుంచి గేదె పాలను అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. కంపెనీ ఇప్పటి వరకు రూ.200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టిందన్నారు.

సూరత్‌లో ఎన్‌కోర్-ఆల్కమ్ కొత్త ప్లాంట్

రూ.60 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్: అల్యూమినియం తలుపులు, కిటికీలు తయారు చేసే హైదరాబాద్ సంస్థ ఎన్‌కోర్-ఆల్కమ్ తన కార్యకలాపాలను గుజరాత్‌కు విస్తరించింది. ఇందుకోసం సూరత్‌లో కొత్త ప్లాంటు ఏర్పాటు చేసింది. దేశంలో ఆటో రోబోటిక్ టెక్నాలజీతో అల్యూమినియం తలుపులు, కిటికీలు తయారు చేసే తొలి ప్లాంటు ఇదేనని కంపెనీ తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించాయని ఎన్‌కోర్ ఉడ్‌క్రాఫ్ట్ వ్యవస్థాపకుడు శివ కోటిరెడ్డి తెలిపారు. దశలవారీగా సూరత్ ప్లాంట్ కోసం రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. త్వరలో ఆస్ట్రేలియా, పశ్చిమాసియా దేశాలకూ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరించాలని కంపెనీ భావిస్తోంది. కాగా ఈ నెల 24 నుంచి హైదరాబాద్‌లో జరిగే ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో కంపెనీ ఉత్పత్తులను ప్రదర్శించనుంది.

నష్టాల్లో నుంచి లాభాల్లోకి..

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో స్టాక్ మార్కెట్ రెండో రోజు కూడా లాభపడింది. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, కమోడిటీ స్టాక్‌లలో కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతు ఇచ్చాయి. అయితే గురువారం స్థూలంగా మార్కెట్ ఆటుపోట్లతో ట్రేడయింది. ఆరంభంలో 202 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ తదుపరి దశలో లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 338.55 పాయింట్ల మేరకు లాభపడిన సెన్సెక్స్ చివరికి ఆ లాభాన్ని 115.39 పాయింట్లకు పరిమితం చేసుకుని 76,520.38 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 పాయింట్ల లాభంతో 23,205.35 వద్ద ముగిసింది. కాగా గురువారం నాడు డాలర్ మారకంలో రూపాయి 9పైసలు క్షీణించి 86.44 వద్ద ముగిసింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	112
కర్నూలు	127	నెల్లూరు	117
విశాఖపట్నం	132	అనంతపురం	117
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	490
వరంగల్	462	గోదావరి	485
చిత్తూరు	503	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,100 ▲	75,260 ▲	1,04,000 ▲
విజయవాడ	82,000 ▼	77,000 ▼	93,500 ▼
విశాఖపట్నం	79,810 ▼	73,160 ▼	91,280 ▼
రాజమండ్రి	82,090 ▲	75,250 ▲	94,600 ▲
ప్రొద్దుటూరు	81,150 ▲	75,140 ▲	93,000 ▼
ముంబై	80,039 ▼	73,316 ▼	90,633 ▼

నేడు పురుషుల సెమీస్	జొకోవిచ్ X జ్వెరెవ్ (ఉ.9)	సోనీ లివ్‌లో..
	సిన్నర్ X షెల్టన్ (మ.2)	

అర్జున్‌ను వెనక్కి నెట్టిన గుకేష్



ఫిడే ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: సూపర్ ఫామ్‌లో ఉన్న వరల్డ్ చాంపియన్ గుకేష్.. ఫిడే ర్యాంకింగ్స్‌లో అర్జున్ ఇరిగేసిని వెనక్కు నెట్టాడు. 2784 ర్యాంకింగ్ పాయింట్లతో గుకేష్ నాలుగో ర్యాంక్‌లో నిలవగా.. కొన్ని నెలలుగా భారత టాప్ ప్లేయర్‌గా కొనసాగుతున్న అర్జున్ (2779.5 పాయింట్లు) ఐదో స్థానానికి పడిపోయాడు. ఇటీవలి కాలంలో ఇరిగేసి వరుసగా విఫలమవుతుండడం అతడి ర్యాంక్‌పై ప్రభావం చూపింది. నార్వే దిగ్గజం కార్ల్‌సన్ టాప్‌లో కొనసాగుతుండగా.. హికరు నకమురు, ఫాబియానో కరువానా తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

భారత్ పోరు ముగిసింది

లక్ష్య, సాత్విక్ జోడీ ఓటమి
ఇండోనేసియా మాస్టర్స్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 16-21, 21-12, 21-23తో నిషిమోటో (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం కూడా 20-22, 21-23తో థాయ్‌లాండ్ జంట కెడ్రెన్/పువారన్ చేతిలో పోరాడి ఓడింది. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్/తనీషపై 18-21, 21-15, 21-19తో పాంగ్ రాన్/సు యిన్ (మలేసియా) జోడీ గెలుపొందింది. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీష జంట 21-13, 22-24, 18-21తో కీ గే/మీ జింగ్ (మలేసియా) చేతిలో పరాజయం పాలైంది.



14,505 బంతులతో
ఎంసీఏ గిన్నిస్ రికార్డు

ముంబై: ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) అరుదైన ఘనత సాధించింది. 'క్రికెట్ బంతులతో కూడిన అతిపెద్ద వాక్యం' పేరిట గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. స్థానిక వాంఖడే స్టేడియం 50 ఏళ్ల సంబరాలను ఇటీవల ఎంసీఏ ఘనంగా నిర్వహించింది. దీంట్లో భాగంగానే 14,505 బంతులను ఉపయోగిస్తూ 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం' అని ఇంగ్లీషులో రాయడంతో రికార్డుల కెక్కింది.



సబలెంక

ఆఖర్లో తప్పిదం!

- స్వియటెక్ భారీ మూల్యం
- సెమీస్‌లో పరాజయం
- కీస్ విజయం
- ఫైనల్లో సబలెంకతో అమీతుమీ



కీస్



స్వియటెక్

మెల్‌బోర్న్: పాపం..స్వియటెక్..23 ఏళ్ల ఈ పోలెండ్ భామ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. సెమీఫైనల్ చేరే క్రమంలో ఒక్కటంటే ఒక్క సెట్టు కూడా చేజార్చుకోకుండా ఆడింది. అన్ని మ్యాచ్‌లనూ వరుస సెట్ల విజయాలతో ముగించింది. దాంతో..ఈ రెండో సీడ్ క్రీడాకారిణి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలుచుకోవడం ఖాయమే అనిపించింది. కానీ 19వ సీడ్ అమెరికన్ మాడిసన్ కీస్..స్వియటెక్ కలలను కల్లలు చేసింది. మూడు సెట్ల హోరాహోరీ సెమీఫైనల్లో ఐదు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ స్వియటెక్‌కు షాకిచ్చింది. అయితే మూడో సెట్‌లో..మ్యాచ్ పాయింట్‌పై నిలిచిన స్వియటెక్ బ్యాక్‌హ్యాండ్ షాట్‌ను సరిగా కొట్టలేకపోవడంతో మూల్యం చెల్లించుకుంది. ఇక..డిఫెండింగ్ చాంపియన్ అర్యానా సబలెంక వరుసగా మూడోసారి మెల్‌బోర్న్ పార్క్ విజేతగా నిలిచేందుకు కేవలం ఒక్క మ్యాచ్ దూరంలో నిలిచింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో కీస్ 5-7, 6-1, 7-6 (8) స్వియటెక్‌కు షాకిచ్చింది.. మరో సెమీస్‌లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-4, 6-2తో 11వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్)పై సునాయాసంగా గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో కీస్‌తో సబలెంక తలపడనుంది.

ఉత్కంఠను అదిమిపట్టి..

స్వియటెక్-కీస్ నడుమ సెమీఫైనల్ రెండున్నర గంటలపాటు అభిమానులకు మజా పంచింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌లో 6-5 వద్ద ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరిన వేళ..కీస్ సర్వీస్‌ను నాలుగోసారి బ్రేక్ చేసిన ఇగా సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో జూలు విదిలిచ్చిన కీస్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసి..అలవోకగా సెట్ నెగ్గింది. ఇక నిర్ణాయక మూడో సెట్‌లో స్వియటెక్, కీస్ నువ్వా..నేనా..అనే రీతిలో పోరాడారు. 6-5తో స్వియటెక్ తన సర్వీస్‌తో మ్యాచ్ పాయింట్‌పై నిలిచింది. కానీ వరుస తప్పిదాలతో గేమ్‌ను చేజార్చుకుంది. ఫలితంగా టై బ్రేకర్ అనివార్యమైంది. టైబ్రేకర్‌లో స్కోరు 8-8తో సమమైన వేళ ఒత్తిడిని అదిమిపట్టిన కీస్‌ను విజయం వరించింది. ఇక..బడోసాతో మరో సెమీస్‌లో వరల్డ్ నెం.1 సబలెంకకు ఎదురే లేకపోయింది. కేవలం గంటన్నరలోపే ముగిసిన మ్యాచ్‌లో బడోసా మొదటి సెట్‌లో ఒకింత సబలెంకను ప్రతిఘటించింది. కానీ రెండోసెట్‌లో బడోసా పూర్తిగా తేలిపోయింది.

చెలరేగిన త్రిష

శ్రీలంకపై గెలుపు
అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

కౌలాలంపూర్: అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో భారత అమ్మాయిలు హ్యాట్రిక్ విజయాన్నందుకున్నారు. అలాగే గ్రూప్ 'ఎ'లో టాపర్‌గా ఆరు పాయింట్లతో సూపర్ సిక్స్ బరిలో నిలిచారు. 2,3 స్థానాల్లో నిలిచిన శ్రీలంక, వెస్టిండీస్ జట్లు కూడా తర్వాతి రౌండ్‌కు చేరుకున్నాయి. గురువారం శ్రీలంకతో జరిగిన ఈ ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో ఇద్దరు తెలుగు క్రికెటర్లు రాణించడం విశేషం. బ్యాటింగ్‌లో గొంగడి త్రిష (44 బంతుల్లో 49) అండగా నిలవగా, బౌలింగ్‌లో షబ్నం (2/9) ప్రత్యర్థిని కట్టడి చేసింది. దీంతో భారత్ 60 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 118 పరుగులు చేసింది. లంక బౌలర్ల ధాటికి ఓవైపు వేగంగా వికెట్లు పడుతున్నా త్రిష నిలకడగా రాణించడంతో జట్టు స్కోరు వంద దాటగలిగింది. ప్రముది, లిమన్స అసెనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 58 రన్స్‌కే పరిమితమైంది. వీరి ఇన్నింగ్స్‌లో రష్మిక (15) మాత్రమే రెండంకెల స్కోరు సాధించింది. షబ్నంతోపాటు జోషిత, పరుణికలకు రెండేసి వికెట్లు లభించగా, స్పిన్నర్ వైష్ణవి (4-1-3-1) పొదుపుగా బౌలింగ్ చేసింది.

విండీస్ సైతం: గ్రూప్ 'ఎ' నుంచి మూడో జట్టుగా వెస్టిండీస్ సూపర్ సిక్స్‌లో అడుగుపెట్టింది. గురువారం ఈ జట్టు మలేసియాపై 53 పరుగుల తేడాతో నెగ్గింది.



స్టార్ బ్యాటర్లు మళ్లీ ఢమాల్!

- తుస్సుమన్న రోహిత్, పంత్, గిల్
- జడేజాకు 5 వికెట్లు

● రంజీ ట్రోఫీ



రోహిత్ (3)



గిల్ (4)

ముంబై: ఫామ్ కోసం రంజీ బాట పట్టిన టీమిండియా బ్యాటర్లు రోహిత్ శర్మ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ మళ్లీ విఫలమయ్యారు. వివిధ వేదికల్లో గురువారం మొదలైన మ్యాచ్‌ల్లో వీరు పరుగుల వరద పారిస్తారనుకొంటే.. దేశవాళీ బౌలర్లను కూడా ఎదుర్కోలేక సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. వెటరన్ ఆల్‌రౌండర్ జడేజా ఐదు వికెట్లతో రాణించాడు.

19 బంతులే ఆడి..: ఆస్ట్రేలియా టూర్‌లో అట్టర్ ఫ్లాపైన రోహిత్.. భారీ ఇన్నింగ్స్ ఆడతాడని అందరూ భావించారు. కానీ, ఓపెనర్‌గా 19 బంతులే ఆడిన రోహిత్ (3) ఉమర్ నజీర్ బౌలింగ్‌లో క్యాచవుట్ అయ్యాడు. అతడికి జోడీగా దిగిన యశస్వీ జైస్వాల్ (4) కూడా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరాడు. శ్రేయాస్ అయ్యర్ (11), శివమ్ దూబే (0) కూడా నిరాశ పర్చడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 33.2 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. శార్దూల్ ఠాకూర్ (51) మాత్రమే అర్ధ శతకం సాధించాడు. అనంతరం జమ్మూ కశ్మీర్ మొదటి రోజు ఆట ఆఖరుకు 174/7 స్కోరు చేసింది.

జడేజా బంతితో..: ఢిల్లీతో మ్యాచ్‌లో సౌరాష్ట్ర తరఫున జడేజా ఐదు వికెట్లతో సత్తాచాటాడు. అయితే రిషభ్ పంత్ (1) పది బంతులాడి క్యాచవుటయ్యాడు. దీంతో ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత సౌరాష్ట్ర ఆట ఆఖరుకు 163/5 స్కోరు చేసింది. జడేజా (38) ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు.

మెరవని గిల్..: బెంగళూరులో కర్ణాటకతో మొదలైన మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (4) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. దీంతో పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే కుప్పకూలింది. అనంతరం కర్ణాటక తొలి రోజు ఆట చివరికి 199/4 స్కోరు చేసింది.

రోహిత్‌కు గాయమా?

సుదీర్ఘ విరామం తర్వాత రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్ సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. పెవిలియన్ చేరిన అతడు మళ్లీ ఫీల్డింగ్‌కు రాలేదు. దీంతో రోహిత్ ఫిట్‌నెస్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హిట్‌మ్యాన్ గాయపడితే భారత జట్టుకు గట్టిదెబ్బగానే భావించాలి.

10వ తరగతి కుర్రాడు
గంగూలీ రికార్డు బద్దలుకొట్టాడు..

బెంగాల్ తరఫున రంజీలు ఆడిన పిన్నవయసు క్రికెటర్‌గా సౌరవ్ గంగూలీ రికార్డును 10వ తరగతి విద్యార్థి అంకిత్ చటర్జీ బద్దలుకొట్టాడు. 1989-90 సీజన్‌లో 17 ఏళ్ల వయసులో గంగూలీ రంజీల్లో అరంగేట్రం చేశాడు. కాగా, హరియాణాతో నేటి మ్యాచ్‌లో 15 ఏళ్ల ఛటర్జీ బరిలోకి దిగాడు.

తన్మయ్ అజేయ శతకం

హైదరాబాద్ 291/2

హైదరాబాద్: తన్మయ్ అగర్వాల్ (137 బ్యాటింగ్) సెంచరీతో అదరగొట్టడంతో.. గ్రూప్-బిలో హిమాచల్ ప్రదేశ్‌తో సొంతగడ్డపై జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 291/2 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన్మయ్‌తోపాటు వరుణ్ గౌడ్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అభిరత్ రెడ్డి (73), రాహుల్ (52) హాఫ్ సెంచరీలు చేశారు.

'చాంపియన్స్ ట్రోఫీ'కి భారీ భద్రత

లాహోర్: వచ్చే నెలలో జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. 1996 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఇక్కడ జరుగుతున్న ప్రధాన టోర్నమెంట్ ఇదే కావడం గమనార్హం. అందుకే ఆటగాళ్లు, స్టేడియాల భద్రత కోసం 12,564 మంది సిబ్బందిని మోహరించబోతోంది. ఇందులో లాహోర్‌లో 7618 మంది, రావల్పిండిలో 4535 మంది పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తారని పాక్ మీడియా కథనం. అలాగే స్పెషల్ బ్రాంచికి చెందిన 411 మంది అధికారులు పరిస్థితులను సమన్వయం చేసే పనిలో ఉంటారు. అవసరమైతే పాక్ సైన్యం సహాయం కూడా తీసుకుంటారు.

తిరుపతిలో ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

42 కిలోల కేక్ కట్‌చేసిన సాధు పరిషత్ ప్రతినిధులు

తిరుపతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం అలిపిరిలోని గరుడ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లోకేశ్ 42వ జన్మదినాన్ని పురస్కరించుకుని 42 కిలోల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పవిత్రమైన తిరుపతి క్షేత్రంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని వారు అభిలషించారు. రాష్ట్రంలో నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న నిరుద్యోగ యువతకు ఒక దిక్సూచిలా, అన్నగా వారిని ఆదుకునే శక్తియుక్తులు ఆయనకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథం, సుమన్ నాయుడు, నీలకంఠం, గోకుల్, మధు తదితరులు పాల్గొన్నారు.



అలిపిరి వద్ద కేక్ కట్ చేస్తున్న అట్లూరి నారాయణ తదితరులు, పక్కన శ్రీనివాసానంద సరస్వతి

ఏపీకి కాగ్నిజెంట్ వస్తోంది!

- త్వరలోనే శుభవార్త: మంత్రి లోకేశ్
- ఏపీలోని టైర్-2 నగరాలపై దృష్టి
- కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్




కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తో భేటీ అయిన లోకేశ్

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సిద్ధంగా ఉందని, త్వరలోనే ఆ కంపెనీ నుంచి శుభవార్త వస్తుందని మంత్రి లోకేశ్ ప్రకటించారు. గురువారం దావోస్‌లో ఆయన కాగ్నిజెంట్ సొల్యూషన్స్ సీఈవో ఎస్. రవికుమార్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను వివరించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, రెన్యువబుల్ ఎనర్జీలో డీప్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో 2.2 మిలియన్ చదరపు అడుగుల కో-వర్కింగ్ స్పేస్ అందుబాటులో ఉందని.. కాగ్నిజెంట్ గ్రోత్ స్ట్రాటజీ, ప్రాంతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం వంటి టైర్-2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. తమ ప్రభుత్వంతో భాగస్వామి కావాలని కోరారు. రవికుమార్ స్పందిస్తూ.. కాగ్నిజెంట్‌లో పనిచేస్తున్న 80 వేల మంది ఉద్యోగులను టైర్-1 నగరాల నుంచి టైర్ -2 నగరాలకు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏపీలోని టైర్-2 నగరాలపైనా దృష్టి సారించామని, తప్పకుండా రాష్ట్రానికి వస్తామని హామీ ఇచ్చారు.

వారసత్వం అన్నీ ఇవ్వలేదు!

- అదో అవకాశం మాత్రమే: చంద్రబాబు



అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో సీఎం చంద్రబాబుకు వారసుడు ఎవరు..? దావోస్‌లో మీడియా ప్రతినిధుల నుంచి ఎదురైన ఈ ప్రశ్నకు ఆయన నేర్పుగా సమాధానమిచ్చారు. 'ఇండియా టుడే' ప్రతినిధి ఆయన్ను ఇంటర్వ్యూ చేసిన సందర్భంలో ఈ ప్రశ్న వచ్చింది. లోకేశ్ మీ వారసుడేనా.. వారసుడే అయితే పార్టీ పగ్గాలు ఎప్పుడు అప్పగిస్తారని అడగ్గా.. ఆయన సూటిగా జవాబివ్వకుండా గతంలో చెప్పిన మాటలే పునరుద్ఘాటించారు. 'వారసత్వం అనేది ఒక మిథ్య. వ్యాపారం, సినిమాలు, రాజకీయం, కుటుంబం.. ఏ రంగంలో అయినా వారసత్వం అనేది మిథ్య. ఒక తరం వ్యాపార రంగంలో బాగా రాణించి సంపాదిస్తే తర్వాతి తరం దాన్ని పోగొట్టవచ్చు. మన దేశంలో ఒకప్పుడు బలమైన పార్టీలుగా ఉన్నవి తర్వాత కాలంలో కనుమరుగైపోయాయి. వారసత్వం ఒక్కటే అన్నీ నిలబెట్టలేదు. దానివల్ల కొన్ని మెరుగైన అవకాశాలు వస్తాయి. వాటినెలా అందిపుచ్చుకుంటారన్నది ముఖ్యం. నేనెప్పుడూ జీవనోపాధి కోసం రాజకీయాలపై ఆధారపడలేదు. 33 ఏళ్ల కిందట కుటుంబ వ్యాపారం ప్రారంభించాను. నా కుటుంబ సభ్యులు దానిని నిర్వహిస్తూ వచ్చారు. అదే వ్యాపారంలో కొనసాగితే లోకేశ్‌కు చాలా తేలిగ్గా ఉండేది. కానీ తను ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చారు. అందులో ఆయనకు సంతృప్తి లభిస్తోంది. ఇందులో వారసత్వం అంటూ ఏమీ లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వంలో చేరే ఆలోచన తనకు లేనే లేదని, రాష్ట్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. తన ప్రతిభ, పనితీరుతోనే లోకేశ్ వారసుడిగా ఎదగాలి తప్ప తన కొడుకు అన్న కారణంతో వారసుడు కాలేడన్న అభిప్రాయం బాబు మాటల్లో ధ్వనించిందని టీడీపీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

కేపీహెచ్‌బీ ప్లాట్ల వేలం నేడు

- గృహ నిర్మాణ శాఖ కమిషనర్ ప్రకటన
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అత్యంత అభివృద్ధి చెందిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ(కేపీహెచ్‌బీ) పరిధిలో మిగిలిన ప్లాట్ల(స్థలాలు)ను శుక్రవారం వేలం వేయనున్నామని గృహ నిర్మాణ శాఖ కమిషనర్, బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. గృహ నిర్మాణ పథకాల అమలుకు వీలు కాని చిన్నచిన్న విస్తీర్ణం కలిగిన ప్లాట్లను, గృహాల మధ్య అక్కడక్కడ మిగిలిపోయిన ప్లాట్లనే వేలం వేస్తున్నామని ప్రకటించారు. వేలంలో ఉంచిన ప్లాట్లు అత్యంత విలువైన, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, హైదరాబాద్ చుట్టుపక్కల హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న 700 ఎకరాల భూములు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకున్నామని గౌతమ్ వెల్లడించారు. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలోని 150 డివిజన్లతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10.71లక్షల దరఖాస్తులు వచ్చాయని గృహ నిర్మాణ సంస్థ గురువారం ప్రకటించింది. ఇప్పటిదాకా 7.50 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని గృహ నిర్మాణ సంస్థ పేర్కొంది.

ఇంటి పన్ను కింద వృద్ధుల పింఛన్ జమ చేయడం దుర్మార్గం: హరీశ్



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో వృద్ధాప్య పింఛను డబ్బులను ఇంటి పన్ను కింద జమ చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని గురువారం ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్‌ను ఆపడం అన్యాయమని అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరులో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటి పన్ను ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐటీ ఉద్యోగం అంత ఈజీ కాదు.. రేవంత్!

- అక్కడ రాణించాలంటే విద్య, ప్రతిభ ఉండాలి
- సీఎం వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'ఆధునిక సాంకేతిక ప్రపంచానికి ఐటీ నిపుణులే వెన్నెముక.. ఐటీ ఉద్యోగం అంత ఈజీ కాదని తెలుసుకో..' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ ఐటీ ఎంప్లాయ్ కాబట్టి అదే మైండ్‌సెట్‌తో ఆలోచిస్తారు. నేను పొలిటీషియన్‌ని, పాలసీ మేకర్‌ను.. నాకు అన్నీ.. తెలవాల్సిన అవసరం లేదం'టూ దావో‌స్‌లో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. 'నన్ను ఐటీ ఉద్యోగి అంటూ.. తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నం చేసిన వాళ్లకు ఒకటే చెప్పదలుచుకున్నా.. ఐటీ రంగంలో రాణించాలంటే విద్య, ప్రతిభ, అంకిత భావం చాలా అవసరం. సంచుల కొద్దీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇలాంటివేమీ అవసరం లేదు' అని ఎద్దేవా చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు. ఐటీ రంగంలో ఉన్న నా అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్ల ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం' అని పేర్కొన్నారు.

డిసెంబరులో తగ్గిన పన్నుల రాబడి

- రాష్ట్ర ఆదాయ, వ్యయాలపై 'కాగ్' నివేదిక

రాష్ట్ర ప్రభుత్వ పన్నుల రాబడి దారుణంగా తగ్గిపోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా తరుగుదల నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జీఎస్టీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు, సుంకాల ద్వారా డిసెంబరులో రూ.8,494.47 కోట్లు సమకూరాయి. నవంబరులో రూ.11,418.14 కోట్లు వచ్చాయి. అంటే 25.60 శాతం రాబడి తగ్గిపోయింది. ఈ మేరకు 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' గురువారం రాష్ట్ర ఆదాయ, వ్యయాల నివేదికను విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి 4 కొత్త పథకాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి దశలో డిసెంబరు నెల రాబడి 25% తగ్గిపోవడం చర్చనీయంగా మారింది.

అందరి లెక్కా తేలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)



సంగారెడ్డి జిల్లా కర్దనూరులో రైతుబంధు అందుతున్న ఓ ఫంక్షన్ హాల్

నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపుతున్నారు. ఇదంతా ఈ నెల 17వ తేదీ వరకూ తేలిన లెక్క. ఆ తర్వాత గ్రామసభలు ప్రారంభం కావడంతో భూముల సర్వేకు కొంత బ్రేక్ పడింది. శుక్రవారంతో గ్రామసభలు ముగియనుండటంతో.. మిగిలిన గ్రామాల్లో కూడా సాగుకు యోగ్యం కాని భూముల లెక్క తియ్యనున్నారు. ఇప్పటిదాకా అందిన లెక్కల ప్రకారం.. ఒక్క ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే సాగుకు యోగ్యం కాని దాదాపు 76 వేల ఎకరాల భూమికి రైతు బంధు అందినట్టు అధికారుల విచారణలో తేలింది. ఇందులో ఎక్కువ భూములు హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 54,200 ఎకరాలు., మేడ్చల్ జిల్లాలో 14300 ఎకరాలు.. వికారాబాద్‌లో 7500 ఎకరాల మేర భూములు సాగుకు యోగ్యం కానివని తేల్చారు. మేడ్చల్ జిల్లాలో మొత్తం భూముల్లో 18.33 శాతం భూములను అర్హత లేని భూములుగా గుర్తించడం గమనార్హం. ఒక్క ఘట్‌కేసర్ మండలంలో 4222 ఎకరాలను ఇలా గుర్తించారు. అలాగే.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లో 173 గ్రామ పంచాయతీల్లో.. 1349.19 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములు ఉన్నట్లు తేలింది. జనవరి 26న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్న సర్కారు.. ఆలోగా అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఈ వ్యవసాయేతర భూములన్నింటినీ జాబితా నుంచి తొలగిస్తున్నారు.

వాటికి ఇవ్వలేం

అర్హత లేని భూములకు కూడా రైతుబంధు పొందుతున్న వారు.. ఇప్పుడు విచారణకు వస్తున్న రెవెన్యూ అధికారులను ఆ పథకం నుంచి తమ భూములను తొలగించ వద్దని, రైతు భరోసా కూడా అందేలా చూడాలని ప్రాధేయపడుతున్నారు. రూ.కోట్ల విలువ జేసే భూముల్లో ఒకవక్క వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తూనే.. రైతు భరోసా ద్వారా ప్రభుత్వం అందించనున్న రూ.12 వేల కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే.. అధికారులు మాత్రం వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను రైతు భరోసా జాబితాలో పెట్టేందుకు ససేమిరా అంటున్నారు.

జిల్లా	వ్యవసాయేతర భూమి (ఎకరాల్లో)
రంగారెడ్డి	54,200
మేడ్చల్	14,300
వికారాబాద్	7,500
కరీంనగర్	5,600
పెద్దపల్లి	2,677
జగిత్యాల	5,088
ఖమ్మం	6,359
రాజన్న సిరిసిల్ల	3,200
ఆసిఫాబాద్	1,800
నిజామాబాద్	7,520
సంగారెడ్డి	15,313
సిద్దిపేట	13,210
మెదక్	4,650
కామారెడ్డి	7,525
మంచిర్యాల	102
ఉమ్మడి నల్లగొండ	20,277
కొత్తగూడెం	2,800
నిర్మల్	4,915
ఆదిలాబాద్	1,034

వెంచర్లు.. కోళ్లఫారాలు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో.. ముఖ్యంగా నగర శివార్లలో గత కొన్నేళ్లుగా కాలనీల్లోని భూములు, వెంచర్లు, కోళ్లఫారాలు, క్రికెట్ గ్రౌండ్లు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు ఉన్న భూములకు సైతం రైతుబంధు కింద రూ.కోట్లు చెల్లిస్తున్నారు. అప్పట్లో భూములు కొనుగోలు చేసి వెంచర్లు వేసిన వారు మ్యుటేషన్ చేయించుకోకపోవడంతో పలు చోట్ల పాత రైతుల పేర్లే రికార్డుల్లో కొనసాగుతున్నాయి. ఆయా భూముల్లో కాలనీలు ఏర్పాటై పెద్దఎత్తున భవన నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ధరణి వచ్చిన తరువాత మ్యుటేషన్ లేని భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. ఇలాంటి వారందరి ఖాతాల్లో రైతుబంధు డబ్బు జమవుతోంది. ఇక బీడు భూముల సంగతి సరేసరి. ఇలాంటి వాటిని గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలికితీసి ప్రత్యేక కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగురోడ్డు, జాతీయ రహదారులకు కొన్నేళ్ల కిందట సేకరించిన భూములకు సైతం రైతుబంధు ఇస్తున్న విషయం వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వం వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించింది.

కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు

- కోటి కుటుంబాలకు సన్న బియ్యం
- బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్/ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 40 లక్షల రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. మొత్తం కోటి కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా ఒక్క కార్డు మంజూరు చేయలేదని, ఇప్పుడు పనిగట్టుకుని ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. గురువారం రంగారెడ్డి జిల్లాలో ఆదిభట్ల- మంగల్‌పల్లి మధ్య రూ.25 కోట్లతో నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారికి మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. కోహెడ రెవెన్యూలో 200 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. విజయవాడ ప్రధాన రహదారి పెద్ద అంబర్‌పేట్ నుంచి కోహెడ మీదుగా నాగార్జునసాగర్ ప్రధాన రహదారికి కలిపే లింకు రోడ్డును రూ.96 కోట్లతో డబుల్ రోడ్డుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ముున్ముందు ఆదిభట్ల ప్రాంతం మరో కోకాపేట్, ఫైనాన్షియల్ జిల్లాగా మారనుందని చెప్పారు. డిండి ప్రాజెక్టుతో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని, ఈ పథకానికి రూ.6,190 కోట్లను కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు.



కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న తుమ్మల, చిత్రంలో ఉత్తమ్

బీఆర్ఎస్ దీక్ష ఎందుకు?

- రుణమాఫీ సహా ఏ హామీనీ అమలు చేయలేక ఇప్పుడు దీక్షలా?: తుమ్మల
- అర్హులందరికీ రేషన్ కార్డులిస్తాం: ఉత్తమ్

కోదాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.7,625 కోట్ల రుణమాఫీ సొమ్మును ఒకే ఒక్క రాత్రి రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎందుకు దీక్ష చేపడుతుందో చెప్పాలని నిలదీశారు. గురువారం సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. 2023 ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తున్నట్లు భ్రమ కల్పించేందుకు రింగు రోడ్డును అమ్మి, తాకట్టు పెట్టి కొద్దిమందికి రుణమాఫీ చేశారని ఆరోపించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 25 లక్షల మందికి రుణమాఫీ చేసినందుకు బీఆర్ఎస్ దీక్ష చేపడుతోందా? అని ప్రశ్నించారు. చిల్లర మల్లర రాజకీయాలు చేసే పార్టీలు వచ్చి లేనిపోని మాటలు చెబితే నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే గ్రామసభలు పెడుతున్నామన్నారు. గోదావరి జలాలు పాలేరు ద్వారా కోదాడకు తేవడమేగాక ఖమ్మం జిల్లా పచ్చగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు. హామీలను అమలు చేయలేకపోతే ప్రజలను క్షమాపణ కోరతామే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి తలదించుకునే పరిస్థితి ఉండదని అన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు: ఉత్తమ్

అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డులు ఇస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూం పేరుతో కాలయాపన చేసి ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

డిండి హెడ్‌వర్క్స్‌గా ఏదుల

ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం ఏదుల రిజర్వాయర్‌ను హెడ్‌వర్క్స్‌గా ఖరారు చేస్తూ జీవో నంబరు 10 జారీ చేశారు. ఏదుల నుంచి 2.5 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్‌తో పాటు 16 కి.మీ. మేర టన్నెల్, మరో 3.05 కి.మీ. ఓపెన్ కెనాల్‌తో నీటిని దుందుభి నదిలో పోస్తారు. అక్కడి నుంచి డిండి ఎత్తిపోతలకు తీసుకెళతారు.

భూభారతి అమలు ఎప్పటి నుంచి?

అసెంబ్లీ ఆమోదం పొంది నెల రోజులు .. నిబంధనల తయారీపై మొదలుకాని కసరత్తు

- ధరణి సాఫ్ట్‌వేర్ చిక్కులతో మరింత జాప్యం అయ్యే అవకాశం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అసెంబ్లీ ఆమోదం పొంది నెల రోజులు దాటింది. ఈ నెల 4వ తేదీన గెజిట్ కూడా విడుదలైంది. ఇక మిగిలింది చట్టం అమలుకు అవసరమైన నిబంధనల రూపకల్పనే. అయితే నిబంధనల తయారీ కోసం ఇప్పటి వరకు కసరత్తే మొదలు కాలేదని తెలుస్తోంది. ఆమోదం పొందిన నెల రోజుల్లో చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తామనే అప్పట్లో ప్రకటనలు చేసినా.. ఆచరణలో మరింత జాప్యం అయ్యేలా ఉందనేది రెవెన్యూవర్గాల సమాచారం. కనీసం అయిదు నెలల సమయం పట్టవచ్చని తెలుస్తోంది. కొత్త చట్టం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రెవెన్యూ యంత్రాంగానికి అన్ని దశల్లో శిక్షణ ఇస్తామని ఇటీవల ఆ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. అయితే, నిబంధనలు తయారైతే తప్ప చట్టం అమలుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చే పరిస్థితి లేదు. ధరణి తరహా లోపాలు పునరావృతం కాకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే నిబంధనలు తయారు చేయాల్సి ఉందని అధికారులు సూచిస్తున్నారు.

సునీలా? సీసీఎల్ఏనా?

భూభారతి చట్టం నిబంధనలు ఎవరు తయారు చేస్తారనే అంశంపై రెవెన్యూ వర్గాల్లో పలు రకాల చర్చ జరుగుతోంది. ధరణి కమిటీలో కీలకంగా వ్యవహరించిన భూ చట్టాల నిపుణుడు సునీల్ ద్వారానే నిబంధనలు తయారు చేయిస్తారా లేక 'భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం స్వయంగా రూపొందిస్తుందా అనే దానిపై స్పష్టత లేదు. వాస్తవానికి సీసీఎల్ఏనే ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించాల్సి ఉంది. భూభారతి చట్టం ఆమోదం పొందిన తరువాత సునీల్‌తో నవీన్ మిట్టల్ ఇప్పటికే రెండు పర్యాయాలు సమావేశమయ్యారు. నిబంధనల రూపకల్పనపైనే వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. 1971 ఆర్వోఆర్‌కు (రికార్డ్ ఆఫ్ రైట్స్-భూ హక్కు దస్తావేజుల)కు సంబంధించి 1980లో వచ్చిన నిబంధనల్లోనే కొన్ని మార్పులు చేస్తే సరిపోతుందనే ప్రతిపాదన వచ్చింది. అయితే, ఆ నిబంధనలు ఇప్పటి అవసరాలకు సరిపోవని భావించిన సీసీఎల్ఏ కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టిపెట్టింది. కానీ అడుగులు మాత్రం ఇంత వరకు ముందుకు పడలేదు. ఇదంతా ఒక ఎత్తైతే ధరణి నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఎన్ఐసీకి సాఫ్ట్‌వేర్ పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇవన్నీ అధిగమిస్తే తప్ప కొత్త పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి. ఎలాంటి సాంకేతిక అవరోధాలు లేకుండా ఎన్ఐసీ.. ధరణి పోర్టల్‌ను నిర్వహించడానికి మరో రెండు నెలలకుపైగా సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటి వరకు కొత్త చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలపై దృష్టి సారించే అవకాశం లేదనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇదే నిజమైతే కొత్త చట్టం అమల్లోకి రావడానికి మరో నాలుగు నెలలు పట్టొచ్చనే వాదనలు ఉన్నాయి. భూభారతి ముసాయిదాను బహిరంగంగా వెబ్‌సైట్‌లో పెట్టినట్లుగా నిబంధనల ముసాయిదాను కూడా బహిరంగపరిస్తే మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది.

నిబంధనలు వస్తేనే పోర్టల్

నిబంధనల రూపకల్పన పూర్తయితే తప్ప ధరణి స్థానంలో భూభారతి పోర్టల్ అందుబాటులోకి రాదు. చట్టాన్ని అమలు చేయడానికి అవసరమైన నిబంధనలపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చిన తర్వాతే పోర్టల్ అప్లికేషన్స్‌లో మార్పులు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే భూభారతి నమూనాకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసుకున్న సీసీఎల్ఏ అధికారులు.. చట్టం అమలుకు సంబంధించిన నిబంధనల కోసం వేచి ఉన్నారు.

రసాభాసగా మారిన గ్రామసభలు

తప్పుల తడకగా పథకాల జాబితా.. అనర్హుల పేర్లే అధికం

మళ్లీ లక్షల్లో దరఖాస్తులు..

రశీదులు అడుగుతున్న దరఖాస్తుదారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయబోయే 4 పథకాల కోసం అర్హులు, అనర్హులను ఖరారు చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలు రసాభాసగా మారాయి. అర్హుల ప్రాథమిక జాబితా తప్పుల తడకగా మారింది. ఒకచోట గ్రామసభలో ప్రకటించినదే తుది జాబితా అని చెబుతుండగా, మరోచోట జాబితాల్లో వచ్చిన పేర్లే ఖరారయినట్టు కాదని అధికారులు, సిబ్బంది చెబుతుండడం గందగోళానికి తెరదీసింది. ఇదే సమయంలో ప్రాథమిక జాబితాలో పేర్లు రాని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే 2023 డిసెంబరులో నిర్వహించిన ప్రజాపాలనలో, గతేడాది నిర్వహించిన కులగణనలోనూ తాము ఇల్లు లేదని, రేషన్‌కార్డు లేదని వెల్లడించామని అయినా మళ్లీ దరఖాస్తు చేసుకోవడమేంటి అంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఎప్పుడు ఖరారు చేస్తారంటూ స్థానిక అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు సరైన సమాధానం చెప్పలేకపోవడం మరింత ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం దగ్గర ఉన్న జాబితాలో లేనివారు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు, రైతుభరోసా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కానీ గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను ఖరారు చేసేందుకు సూచనలను విడిగా ఇస్తామంటూ ఇటీవల సీఎస్ కలెక్టర్లకు పంపిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనపై అధికారులు సరైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. ఫలితంగా 26న అమలు చేయబోయే పథకాల అర్హుల జాబితాలో తమకు అవకాశం ఉండబోదంటూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుంటున్న వారు వాపోతున్నారు. పలు చోట్ల ఘర్షణ వాతావరణం నెలకొంది. 4 పథకాలకు మళ్లీ లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తులకు రశీదు ఇవ్వడంలేదు. దీనిపైనా అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక జాబితాల్లో అనర్హుల పేర్లే అధికంగా వస్తున్నాయని, తమ పేర్లు ఎందుకు రావడంలేదంటూ స్థానిక ప్రజా ప్రతినిధులకు కూడా సెగ తగులుతోంది. గ్రామసభలు శుక్రవారంతో ముగియనున్నాయి.

ప్రజాపాలన గ్రామసభలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో మనస్తాపం



చికిత్స పొందుతున్న నాగేశ్వర్‌రావు

ములుగు, జనవరి 23(ఆంధ్ర జ్యోతి): ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో గురువారం జరిగిన గ్రామసభలో కుమ్మరి నాగేశ్వర్‌రావు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొత్తూరుకు చెందిన నాగేశ్వర్‌రావు ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో అధికారులను నిలదీశాడు. అధికారులు వివరణ ఇస్తుండగానే తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన వెంట తెచ్చుకున్న పురుగులమందును తాగాడు. వెంటనే అతన్ని ఏటూరునాగారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హనుమకొండకు తరలించారు.

తిరోగమన దిశలో రాష్ట్రం

» కాంగ్రెస్ మోసపూరిత హామీలకు అంతే లేదు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను అన్ని రంగాలలో తిరోగమన దిశలో నడిపించాలని కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకొని పని చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రైతులు, కార్మికులు, వ్యాపారులు ఎవరూ సంతృప్తికరంగా లేరని విమర్శించారు. రైతు భరోసా, రుణ మాఫీ అరకొరగానే అమలు చేస్తున్నారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చేయట్లేదని, యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతిని ఇవ్వట్లేదని, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయట్లేదని పేర్కొన్నారు. దళితులకు ఇస్తామన్న రూ. 12 లక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడో మరిచిపోయిందని, ఆటో డ్రైవర్లు మొదలుకొని గీత కార్మికుల వరకూ కార్మికులకు ఇస్తామన్న భరోసాను ఇవ్వబోదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలకు అంతే లేదని గురువారం ఎక్స్ వేదికగా కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతూ వ్యాపారాలకు అనువైన వాతావరణాన్ని దెబ్బతీసిందని ఆరోపించారు.

లెండి ప్రాజెక్టు పూర్తికి సహకారం అందించాలి

» మహారాష్ట్ర ప్రజాప్రతినిధులను కోరిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర-తెలంగాణ అంతరాష్ట్ర ప్రాజెక్టు లెండి నిర్మాణం పూర్తి చేయడానికి తగు సహకారం అందించాలని మహారాష్ట్ర ప్రజాప్రతినిధులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో మంత్రిని నాందేడ్ ఎంపీ రవీంద్ర చవాన్, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు పాటిల్‌తోపాటు పలువురు ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా లెండి ప్రాజెక్టుపై వారితో మంత్రి ఉత్తమ్ చర్చించారు. 1984లో రూ.2,183.88 కోట్ల అంచనా వ్యయంతో మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముద్ఖేడ్ తాలూకాలో లెండి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, ఈ ప్రాజెక్టు పూర్తయితే మహారాష్ట్రలో 27,710 ఎకరాలు, తెలంగాణలో 38,573 ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. ఇప్పటి దాకా ఇరు రాష్ట్రాలు ఈ ప్రాజెక్టుపై రూ.1,040.87 కోట్లు వెచ్చించాయని, ఎర్త్‌డ్యామ్ పనులు 70శాతంవరకు, స్పిల్‌వే పనులు 80శాతం వరకు పూర్తయ్యాయని, కాలువల నిర్మాణం పురోగతిలో ఉందని గుర్తు చేశారు. 2011లో భూనిర్వాసితుల సమస్య కారణంగా పనులు ఆగిపోయాయని, ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఇంకా రుణమాఫీ కానీ ఆ రైతులకు మార్చిలో చేస్తాం: మంత్రి పొన్నం

హుస్నాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షలకు పైగా రుణాలుండి ఇంకా మాఫీ అమలు కానీ రైతులకు మార్చిలో షెడ్యూల్ పెట్టి చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ప్రజాపాలన వార్డు సభలో మాట్లాడారు. వార్డు, గ్రామ సభల్లో దరఖాస్తును స్వీకరించాలన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలో ఎవరి జోక్యం ఉండదని, అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు.

గ్రామీణ రోడ్లకు రూ.2,773 కోట్లు: సీతక్క

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్లెల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కోసం గ్రామీణప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి తాజాగా రూ.2,773 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, సహచర మంత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ప్రగతిభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి మంత్రి సీతక్క సత్కరించారు. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే రూ.2682.95కోట్లు మంజూరు చేశామని, ప్రస్తుతం మంజూరైన నిధులతో గ్రామాలు, తండాలు, గూడేల్లో బీటీ రోడ్లు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపడతామని మంత్రి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్ల కోసం రూ.1,419 కోట్లు, పీఎం జన్‌మన్ నిధులతోపాటు రాష్ట్ర వాటాకింద విడుదల చేసిన రూ.66కోట్లతో 25 ఆదివాసీ గుడాలకు బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ దృష్ట్యా పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులకు వాహన సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. పనుల పర్యవేక్షణలో కీలకంగా పనిచేసే 237 మంది ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఎస్ఈలకు ప్రతినెల రూ.33వేల చొప్పున అద్దె చెల్లించేలా రూ.5కోట్లు మంజూరు చేసినట్లు సీతక్క తెలిపారు. ఇదిలా ఉండగా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఆన్‌లైన్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు సంబంధిత విభాగాలు తెలిపాయి.

పంచాయతీరాజ్ రోడ్లకూ టీరక్షా యాప్

» హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాలశాఖ నిర్వహణలో ఉన్న దాదాపు 30 వేల కిలోమీటర్ల పొడవైన రోడ్ల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణకు ఇప్పటికే టీ-రక్షా యాప్‌ను అభివృద్ధి చేశామని.. పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నిర్వహించే రోడ్లకు సైతం టీ-రక్షా అప్లికేషన్ పరిధిలోకి తీసుకొస్తామని హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ రోడ్లకు సంబంధించి అప్లికేషన్‌ను ఇంకా అభివృద్ధి చేయలేదని పేర్కొంది. రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు 2022లో జారీచేసిన మార్గదర్శకాలు తెలంగాణలో అమలు కావడం లేదని.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో డ్రైనేజీలు, రోడ్ల నిర్వహణకు ఆయా ప్రభుత్వాలు మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి చేయడం సహా పలు చర్యలు చేపట్టాయని.. వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని పేర్కొంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి మరింత సమయం ఇస్తూ విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది.

కోకాపేటలో బీఆర్ఎస్‌కు 11 ఎకరాలపై.. కౌంటర్‌కు 4 వారాల సమయం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో అత్యంత ఖరీదైన 11 ఎకరాల భూమిని అతితక్కువ ధరకే బీఆర్ఎస్ పార్టీకి కేటాయించిన వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయడానికి మరో నాలుగు వారాల పాటు ప్రభుత్వానికి హైకోర్టు సమయం ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని 239, 240 సర్వే నంబర్లలో ఉన్న 11 ఎకరాల భూమిని బీఆర్ఎస్‌కు కేటాయిస్తున్నట్లు అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపులను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రాధారాణి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్‌లో ప్రభుత్వం ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదని ఏజీ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. మరింత సమయం ఇవ్వాలని కోరడంతో 4వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పేర్కొంది.

'పాలమూరు'కు జైపాల్‌రెడ్డి పేరు.. గెజిట్ జారీ

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా గురువారం జీవో జారీ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇకపై సూదిని జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంగా దీన్ని పిలవనున్నారు. ఇక సంగారెడ్డి జిల్లాలోని అంథోల్‌లో ఉన్న బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు కింద ఉన్న కాలువలకు 'శ్రీ సిలారపు రాజనర్సింహా సింగూరు కాలువలు'గా మారుస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

దావోస్ ధమాకా!

(మొదటిపేజీ తరువాయి)

అద్భుతమైన విజయం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దావోస్‌లోనే గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ కంపెనీలు ఎంత ఆసక్తిగా ఉన్నాయో వీటినిబట్టి అంచనా వేయవచ్చని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఒప్పందాలు సాధించడానికి శ్రమించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, యువతకు ఉద్యోగాల కల్పన కోసం చేసిన ఈ పర్యటన ఎంతో సంతృప్తిని కలిగించిందని చెప్పారు. గత ప్రభుత్వంలా కేవలం ఒప్పందాలు కుదుర్చుకోవడం వరకే తాము పరిమితం కాబోమని, కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ కార్యరూపం దాల్చేంతవరకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాగా వారం రోజులుగా సింగపూర్, దావోస్ పర్యటనల్లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం రాష్ట్రానికి తిరిగి పయనమైంది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ చేరుకోనుంది. కాగా, తెలంగాణ బృందం చివరి రోజు గురువారం అనేక అంతర్జాతీయ కంపెనీలతో భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది.

అమెజాన్ రూ.60 వేల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్‌లో రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ కంపెనీ అంగీకరించింది. డేటా సెంటర్లలో ఈ పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అమెజాన్ ఇప్పటికే నగరంలో మూడు డేటా సెంటర్లను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి. విస్తరణలో భాగంగా మరిన్ని నెలకొల్పనుంది. దావోస్ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ పుంకే భేటీ అయ్యారు. దాదాపు రూ.60,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్‌లోని తమ అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్లను పెద్ద ఎత్తున విస్తరిస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన భూమిని కేటాయించాలని అభ్యర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించింది. ఈ ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో డేటా సెంటర్ల కేంద్రంగా తిరుగులేని గుర్తింపు సాధిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాగా, తెలంగాణలో 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెడతామని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది.

15 వేల కోట్లతో టిల్మాన్ గ్లోబల్స్ డేటా సెంటర్

హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ముందుకొచ్చింది. రూ.15 వేల కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ప్రెసిడెంట్ సచిత్ అహూజాతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా అహూజా మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామి కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, అత్యాధునిక సోలార్ సెల్స్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌ను స్థాపించేందుకు మైత్రా ఎనర్జీ గ్రూప్ అనుబంధ కంపెనీ అక్షత్ గ్రీన్ టెక్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ కంపెనీ రాష్ట్రంలో 6.9 గిగావాట్ల సోలార్ సెల్స్; 6.9 గిగావాట్ల సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టుపై రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా, దాదాపు 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. స్థానికంగా మరింత మందికి ఉపాధి లభిస్తుంది. సదస్సులో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల సమక్షంలో అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా గ్రూప్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీ తరఫున డైరెక్టర్ గిరీశ్ గెల్లి సమావేశానికి ప్రాతినిధ్యం వహించారు.



విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

రూ.5 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. కంపెనీ సీవోవో సతీశ్ అబ్బూరి, సీఆర్వో ఎరిక్ వార్నర్ దీనిపై సంతకం చేశారు. హైదరాబాద్‌లో 100మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని కంపెనీ సీఈవో పెందుర్తి అన్నారు. ఇందులో హైబ్రిడ్ ఏఐ చిప్‌లను ఉపయోగిస్తామని, ప్రాజెక్టుపై రూ.5000 కోట్లు వెచ్చిస్తామని ప్రకటించారు. డేటా సెంటర్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల్లో ప్రపంచ అగ్రగామి సంస్థ అయిన బ్లాక్ స్టోన్ హైదరాబాద్లో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు రూ.4,500కోట్ల పెట్టుబడి పెడుతుంది. ఇంధన సామర్థ్యం, శీతలీకరణ వ్యవస్థలు, సైబర్ భద్రతా ప్రొటోకాల్ అవసరాలకు సంబంధించి ఏఐ ఆధారిత సేవలను ఈ సెంటర్ అందిస్తుంది.

హైదరాబాద్‌లో ఎక్లాట్ హెల్త్ విస్తరణ

ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ రాష్ట్రంలో మరో ఆఫీసు ఏర్పాటు చేయనుంది. దాదాపు 800 మంది ఉద్యోగులకు సదుపాయముండేలా దీన్ని నెలకొల్పుతుంది. ఈ ఏడాది ఏప్రిల్‌నాటికే ఇది పని చేయడం ప్రారంభిస్తుంది. సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులతో ఎక్లాట్ కంపెనీ సీఈవో కార్తీక్ పోల్సాని సమావేశమయ్యారు. రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. వాషింగ్టన్ డీసీలో ప్రధాన కార్యాలయమున్న ఎక్లాట్ హెల్త్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 3,000 మందికిపైగా నిపుణులను నియమించింది.

ఇన్ఫోసిస్ విస్తరణతో 17 వేల ఉద్యోగాలు

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ ఐటీ క్యాంపస్‌ను విస్తరించనుంది. పోచారంలో ఉన్న క్యాంపస్‌లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అక్కడ సదుపాయాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సదస్సులో ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో జయేశ్ సంగ్రాజ్కా మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. అనంతరం మొదటి దశలో రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడతామని, వచ్చే రెండు మూడేండ్లలో దీని నిర్మాణం పూర్తవుతుందని ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు దేశంలో ప్రముఖ ఐటీ గమ్యస్థానంగా తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇప్పటికే ఇన్ఫోసిస్ హైదరాబాద్ కార్యాలయాల్లో దాదాపు 35 వేల మంది ఉద్యోగులున్నారు.

గోపనపల్లి విప్రో కొత్త క్యాంపస్

హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను విస్తరించనున్నట్లు విప్రో కంపెనీ ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గోపనపల్లిలో కొత్తగా మరో ఐటీ సెంటర్ నెలకొల్పనుంది. దీంతో అదనంగా 5000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. సదస్సులో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబుతో విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ సమావేశమయ్యారు. అనంతరం కీలక ప్రకటన విడుదల చేశారు. కొత్త ఐటీ సెంటర్ రాబోయే రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. విప్రోలాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కొత్త అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఉత్సాహంగా ఉందని ప్రేమ్‌జీ అన్నారు. కాగా, స్కిల్స్ యూనివర్సిటీతోపాటు వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి శ్రీధర్ బాబు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

రైతులకు సుహానా మసాలా శిక్షణ

సంగారెడ్డిలో ప్రస్తుతమున్న తమ ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను నెలకొల్పుతామని, ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సుగంధ ద్రవ్యాల సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తామని సుహానా సంస్థ ప్రకటించింది. సంస్థ డైరెక్టర్ ఆనంద్ చోర్డియా సదస్సులో మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. రాబోయే రెండు మూడేండ్లలో ఈ సెంటర్ ద్వారా 25 వేల నుంచి 30 వేల మంది రైతులకు శిక్షణనిస్తామని, సుగంధ ద్రవ్యాల నాణ్యత మరియు వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించే నైపుణ్యాలు అందిస్తామని తెలిపారు.

(రూ. కోట్లలో)

కంపెనీ	పరిశ్రమ	పెట్టుబడుల విలువ
యూనీలివర్	ఆయిల్‌పామ్ శుద్ధి	ప్రకటించలేదు
హెచ్‌సీఎల్ టెక్	కొత్త ఐటీ క్యాంపస్	ప్రకటించలేదు
అగిలిటీ	వ్యవసాయ టెక్నాలజీ హబ్	400
సిఫీ టెక్నాలజీస్	వరంగల్‌లో 200 మె.వా. డేటా సెంటర్	10,000
స్కైరూట్ ఏరోస్పేస్	రాకెట్ల తయారీ, ప్రయోగ కేంద్రం	500
కంట్రోల్ ఎస్	400 మె.వా. డేటా సెంటర్	10,000
మేఘా ఇంజినీరింగ్	1 గి.వా. ఎనర్జీ స్టోరేజ్, 2000 మె.వా. పంప్ స్టోరేజ్	15,000
ఫోనిక్స్	ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటీరియర్ డిజైనింగ్	250
ఉర్సా క్లస్టర్స్	డేటా సెంటర్	5,000
అమేజాన్ వెబ్ సర్వీసెస్	డేటా సెంటర్ల విస్తరణ	60,000
రామ్కీ గ్రూప్	డ్రై పోర్ట్, ఇండస్ట్రియల్ పార్క్	5,000
ఇన్ఫోసిస్	పోచారంలో కొత్త ఐటీ క్యాంపస్ విస్తరణ	ప్రకటించలేదు
విప్రో	గోపనపల్లిలో కొత్త ఐటీ క్యాంపస్ విస్తరణ	ప్రకటించలేదు
సుహానా మసాలా	పసుపు పరిశోధన, అభివృద్ధి కేంద్రం	ప్రకటించలేదు
సన్ పెట్రోకెమికల్స్	పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్	45,500
జెఎస్‌డబ్ల్యూ గ్రూప్	యూఏవీ మ్యానుఫ్యాక్చరింగ్	800
జేసీకే గ్రూప్	డేటా సెంటర్	4,500
తిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్	డేటా సెంటర్	15,000
మిత్రా ఎనర్జీ	సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్	7,000
ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్	ఐటీ విస్తరణ	ప్రకటించలేదు
మొత్తం		1,78,950

తెలంగాణకు శుభవార్త

» సీతారామ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులపై టీఏసీ సమావేశం

» 11న నిర్వహించనున్నట్లు సీడబ్ల్యూసీ సమాచారం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) శుభవార్త చెప్పింది. సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులిచ్చే అంశంపై చర్చించేందుకు సీడబ్ల్యూసీకి చెందిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) ఫిబ్రవరి 11న సమావేశం కానుంది. ఈ మేరకు గురువారం రాత్రి కేంద్ర జలవనరుల సంఘం సమాచారం ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరిపై ఒప్పందం కుదిరేదాకా లేదా ట్రిబ్యునల్ నీటి పంపకాలు తేల్చేదాకా సీతారామ ఎత్తిపోతల పథకం/ సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు డీపీఆర్‌ను తదుపరి క్లియరెన్స్‌ల కోసం కేంద్ర జలవనరుల సంఘానికి పంపించరాదని గోదావరి బోర్డును కోరుతూ ఏపీ లేఖ రాసిన విషయం విదితమే. ఇవేమీ పరిగణనలోకి తీసుకోకుండా సీతారామకు సాంకేతిక అనుమతులు ఇచ్చే అంశంపై చర్చించడానికి సీడబ్ల్యూసీ ముందుకెళ్లనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకాన్ని 2026 మార్చినాటికి పూర్తిచేసి 6.74 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఈ డీపీఆర్‌లకు సీడబ్ల్యూసీలోని డైరెక్టరేట్లన్నీ క్లియరెన్స్ ఇచ్చాయి. కేంద్ర జలశక్తి శాఖ గతంలో జారీ చేసిన ఫ్లో చార్ట్ ప్రకారం డీపీఆర్‌ను గోదావరి బోర్డుకు పంపించారు. ఆ డీపీఆర్‌ను బోర్డు పరిశీలించి, తెలుగు రాష్ట్రాల అభ్యంతరాలు/అభిప్రాయాలు జతచేసి, టీఏసీ క్లియరెన్స్ కోసం సీడబ్ల్యూసీకి పంపించింది. ఇటీవలే సీడబ్ల్యూసీ కొత్త చైర్మన్‌గా ముకేశ్‌కుమార్ సిన్హా నియమితులు కావడంతో టీఏసీ సమావేశానికి రూట్‌క్లియర్ అయింది.

నార్లాపూర్ రిజర్వాయర్ అంచనాలు మళ్లీ పెంపు

» 1784 కోట్లకు సవరించిన సర్కార్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తోన్న నార్లాపూర్ రిజర్వాయర్ అంచనాలను మళ్లీ సవరించారు. దీన్ని రూ.796 కోట్లతో చేపట్టగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1448 కోట్లకు పెంచారు. తాజాగా రూ.1784.30 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు. 6.4 టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్ కడుతున్నారు. ఇప్పటి దాకా 95శాతం మేర పనులు పూర్తయ్యాయి.

కేసీఆర్ ఫొటో ఉంటే తప్పా?

(మొదటిపేజీ తరువాయి)

తన ఇష్టమని అన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయన క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కొందరు లోపలికి దూసుకెళ్లి కేసీఆర్‌తో ఎమ్మెల్యే దిగిన ఫొటోలను తొలగించి, రేవంత్ ఫొటో పెట్టారు. దీనిపై ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్యాంపు కార్యాలయమంటే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఉండే నివాసమని, గతంలో రూ.300కోట్లతో నిర్మించ తలపెట్టిన ఆస్పత్రి శంకుస్థాపన సమయంలో అప్పటి సీఎం కేసీఆర్‌తో దిగిన ఫొటో ఉంటే తప్పేంటని ప్రశ్నించారు. నాయకులతో దిగిన ఫొటోలు ఇంట్లో పెట్టుకుంటే అభ్యంతరం ఏముందని ప్రశ్నించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో దిగిన ఫొటో పదేళ్లుగా ఉందని, దానిని కూడా తప్పుపడతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ కార్యకర్తలు, నాయకులను ఉసిగొల్పి తన క్యాంపు కార్యాలయంపై దాడిచేయించారని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు ఛీకొట్టినా ఆయనకు సిగ్గురాలేదని విమర్శించారు. కాగా, మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరి ఇంకా బీఆర్ఎస్ పాట పాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పటాన్‌చెరులో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అంబేడ్కర్ విగ్రహం ముందు బైఠాయించి.. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను ప్రదర్శిస్తూ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారి మధ్య తీవ్ర పెనుగులాట చోటుచేసుకుంది. కొందరు కార్యకర్తలు పోలీసుల వలయాన్ని తప్పించుకుని సీఎం ఫొటోతో పరుగులు తీస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి దూసుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఎమ్మెల్యే లేరు. వరండాలో ఉన్న గులాబీ కుర్చీలను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే క్యాబిన్‌లోకి దూసుకెళ్లి గతంలో కేసీఆర్‌తో ఎమ్మెల్యే దిగిన ఫొటోలను తొలగించారు. రేవంత్ రెడ్డి ఫొటో పెట్టి కాంగ్రెస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వారిని పోలీసులు చెదరగొట్టి బయటకు పంపించివేశారు. కాగా, మహిపాల్ రెడ్డి వర్గానికి, కాట శ్రీనివాస్‌గౌడ్ వర్గానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే పార్టీలోకి రావడాన్ని కాట వర్గీయులు తీవ్రంగా వ్యతికిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్న ఎమ్మెల్యే... కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆందోళనకు దిగారు. కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తానని ప్రతిజ్ఞ చేసిన మహిపాల్ రెడ్డిని వెంటనే పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరువులో ఇరు వర్గాల వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక అందించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టీఆర్‌జీ వినోద్ రెడ్డితో కమిటీని నియమించారు.



సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పారితోషికం పూర్తిగా వైట్‌లోనే!

» నేను తీసుకునేదే తక్కువ.. అది కూడా ఆఫీసులోనే తీసుకుంటా: హీరో వెంకటేశ్

» 'సంక్రాంతికి వస్తున్నాం' అన్నట్లుగా.. ఐటీ అధికారులు వచ్చారు : అనిల్ రావిపూడి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాను నటించే సినిమాలకు పారితోషికాన్ని పూర్తిగా వైట్‌లోనే (ఆదాయపు పన్ను లెక్కల్లో చూపించే డబ్బునే) తీసుకుంటానని ప్రముఖ సినీ హీరో వెంకటేశ్ వెల్లడించారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విజయోత్సవ వేడుకను ఆ చిత్ర యూనిట్ గురువారం హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకర్లతో మాట్లాడుతూ ఐటీ సోదాలపై స్పందించారు 'ఇండస్ట్రీలోని ప్రముఖుల మీద ఐటీ రైడ్స్ జరుగుతున్నాయని అంటున్నారు. మిగతా హీరోలు పారితోషికం ఎలా తీసుకుంటున్నారనేది నాకు తెలియదు. నేను మాత్రం పారితోషికం మొత్తం వైట్‌లో తీసుకుంటా. అయినా నేను తీసుకునేదే తక్కువ. అది కూడా ఆఫీసులో నేరుగా తీసుకుంటా' అని స్పష్టం చేశారు. సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. 'మేం మా సినిమాకు 'సంక్రాంతికి వస్తున్నాం' అని పేరు పెట్టామని ఐటీ అధికారులు కూడా గట్టిగా ఫిక్సయినట్టున్నారు. మేం కూడా సంక్రాంతికి వస్తున్నాం అంటూ సోదాలు మొదలుపెట్టారు' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. రెండుమూడేళ్లకోసారి సినిమా పరిశ్రమపై, వ్యాపార సంస్థలపైన ఐటీ సోదాలు జరగడం మామూలేనని పేర్కొన్నారు. తన ఇంట్లో ఎలాంటి సోదాలు జరగలేదనితెలిపారు. 'మా నిర్మాత దిల్‌రాజు బాధపడడం లేదు. మేం వచ్చినా రాకపోయినా సినిమా ప్రమోషన్స్ ఆపొద్దు. ఈ సినిమా విజయాన్ని ప్రజల మధ్యన వేడుక చేసుకోవాలని చెప్పారు' అని తెలిపారు.

కొనసాగుతున్న సోదాలు

సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో వరుసగా మూడోరోజైన గురువారం ఐటీ సోదాలు కొనసాగాయి. దిల్ రాజు కుమార్తె హన్సితారెడ్డి, వ్యాపార భాగస్వామి శిరీష్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. దిల్ రాజు నుంచి పరోక్ష పెట్టుబడులు అందుకున్నట్లు భావిస్తున్న మ్యాంగో మూవీస్ సంస్థలోనూ సోదాలు జరిపారు. ఆ సంస్థ యజమాని రామ్‌ను ప్రశ్నించి పలు కీలక పత్రాలను తీసుకెళ్లినట్లు సమాచారం. కొందరు ఫైనాన్షియర్ల వివరాలు, బినామీ ఖాతాల సమాచారాన్ని ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, దిల్ రాజు తల్లి గురువారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. ఆమెను దిల్‌రాజు కుమార్తె ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి తిరిగి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా, ఫోన్ వచ్చిందంటూ ఐటీ అధికారిణి దిల్ రాజుకు ఫోన్ ఇవ్వబోగా.. ఆయన ఫోన్ తీసుకోకుండా అసహనం వ్యక్తంచేశారు. దిల్ రాజు సోదరుడు విజయసింహారెడ్డి ఇల్లు, ఆఫీసులోనూ సోదాలు జరిగాయి. మైత్రీ మూవీ మేకర్స్‌కు చెందిన నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, ఆ సంస్థ సీఈఓ చెర్రీ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు కొనసాగాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


IN THEATRES
FROM JAN 31ST
GEMINI FILM CIRCUIT PRESENTS VISHAL IN
మదగజరాజ
SUNDAR C
VIJAY ANTONY
RICHARD M. NATHAN
PRAVEEN K L - SREEKANT N B | VENKATT RAGAVAN | SHASHANK VENNELAKANTI | GURURAJ
SUPER SUBBARAYAN | BRINDA - SHOBI | R.P. BALAGOPI | V. RAJAN | K. MOHAN | VAMSI SHEKAR | SINDHU GRAFIX
A SATHYA KRISHNAN PRODUCTIONS RELEASE